మాసైజ్ గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విశాఖపట్నం
fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 75 పేజీలు: 16 వెల: 6.50

వికసిత్ భారత్‌కు 9 సూత్రాలు: ప్రధాని మోడీ 5లో

డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి ద్రోహం: స్టాలిన్

# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్

**పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కింజారపు రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, కిలారు రాజేష్**

**పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన టిడిపి**

**కమిటీల కూర్పులో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట**

**పొలిట్‌బ్యూరోలో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించిన అధిష్ఠానం**

**మహిళలకు, యువతకు ప్రాధాన్యతనిస్తూ నూతన కమిటీల ఏర్పాటు**



**విజయవాడ, ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీలో సరికొత్త మార్పులు చోటు చేసుకున్నాయి.పార్టీలో యువతకు, మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించారు.ఇందులో భాగంగా నూతన నాయకత్వానికి, కొత్త సమీకరణాలకు టీడీపీ అధిష్టానం శ్రీకారం చుట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఈ పునర్ వ్యవస్థీకరణలో అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను నియమించారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేశ్‌కు ప్రమోషన్ వచ్చిందనే చెప్పాలి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ అధిష్టానం కొత్త బాధ్యతలు అప్పగించింది. టీడీపీ చరిత్రలో ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్ హోదా లేదు. తొలిసారిగా కీలక పదవిని సృష్టించింది.ఇక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కింజరపు రామ్మోహననాయుడు,బైరెడ్డి శబరి, కిలారు రాజేష్‌లు నియమితులయ్యారు. సీనియర్ల అనుభవానికి, యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక కోణంలో కమిటీలను కూర్పు చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ కసరత్తు చేశారని పల్లా పేర్కొన్నారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయులుగా ఉంటూ, కష్టపడి పనిచేసిన వారికి ఈ నియామకాల్లో పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా, క్షేత్రస్థాయి కార్య కర్తలకు సైతం అత్యున్నత పదవులు కట్టబెడుతూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌కు నేరుగా పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఈ కమిటీల కూర్పులో సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. 185 మంది సభ్యులున్న రాష్ట్ర కమిటీలో 122 మంది బడుగు,బలహీన వర్గాల వారేనని పల్లా తెలిపారు. ఇందులో బీసీలకు 77 (40 ), ఎస్సీలకు 25 (25 ), ఎస్టీలకు 7 (3.8 ), మైనార్టీలకు 13 (7)చొప్పున స్థానాలు కల్పించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మహిళలకు పెద్దపీట వేశారు. >>2



బుధవారం అన్న క్యాంటీన్‌లో వడ్డన చేస్తున్న సిఎం చంద్రబాబు

# అన్నార్తులకు అండగా అన్న క్యాంటీన్లు

2లో

# ఇంటర్‌లో బాలికల హవా

**ఫస్టియర్-77%, సెకండియర్-81%, ఉత్తీర్ణత**

**ద్వితీయంలో 92%తో కృష్ణ ఫస్ట్, గుంటూరు సెకండ్**

**20 నుంచి 27 దాకా రీకౌంటింగ్‌కు అవకాశం**

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గత 12 ఏళ్లలోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది ఫలితాల్లో నమోదైందని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ జూనియర్ కళాశాలల్లో గణనీయమైన పురోగతి కనిపించిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత శాతం 54 శాతంగా నమోదై గత 12 ఏళ్లలో అత్యధికంగా నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో 68 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు కావడం కూడా గత 12 ఏళ్లలో రెండో అత్యుత్తమ ఫలితంగా నిలిచిందని తెలిపారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్ల శ్రమతో పాటు అన్ని వర్గాల సమిష్టి కృషి కారణమైందని అభినందించారు. ఇక ఫలితాల వివరాలను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ భాష వివరించారు. ప్రథమ సంవత్సరం 77 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండింటిలోనూ బాలికలే పై చేయి సాధించారు. మొదటి సంవత్సరానికి సంబంధించి గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు కాగా ద్వితీయ సంవత్సరంలో రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం కావటం విశేషం. ఈ సారి విజయం సాధించలేకపోయిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా ఒక పాఠంగా తీసుకుని మరింత కృషి చేసి తిరిగి విజయాన్ని సాధించాలని మంత్రి లోకేశ్ సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం విద్యార్థులకు మానసికంగా తోడ్పాటునందించాలని కోరారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం బాలుర 72శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం బాలురు 76శాతం, బాలికలు 85 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి ఏడాది 4,71,864మంది పరీక్షలకు హాజరుకాగా 3,61,526 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది 4,46,537 మంది పరీక్షలు రాయగా 3,59,816 మంది ఉత్తీర్ణత సాధించారు.వొకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి ఏడాది 38,443మంది పరీక్ష రాయగా 23,569మంది పాస్ అయి 61 శాతం ఉత్తీర్ణతసాధించారు. రెండో ఏడాది ఒకేషనల్ కోర్సుల్లో 33,852 మంది >>2


బుధవారం పేలుడు ధాటికి ధ్వంసమైన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

# కదిరిలో భారీ పేలుడు

**మహిళ సహా నలుగురు అక్కడికక్కడే మృతి**

**21 మందికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం**

**జెలిటిక్స్ పేలుడువల్లే దుర్ఘటన**

**క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్**

**కదిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిలో విషాధం నెలకొంది. జెలిటిక్స్ పేలుడు భారీగా సంభవించడంతో 3 ఇంట్లు దగ్ధం కాగా ప్రమాదంలో మహిళతో సహా నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 21 మందికి తీవ్ర గాయాలు కాగా కదిరి ప్రభుత్వ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రమాదంలో విశ్వ నాథ్‌రెడ్డి, మాబున్నీసా, అస్లాం, మధులు మృతి చెందగా, అశోక్ అనే యువకుని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులందరూ నిరుపేదలు కావడంతో కుమ్మరవాండ్ల పల్లిలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు పోలీ సులు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్టం కొత్తగూడెంకు చెందిన వెంకన్న గత 10 సం వత్సరాల క్రితం కుమ్మరవాండ్లపల్లిలో >>2

**బీహార్ సిఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం** 2లో



16-4pg2exHMNWJQE.qxd:16-4pg2exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1





బుధవారం ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# అన్నార్తులకు అండగా అన్న క్యాంటీన్లు

## ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### రాష్ట్రంలో 269కి చేరిక

**విజయవాడ ఏప్రిల్ 15, ప్రభాతవార్తప్రతినిధి:** పేదల ఆకలి తీరిస్తేనే అభివృద్ధి సాధించినట్టు విశ్వసిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృధా అని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పలనాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో కార్మికులతో కలిసి సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ధరణికోటలో ఏర్పాటు చేసిన రూరల్ అన్న క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసిన ముఖ్యమంత్రి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకముందు క్యాంటీన్‌కు వచ్చిన పేదలు, కార్మికులకు ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. లబ్దిదారులతో ముచ్చటిస్తూ అన్న క్యాంటీన్‌లోనే సీఎం ఆహారాన్ని తీసుకున్నారు. అన్న క్యాంటీన్లలో అందిస్తున్న భోజనం రుచి, శుభ్రత, నాణ్యతల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కడుపు నిండితేనే నిజమైన అభివృద్ధి నేను నమ్ముతాను. అందుకే పేదవాడి ఆకలికి తీర్చడానికి ప్రజాప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే నా రాజకీయం అని ఎన్టీఆర్ రూ.2 లకే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రత పథకానికి నాంది పలికారు. నిత్యాన్నదాతగా డొక్కా సీతమ్మ పేరు అజరామరం. ఆకలి అన్న వాళ్ల కాదనకుండా అన్నం పెట్టడం మన సంస్కృతిలోనే ఉంది. సంక్షేమం అనేది తెలుగుదేశం పార్టీ సిద్దాంతంలోనే ఉంది. నాటి రెండు రూపాయల కిలో బియ్యం నుంచి నేటి అన్నా క్యాంటీన్ల వరకు ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. 2024లో అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ముందుగా పట్టణ ప్రాంతాల్లో అన్నక్యాంటీన్లు ప్రారంభించాం. ఇవాల్టి నుంచే గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్నక్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే పట్టణాల్లో 204, గ్రామాల్లో 65 కలిపి ఈ సంఖ్య 269కి పెరిగింది. త్వరలో మరో 5 క్యాంటీన్లు సిద్ధం అవుతున్నాయని" సీఎం స్పష్టం చేశారు.

**అక్షయ పాత్రకు అభినందనలు:**

'అన్న క్యాంటీన్లకు నిరంతరం ఆహార సరఫరా చేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ను అభినందిస్తున్నాను. 25 ఏళ్లుగా ఈ ఫౌండేషన్ 500 కోట్ల భోజనాలను సరఫరా చేసింది. అన్న క్యాంటీన్లలో రూ.5కే అందిస్తున్న భోజనం పేద వాళ్లు, ఆటోడ్రైవర్లు, ముఠా కార్మికులు, కూలీలకు ఆసరాగా నిలుస్తోంది. అన్నక్యాంటీన్ల ఏర్పాటుతో వారి డబ్బు ఆదా అయ్యి ఇతర అవస రాలకు ఉపయోగపడుతుంది. ఒక్కో అన్నా క్యాంటీన్‌లో రోజుకు సగటున 1,013 మంది ఆహారాన్ని తీసుకుంటున్నారు. దీని నిర్వహణ కోసం రూ.26,250 ఖర్చు అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. దీనికోసం రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతోంది. ఇప్పుడు కొత్తగా పెట్టిన 62 గ్రామీణ అన్న కాంటీన్లలో ఆహార సబ్సి డీకిరోజుకు మరో రూ.18లక్షలు, ఏడాదికి రూ.58 కోట్లు అవుతుంది. కొత్త క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43కోట్ల వ్యయం అయ్యింది. గడచిన 21నెలల్లో అన్నక్యాంటీన్లలో 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఇప్పటి వరకూ అన్నక్యాంటీన్ సబ్సిడీకోసంరూ.243 కోట్ల మేర ఖర్చు చేశాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేదల పొట్టగొట్టిన గత పాలకులు:** "గత పాలకులు ఆకలి తీర్చే అన్నపూర్ణ వంటి అన్న క్యాంటీన్లపైనా దాడులు చేశారు. పేదల కడుపు నింపుతున్న పథకాన్ని నిలిపివేశారు. వ్యక్తులు, సంస్థలు స్వచ్ఛందంగా అన్నదానం చేస్తుంటే దానిలో మట్టి పోసి, దాడులు చేసి అడ్డుకున్నారు. వైసీపీకి కావాల్సింది విధ్వంసం, హింస, కూల్చడం, నరకడం, నాశనం చేయడమే. ఏ రాజకీయపార్టీ అయినా ప్రజలకు ఏం చేస్తామో చెబుతుంది. కానీ వైసీపీ మాత్రం రప్పా రప్పా చేస్తాం, 2029లో విధ్వంసం చూపిస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. అందుకే ఆ పార్టీ పేరు గొడ్డలి పార్టీగా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హత ఆ పార్టీకి లేదు అని "ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇంఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, కలెక్టర్ కృతికా శుక్లా, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్

>>రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీ ల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. 2029ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పున ర్విభజన, 33శాతం మహిళా రిజర్వేషన్లువంటి భవిష్యత్ పరిణామాలను అంచనా వేస్తూ ఈ కమి టీలను రూపొందించారని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నియామకాల ద్వారా నామినేటెడ్ పదవులు ఆశించిభంగపడిన వారికి న్యాయం చేశామని, పార్టీబలోపేతానికి ఈ మార్పులు దోహద పడతాయని ఆయన ధీమా వ్యక్తంచేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చంద్రబాబు కమిటీల కూర్పుచేశారు. యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇచ్చారు. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ, 33 శాతం మహిళారిజర్వేషన్ల నేపథ్యంలో కేటాయింపులుచేశారు. విధేయత, కష్టపడే తత్వం, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో చోటు దక్కనివారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్ద పీట వేస్తూ కమిటీల కూర్పు చేశారు.

# ఇంటర్‌లో బాలికల హవా

>> పరీక్ష రాస్తే 25,151 మంది పాసై 74 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

**మే 21 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు :** ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 92 శాతంతో కృష్ణా, గుంటూరు 88 శాతం, ఎన్టీఆర్ జిల్లాలు 87 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చివరి స్థానంలో చిత్తూరు 71శాతం, వైఎస్సార్ 71 శాతం, అన్నమయ్య జిల్లాలు 67 శాతంతో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కృష్ణా 90 శాతం, గుంటూరు 88 శాతం, విశాఖ జిల్లాలు 85 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో చివరి స్థానంలో వైఎస్సార్ 66 శాతం, నంద్యాల 66 శాతం, అన్నమయ్య జిల్లాలు 62 శాతంతో ఉన్నాయి.

**రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్:** కు ఏప్రిల్ 20 నుంచి 27వ తేదీ వరకూ అవకాశం ఉంది. మే 21 నుంచి జూన్ 4 వరకూ థియరీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 7 నుంచి 11 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. జూన్ 5న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూ, జూన్ 6న పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలు ద్వారా పొందే అవకాశం ఉంది. మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009 ద్వారాను ఫలితాలు చూసుకునే వెసులుబాటు కల్పించారు. ఫోన్ నంబరుకు హాయ్ అని సంక్షి ప్త సందేశం పంపించి, ఫలితాలు పొందే సదుపాయం కల్పించారు.



బుధవారం సిఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతల భేటీ దృశ్యం

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కలిసి కట్టుగా మద్దతు

## సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతల భేటీ

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళ రిజర్వేషన్ బిల్లుకు కలసి కట్టుగా మద్దతు తెలిపేం దుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతల భేటీ జరిగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమావేశంలో పలు అంశాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేసారు. పార్లమెంటులో ప్రవేశపెడుతోన్న నారీ శక్తి వందన్ చట్ట సవరణ బిల్లుపై సమావేశంలో చర్చించారు. బిల్లు ఆమోదం పొందాక చేపట్టాల్సిన నారీ శక్తి విజయోత్సవాలు, కార్యాచరణపై ఎన్డీఏ పక్ష నేతల సమాలోచనలు చేసారు. ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలని కోరుతూ రాష్ట్రంలోని వివిధ పార్టీల అధ్యక్షులకు, ఎంపీలకు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలు రాసారు.

# 40° పైనే ఉష్ణోగ్రతలు

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎండ తీవ్ర ప్రభావం చూపుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. బుధవారం 275 మండలాలోల్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఆయన వెల్లడించారు. గురువారం మన్యం, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో గరిష్ఠంగా 43-44డిగ్రీల సి, మధ్య ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. వడగాలులు, ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా: బూర్జ, హిరమండలం, పాతపట్నం మండలాలు: విజయనగరం, గంట్యాడ, గుర్ల మెంటాడ, మెరకముడిదాం, నెల్లిమర్ల, రాజాం, రామభద్రాపురం, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి తెర్లాం, వంగర మండలాలు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతంపేట, సీతానగరం, వరఘట్టం మండలాలు అల్లూరి సీతారామారాజు జిల్లా అనంతగిరి మండలాల్లో తీవ్ర వడగాలులు, 67 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు.



# టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరోమారు చింతకాయల విజయ్

## నిబద్ధతకు దక్కిన గుర్తింపు

**విశాఖపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చింతకాయల విజయ్‌ను పార్టీ అధిష్టానం మరోసారి నియ మించింది. 2019 ఎన్నికల అనంతరం పార్టీ తీవ్ర కష్టకాలంలో ఉన్న సమయంలో జెండాను భుజాన వేసుకుని నిలబడిన యువ నాయ కులలో విజయ్ ఒకరు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐటీడీపీ, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేసిన తరుణంలో, చంద్రబాబు, లోకేష్‌ల మార్గదర్శ కత్వంలో వారిని రక్షించే బాధ్యతను విజయ్ ధైర్యంగా స్వీకరించారు. చట్టపరంగా అలుపెర గని పోరాటం చేసి, సుమారు 228 మంది కార్యకర్తలకు బెయిల్ ఇప్పించి అండగా నిలిచారు. కార్యకర్తల కోసం అర్ధరాత్రి 2.30 వేళల్లో కూడా అందుబాటులో ఉండి ఆయన చేసిన కృషిని నారా లోకేష్ తన పాదయాత్రలో ప్రత్యేకంగా ప్రశంసించడం విశేషం. సంస్థాగత నిర్మాణంతో పాటు సాంకేతికతను పార్టీకి అను సంధానం చేయడంలో విజయ్ కీలక పాత్ర పో షించారు. ఐటీడీపీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిం చడమే కాకుండా, మన టీడీపీ యాప్‌ను విజయవంతంగా అమలు చేసి క్షేత్రస్థాయి కార్య కర్తలను నాయకత్వానికి చేరువ చేశారు. టెక్నా లజీ ఆధారిత మెంబర్‌షిప్ డ్రైవ్ బాధ్యతలను చంద్రబాబు నాయుడు స్వయంగా విజ య్‌కు అప్పగించడం ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. కోవిడ్ కష్టకాలంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు అందించడంతో పాటు జూమ్ కాన్ఫరెన్స్‌ల ద్వారా ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా నిలిచారు. పదవుల కోసం ఆశపడ కుండా, కష్టకాలంలో కార్యకర్తల రక్షణే ధ్యే యంగా పనిచేసిన విజయ్‌కు తిరిగి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, సంస్థాగత పట్టున్న విజయ్ వంటి నాయకులను భవిష్యత్తులో చట్టసభలకు పం పడం ద్వారా యువతకు, విధేయులకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందనే బలమైన సందేశం వెళ్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సెన్సస్ అధికారి జె.నివాస్

# డిజిటల్ జనగణన 2027ప్రారంభం

## ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్

**సచివాలయం,ఏప్రిల్ 15,ప్రభాతవార్త :** ప్రపంచంలోనే అతిపెద్ద గణాంక కార్యక్రమమైన జనగణన 2027 ప్రారంభానికి ఆంధ్రప్రదేశ్ రంగం సిద్ధమైందని ఈనెల 16నుంచి మొదటి దశగా ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన రాష్ట్రంలో ప్రారంభం కానుందని ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పరిపాలనా కార్యక్రమంగా నిలిచే ఈ జనగణన, ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడంతో పాటు స్వీయ-గణన సదుపాయం కల్పించడం ద్వారా ప్రత్యేకతను సంతరించుకుందని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో విజయవాడ పిఐబి సంచాలకులు జి.సురేష్‌కుమార్‌తో కలసి ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జనగణన ఒక రాజ్యాంగబద్ధమైన కార్యక్రమమని ఇది రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్లో 69వ అంశంగా పేర్కొన బడిందన్నారు. 1948జనగణన చట్టం మరియు 1990నియమాల ప్రకారం ఇది నిర్వహించబడు తుం దన్నారు. సేకరించిన వ్యక్తిగత సమాచారం సెక్షన్ 15ప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంచబడు తుందన్నారు. రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల సహకారంతో ఈ ప్రక్రియ అమలు చేయబ డుతుందన్నారు. 2011లో చివరి జనగణన నిర్వహించగా, 2027లో జరగబోయేది 16వది కాగా, స్వాతంత్ర్యం తర్వాత 8వదని ఆయన తెలిపారు.

# టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడిగా సానా సతీష్ బాబు

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సానా సతీష్ బాబు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమి టీలను ప్రకటించగా, మొత్తం 18 మంది సభ్యు లతో కూడిన జాతీయ ఉపాధ్యక్షుల బృందంలో సానా సతీష్ బాబుకు స్థానం కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాడర్ నుంచి లీడర్‌గా ఎదగడానికి అవకాశం తెలు గుదేశం పార్టీలోనే ఉంది. కష్టపడిన ప్రతి కార్య కర్తకు పార్టీ తప్పకుండా గుర్తింపు ఇస్తుంది" అని తెలిపారు. తన పై నమ్మకం ఉంచి ఈ బా ధ్యత అప్ప గించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



## వారం - వర్జ్యం

16-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
చతుర్దశి రా.8.07
ఉత్తరాభాద్ర మ.1.54
వర్జ్యం : రా.12.57-రా.2.25
దు.ఉ.10.02-ఉ.10.52
2) మ.3.02-3.52
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** రాజకీయనాయకులతో ముడిపడిఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా ముగించుట చెప్పదగినది.

**వృషభం:** సంతానము విషయములో తీవ్రమైన ఆలోచనలు చేసి, కీలక నిర్ణయములను తీసుకుంటారు.

**మిథునం:** క్రమశిక్షణాయుతమైన జీవితానికి ప్రాముఖ్యతనిచ్చి లాభపడతారు. స్త్రీలతో విభేదాలు లాభించవు.

**కర్కాటకం:** ఊహించని ఆహ్వానాలు అందుతాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఋణాలు తీరుతాయి.

**సింహం:** ప్రేమ విషయములో నిదానం అవసరం. విదేశాల నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగి పనులు పూర్తిచేస్తారు. పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**తుల :** ముఖ్యమైన వస్తువులు సకాలంలో కనబడకపోవడం కొంత ఇబ్బందిని కలిగిస్తుంది. సన్నిహితుల నుండి సమాచారాన్ని అందుకుంటారు.

**వృశ్చికం:** లక్ష్యసాధనలో ప్రతి బంధకాలు తప్పవు. భూవివాదాలు, కోర్టు కేసులు చికాకు పరుస్తాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** ఆత్మీయుల సహకారంతో సమస్యలు కొంతవరకు తీరతాయి. గృహ నిర్మాణ యత్నాలలో తొందరపాటు వద్దు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం:** శుభకార్య ప్రయత్నాలలో శుభ సూచనలు కనబడతాయి. ఇతరులకు మీవంతు సహాయం అందించగలుగుతారు.

**మీనం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రల ద్వారా ధనలాభం పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మత్స్యకారుల సంక్షేమం విస్మరించిన ప్రభుత్వం

## మేం రాగానే సాగర్ డిఫెన్స్ కంపెనీని మరో చోటుకు తరలిస్తాం: జగన్




బుధవారం జువ్వలదిన్నె గ్రామంలో మత్స్యకారులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్ర బాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ పూర్తిగా విస్మరించిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో బుధవారం ఆయన షిప్పింగ్ హార్బర్‌ను సందర్శించి మత్స్యకారుల సమస్యలపై ముఖాముఖిగా మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమం కోసం వారు వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు ఒకేసారి షిప్పింగ్ హార్బర్లు ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్లు 26 వేల కోట్ల రూపాయలు పెట్టుబడితో ప్రారంభించడం జరిగిందన్నారు. అందులో భాగంగా జువ్వలదిన్నె షిప్పింగ్ హార్బర్ 70 ఎకరాల్లో 289 కోట్ల రూపాయలతో రెండు సంవత్సరాల కిందట 90% శాతం పైగా పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండుసంవత్సరాలు పూర్తయిన జువ్వల దిన్నె షిప్పింగ్ హార్బర్‌ను భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతికి అంకితం ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు మత్స్యకారులకు స్వాధీనపర్చలేదన్నారు. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మత్స్యకారులు వారి ఉపాధి పై ఆందోళనచెందుతున్న సమయంలో, షిప్పింగ్ హార్బర్‌కు కేటాయించిన 70 ఎకరాల భూము ల్లో29.5ఎకరాలు సాగర్ డిఫెన్స్ ప్రైవేట్ కంపెనీకి దారాదత్తం చేయడం ఏమిటని ప్రశ్నించారు. తాము తిరిగి మూడు సంవత్సరాలలో మళ్లీ అధికారంలోకి వస్తామని అప్పుడు సాగర్ డిఫెన్స్ కంపెనీని మరోచోటకు తరలించి మత్స్యకారుల ఆస్తిని వారికే అప్పచెప్పుతామన్నారు. ఇదిలా ఉండగా ఇతర రాష్ట్రాలకు చెందిన మెరైన్ బోట్లు ఈ ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటుంటే మత్స్యకారులు ప్రాణాలు పణంగా పెట్టి 8 నెలల పాటు వాటిని కాపలా కాసారని అయితే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మార్చి 12న సాగర్ డిఫెన్స్ కంపెనీకి శంకుస్థాపన కొచ్చి వెళ్లిన తర్వాత ఆయన అనుమతితో ఈ ప్రాంతానికి చెందిన బీదా సోదరులు మరో ఇద్దరు కలిసి ఆ నాలుగు బోట్లను విడిపించేసారన్నారు. ఇందుకు సంబంధించిన కాల్ డేటాను కూడా ఆయన మత్స్యకారుల సమావేశంలో విలేకరులకు చూపించారు. ఈ సంఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అసలైన బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కేవలం కంటి తుడుపు చర్యగా పోలీస్ అధికారులను బదిలీ చేశారని విమర్శించారు. సభ వేదిక నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశించి జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ కళ్ళు మూసుకొని తెరుసుకునే లోగా మూడేళ్లు గడిచిపోతుందని మా ప్రభుత్వం వస్తుందని మీ బండారం అంతా బయట పెడతామని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అని చెప్పి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత తాము అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్నీ కూడా రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా సంతృప్తికరంగా లేరని పంటల బీమా అమలు కావడం లేదని, రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, మహిళలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని, విద్యా దీవెన అందడం లేదని, ఫీజు రీయింబర్స్మెంట్ అమలు కావడం లేదని, పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ అంతక లక్షల రూపాయలు ప్రైవేట్ ఆస్పత్రికి అప్పులు చేసి ఖర్చు పెడుతున్నారని విమర్శించారు.

# వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్ట్

## చంద్రబాబుపై అభ్యంతరకర పోస్టుల నేపథ్యంలో కేసు నమోదు



పూడి శ్రీహరి

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి, మాజీ సీపీఆర్ఓ పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబుపై సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీహరి సీపీఆర్ఓగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం వైసీపీ మీడియా విభాగంలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబును కించపరిచేలా సోషల్ మీడియాలో యానిమేషన్ పోస్టులు పెట్టించారనే ఆరోపణలపై చిత్తూరు జిల్లాలో ఆయనపై కేసు నమోదైంది. చంద్రబాబు చేతిలో కత్తి ఉన్నట్లుగా యానిమేషన్ చేసి పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు ఆధారంగా రంగంలోకి దిగిన పోలీసులు పూడి శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మీడియా వింగ్), మాజీ సీపీఆర్వో పూడి శ్రీహరి అరెస్ట్ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ అరెస్ట్‌ను అక్రమంగా పేర్కొంటూ వైసీపీ నాయకత్వం అసహనం వ్యక్తం చేసింది. ఈ ఉదయం తాడేపల్లిలోని జగన్ నివాసంలో ఆయనను కలిసి తిరిగి వస్తుండగా, పోలీసులు మార్గమధ్యంలో శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారని వైసీపీ నేతలు అంటున్నారు. శ్రీహరిని ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పకుండా అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ ఏపీ హైకోర్టులో హెబియస్ కార్పస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు వైసీపీ నేతలు తెలిపారు.

# కదిరిలో భారీ పేలుడు

>> ఓ ఇంటిని అద్దెకు తీసుకుని రోడ్లు, రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇంటిలో జెలిటిక్స్ ఉంచడంతో ఒక్కసారిగా ఇంటిలో మంటలు వ్యాపిం చడంతో అదుపు చేసేందుకు స్థానికులందరూ అక్కడికి పరుగులు పెట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తుండగా ఒక్కసారిగా తీవ్రస్థాయిలో జెలిటిక్స్ పేలడంతో స్థానికులు ఎగిసి పడ్డారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మంటలు పక్క ఇళ్లకు వ్యాపించడంతో మూడు ఇళ్లు పూర్తిగా దగ్ధం కాగా మరొక ఇల్లు పాక్షికంగా దెబ్బతినింది. పేలుడు జరిగిన ఇంటి పక్కలోనే నూతన భవనం నిర్మిస్తుండగా బేల్దారి పని చేయడానికి వచ్చిన నిరుపేదలు ఈ ఘటనలో మృతి చెందడం తీవ్ర విషాధాన్ని నింపింది. విషయం తెలుసుకున్న కదిరి డిఎస్పీ శివనారాయణస్వామి హుటాహుటిన తన సిబ్బంది, ఫైర్ సిబ్బందితో మంటలను అదుపు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మరింత ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా అద్దెకున్న తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన వెంకన్న పరారీలో ఉన్నట్లు సమాచారం.

**బాధితులను పరామర్శించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట :** జెలిటిక్స్ పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలు, తీవ్రంగా గాయపడిన బాధితులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించి వారు పడుతున్న వేదనను చూసి ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ప్రమాద ఘటన ప్రదేశాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు.

**బాధితులను ఆదుకుంటాం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ :** ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన కుమ్మరవాండ్ల పల్లిలోని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

**ప్రమాద కారకులను గుర్తించి చర్యలు చేపడుతాం : జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్**

ప్రమాద కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాఎస్పీ తీష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాద ఘటన ప్రదేశాన్ని డిఎస్పీ శివనారా యణస్వామితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీంతో పరిశీలించిన అనంతరం జెలిటిక్స్ పేలుడుతోనే ప్రమాదం సంభవించిందని, ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

**హోం మంత్రి అనిత ఆరా :** కుమ్మరవాండ్లపల్లిలో జెలిటిక్స్ పేలి, పేలుడు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత ఆరా తీసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ శాం ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ప్రమాద ఘటన ప్రదేశానికి చేరుకుని సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం తరుపున బాధితులకు అండగా ఉంటామని హోం మంత్రి అనిత భరోసా కల్పించారు.

# బీహార్ సిఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

## ఇద్దరు ఉపముఖ్యమంత్రులు కూడా..

**పాట్నా, ఏప్రిల్ 15:** బీహార్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బిజెపి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బిజెపి సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జెడియు సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్రాట్‌కు మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. బీహార్‌లో బిజెపి నుంచి సిఎం పదవి చేపట్టిన తొలి నాయకుడిగా సామ్రాట్ చౌదరీ రికార్డు సృష్టించారు. ప్రమాణస్వీకార కార్యక్ర మానికి మాజీ ముఖ్యమంత్రి, జెడియు అధినేత నీతీశ్ కుమార్‌తోపాటు పలు బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యారు.

# ఎసిబి కస్టడీకి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని ఏసీబీ కస్టడీలోకి తీసుకుంది. ప్రస్తుతం విజయవాడ జైలులో జ్యుడిషయల్ రిమాండ్‌లో ఉన్న ఆమెను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం గొల్లపూడిలోని ఏసీబీ కార్యాలయంలో ఆమెను ప్రశ్ని స్తున్నారు. నేడు, రేపురెండ్రోజులపాటు ఆమెను ప్రశ్నించనున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఇటీవల శాంతిన ఏసీబీ అరెస్టు చేసారు. ఆమె వద్ద పట్టుబడిన ఆస్తులపై కస్టడీలో విచారించనున్నారు.

16-4Pg3exHMNWJQERT.qxd:16-4Pg3exHMNWJQERT.qxd 1/1/02 7:06 AM Page 1





## సోషల్ మీడియా దుర్వినియోగంపై డిజిపి హరీష్ కుమార్ గుప్తా హెచ్చరిక

- రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై 1,549 కేసులు - 1,344 మంది అరెస్ట్

**విజయవాడ, ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తీవ్రంగా హెచ్చరించారు. అసభ్యకరమైన, రాజకీయ ప్రేరేపిత, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిని, వదంతులు వ్యాప్తి చేసేవారిని ఉపేక్షి ంచేది లేదని ఓ పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై ఇప్పటివరకు 1,549 కేసులు నమోదు చేసి 1,344 మందిని అరెస్టు చేశామని తెలిపారు. చట్టవిరుద్ధమైన 4,529 కంటెంట్‌లను తొలగించామని చెప్పారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా ఖిసోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్‌ఖి ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లపై ఈ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని డీజీపీ పేర్కొన్నారు. పదేపదే ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు, సంఘటిత బృందాలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన కఠిన చట్టాలను ప్రయోగిస్తామని హెచ్చరించారు. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని ఆయన తేల్చిచెప్పారు.

## ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో స్టాండప్ కమెడియన్ అనుదీప్‌ను అదుపులోకి తీసుకున్న ఎపి పోలీసులు

**విజయవాడ,ఏప్రిల్ 15, ప్రభాతవార్తప్రతినిధి:** పవన్, నిహారికల వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలు చేసిన హైదరాబాద్‌కు చెందిన స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికలను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఉత్తరప్రదేశ్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జనసేన నాయకుడు బడే వెంకట కృష్ణ ఫిర్యాదు మేరకు కాకినాడ పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. తన కామెడీ షోలో పవన్ కల్యాణ్ మూడు వివాహాలు, నిహారిక కొణిదెల విడాకులపై అనుదీప్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద అనుదీప్‌పై పరువునష్టం, మహిళల గౌరవానికి భంగం కలిగించడం వంటి అభియోగాలు మోపారు. కుటుంబంతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో పర్యటిస్తుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, తన వ్యాఖ్యలు ఎవరినీ కించపరచడానికి కాదని, విడాకులపై సమాజంలో ఉన్న ధోరణిని ప్రశ్నించడమే తన ఉద్దేశమని అనుదీప్ గతంలోనే క్షమాపణ చెప్పారు. క్షమాపణ చెప్పినప్పటికీ, కేసు తీవ్రత దృష్ట్యా పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అనుదీప్‌ను విచారణ నిమిత్తం కాకినాడకు తరలిస్తున్నట్లు సమాచారం. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

# సోలార్ రూఫ్ టాప్ పనులు వేగవంతం చేయండి

- డిస్కంలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్
- త్వరలో అర్హులైన బిసిలకు సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు



**విజయవాడ, ఏప్రిల్ 15, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల కోసం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద, రాష్ట్ర ప్రభు త్వం యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్‌ను అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేస్తోందని, ఈ పనులను రాష్ట్ర వ్యాప్తంగా మరింత వేగవంతం చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదేశిం చారు. బుధవారం వెలగపూడి లోని సచివాలయం నుంచి డిస్కాం ల సీఎండీ లు పృథ్వీతేజ్ ఇమ్మడి, లోతేటి శివశంకర్, పుల్లా రెడ్డి, నెడ్ క్యాప్ వీసీ అండ్ ఎండీ కమలాకర్ బాబు తో పాటు డైరెక్టర్లు, సీఈ లు, జిల్లాల ఎస్ఈ లతో వీడియో కాన్ప రెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సోలార్ రూఫ్ టాప్ పనుల పురోగతి పై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా కె.విజయానంద్ మాట్లాడుతూ, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించే లక్ష్యంతో క్లీన్ ఎనర్జీ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు., ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద, రాష్ట్ర ప్రభుత్వం ఖియుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడ ల్‌ను అమలు చేస్తూ, ఎస్సీ, ఎస్టీ విద్యుత్ విని యోగదారుల కుటుంబాల ఇళ్లపై సోలార్ ప్యానె ళ్లను ఏర్పాటు చేస్తోందని ఈ కార్యక్రమం, విద్యు త్ ఛార్జీల భారాన్ని తగ్గించడమే కాకుండా, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణకు, స్థానిక ఉపాధి కల్పనకు కూడా దోహదపడుతుందని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం లో భాగంగా 20,636 కుటుంబాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేశామని, ఇందులో ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో 5,027, ఏపీ ఈపీడీసీయల్ పరిధిలో 8,548, ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో 7,061 కుటుంబాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసినట్లు విజయానంద్ తెలిపారు. అదేవిధంగా రెగ్యులర్ స్కీమ్ లో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు డిస్కాం ల పరిధిలో 1,29,562 కుటుంబాలకు సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలోని మూడు డిస్కాం లకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని విజయానంద్ ఆదేశించారు.

## కుమ్మరవాండ్లపల్లి ప్రమాదంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మర వాండ్లపల్లిలో జరిగిన ఘోర ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిలెటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్లు పేలిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం మనసుని కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో మర ణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని జగన్ తెలియజేసారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, పేలుడు ధాటికి ఇళ్లు కూడా ధ్వంసమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పేలుడు పదార్థాల నిల్వపై ప్రభుత్వం కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, నిబంధనలు అతిక్రమించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభు త్వం అండగా నిలబడి, తగిన ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, గాయ పడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడా లని పార్టీశ్రేణులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ఎన్.ఆర్.ఎన్. స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభించిన మంత్రి నారా లోకేష్



క్రీడా అకాడమీల ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్ తదితరులు

**చంద్రగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు (ఎన్.ఆర్.ఎన్) స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను బుధవారం ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ప్రారం భోత్స వం చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రూ.3.20 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో ఎన్ఆర్ఎన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నూతనంగా నిర్మించారు. రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎంఎల్ఏ పులివర్తి నాని, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎంఎల్‌సి శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడులతో కలసి నారా లోకేష్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.

అనంతరం కాంప్లెక్స్‌లోనికి వెళ్ళిన ఆయన క్రీడా క్రీడాకారులు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లతో కలసి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్,

ఆర్చరీ అకాడమీలను ప్రారంభించారు. అనంతరం కాంప్లెక్స్ ఎదుట హాకీతో గోల్ చేసి ప్రాంగణాన్ని ప్రారంభించారు.

# తిరుమల సమాచారం

## మే 1 నుండి న్యూఢిల్లీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడి ఆధ్వర్యంలోని దేశ రాజధాని న్యూఢిల్లీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 1వతేదీ నుండి 9వ తేదీ వరకు వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్స వాలకు ఏప్రిల్ 30న అంకు రార్పణం జరుగనుంది. బ్రహ్మో త్స వాల ముందు భాగంగా ఏప్రిల్ 28న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహిస్తారు. మే 01వ తేదీ రాత్రి 09.00 గంటల నుండి 10.30 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్స వాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8.00 నుండి 9.00 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 10వ తేదీ సాయంత్రం 6.00 నుండి రాత్రి 8.00 గంటల వరకు పుష్పయాగం నిర్వహించబడుతుంది. ఆలయంలో మేనెల 1న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం,2న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 3న ఉదయం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం ,4న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం ,5వతేదీ ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం కల్యాణోత్స వం, రాత్రి గరుడ వాహనం ,6వతేదీ ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం ,7న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం ,మే 8న ఉదయం రథోత్స వం, రాత్రి అశ్వ వాహనం 9వతేదీ ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో పరిసమాప్తమవుతాయి.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి

- తిరుమలలో ఢిల్లీ సిఎం రేఖాగుప్త

**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందని ఢిల్లీ సిఎం రేఖాగుప్త తెలిపారు. శ్రీవారి కరుణా కటాక్షాలు దేశంలోని ప్రజలందరికీ కలగాలని వేడుకున్నారు. సిఎం హోదాలో తొలిసారిగా కుటుంబంతో వచ్చిన ఆమెకు బుధవారం వేకువ జామున తోమాలసేవలో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి తోమాల సేవలో దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలేశుని దర్శనం మనసుకు ఉల్లాసం.

## ఇంటర్ ఫలితాల్లో రికార్డు సృష్టించిన తాడిమర్రి కృష్ణ ప్రణీత్ రెడ్డి

1000 మార్కులకు 984 అభినందించిన నలంద విద్యాసంస్థల ఉపాధ్యాయులు



**అనంతపురం, ఏప్రిల్ 15, (ప్రభాతవార్త బ్యూరో)** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం విడుదల చేసిన ద్వితీయ సంవత్స రం ఫలితాల్లో అనంతపురంలోని నలంద జూనియర్ కళా శాలలో చదివిన తాడిమర్రి కృష్ణ ప్రణీత్ రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రణీత్ రెడ్డి మొత్తం 1000 మార్కులకు గాను 984 మార్కులు సాధించి అత్యుత్తమ గ్రేడ్‌తో ఉత్తీర్ణుల య్యారు. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ప్రణీత్ రెడ్డిని తల్లిదండ్రులు రాచ మల్ల నాగేశ్వరి, తాడిమర్రి బాల నారాయణరెడ్డి , ఇతర కుటుంబ సభ్యుల సంతోషానికి హద్దులు లేవు. కృష్ణ ప్రణీత్ రెడ్డి చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తూ నలుగురిలో శభాష్ అనిపించుకుంటున్నారు. ఇంటర్ మొదటి సంవత్స రంతో పాటు రెండో సంవత్స రం కూడా మంచి మార్కులు రావడంతో నలంద విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు ప్రత్యేకంగా ప్రణీత్ రెడ్డిని అభినందించారు. ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ లో కూడా మంచి ప్రతిభ కనబరిచి 91.90 శాతం మార్కులు సాధించారు. ఐఐటీ, ఎన్ఐటి లలో సీటు సంపాదించాలని ప్రణీత్ రెడ్డి పట్టుదలతో చదువుతున్నట్లు తండ్రి తాడిమర్రి బాల నారాయణరెడ్డి చెబుతున్నాడు. ప్రణీత్ రెడ్డి కాకుండా పదవ తరగతి, ఇంటర్ లో అద్భుత ప్రతిభ కనపర్చాలన్నారు.

## కపిలేశ్వరుని దర్శనం - జీవితానికి పరమానందం

**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరంలో ,తిరుపతి సప్తగిరుల క్రింద వెలసిన పవిత్ర క్షేత్రమైన కామాక్షి సమేత కపిలేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సందర్శించారు. అత్యంత పుణ్యప్రదమైన కపిలతీర్థంలో స్నానం చేయడం వల్ల దేవతలతో పాటు పితృదేవతలు సంతోషిస్తారని పురాణాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.


స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వం
క్రీడల విభాగం
(యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్
(తూర్పు గేట్‌నెం. 10), లోధి రోడ్,
న్యూఢిల్లీ-110003

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ కోచ్ పదవికి రెగ్యులర్ ప్రాతిపదికన నియామకం కోసం దరఖాస్తులు

యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), 26 క్రీడాంశాలలో (అవి: అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కానోయింగ్ & కయాకింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, ఖోఖో, లాన్ టెన్నిస్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, సెపక్‌టక్రా, టేబుల్ టెన్నిస్, టేక్వాండో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్ మరియు వుషు) 323 అసిస్టెంట్ కోచ్ పోస్టులను (పే బ్యాండ్ రూ. 9300-34800 + గ్రేడ్ పే రూ. 4200) భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

2. అర్హతా ప్రమాణాలు మొదలైన వివరాలతో కూడిన నోటిఫికేషన్ SAI వెబ్‌సైట్‌లో (www.sportsauthorityofindia.nic.in) అందుబాటులో ఉంది.

3. ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రారంభ తేదీ 23.03.2026 (ఉ.10:00 గంటలు)

4. ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీ 21.04.2026 (సా. 05:00 గంటలు)

CBC 47103/12/0003/2627 ED-HRD, SAI


## ఆకివీడు రామాలయం కేసులో హైకోర్టులో స్వయంగా వాదించిన రఘురామ కృష్ణంరాజు

- రామాలయంపై ఎటువంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వని న్యాయస్థానం - రఘురామ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం - ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ కోరిన హైకోర్ట్



**విజయవాడ, ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆకివీడు రామాలయం అంశంపై బుధవారం హైకోర్టులో స్వయంగా హాజరై వాదనలు విన్పించారు. ఇదే అంశంపై విజయవాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులు లేకుండా జరుగుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించిన రఘురామ కృష్ణంరాజు స్వయంగా కోర్టుకు వెళ్లి తన వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా రామా లయం నిర్మాణం భక్తుల విరాళాలతో జరుగు తోందని తెలిపారు,అన్ని చట్టబద్ధ అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు కొనసాగిస్తామని రఘురామ కోర్టుకు హామీ ఇచ్చారు. చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పాటిస్తామని స్పష్టం చేశారు. ఈ కేసులో కోర్టు రామాలయంపై ఎటువంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరఫు న్యాయ వాదుల వాదనలు, తన వాదనలను కోర్టు పరిగణ నలోకి తీసుకుందని చెప్పారు. అలాగే చట్ట పరమైన నిబంధనలు పాటిస్తామని ప్రభుత్వం నుంచి అండర్ టేకింగ్ ఇవ్వాలని కోర్టు కోరగా, అందుకు ప్రభుత్వ న్యాయవాదులు అంగీకరించారని, దీంతో కేసు ముగించారన్నారు. ఆలయం, చర్చి, మసీదు అన్న తేడా లేకుండా అన్ని మతపరమైన కట్టడాలకు చట్టం సమానంగా వర్తించాలన్నారు. ఏ నిర్మాణానికైనా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు.


राष्ट्रीय परीक्षा एजेंसी
National Testing Agency
Excellence in Assessment
(उच्चतर शिक्षा विभाग, शिक्षा मंत्रालय, भारत सरकार के तहत एक स्वायत्त संगठन
(An Autonomous Organization under the Department of Education, Ministry of Education, Government of India)
IIM BODH GAYA
IIM JAMMU

జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (JIPMAT) - 2026 కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం

క్రింది వివరాల ప్రకారం, 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఐఐఎం బోధ్ గయా మరియు ఐఐఎం జమ్మూలలో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) JIPMAT-2026ను నిర్వహించనుంది:

| | |
|---|---|
| ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ సమర్పణ | 16 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు (రాత్రి 11:50 గంటల వరకు) |
| పరీక్ష రుసుము విజయవంతమైన లావాదేవీకి చివరి తేది | 11 మే 2026 (రాత్రి 11:50 వరకు) |
| వివరాలలో దిద్దుబాటు | 12-14 మే 2026 (రాత్రి 11:50 వరకు) |
| పరీక్ష తేదీ | 07 జూన్ 2026 |
| పరీక్ష సమయం | మ.03.00 నుండి సా. 05.30 వరకు |
| పరీక్షా విధానం | కంప్యూటర్ ఆధారిత పరీక్ష CBT) |
| పేపర్ నమూనా | బహుళ ఎంపిక ప్రశ్నలు |

పరీక్షా విధానం/వ్యవధి/మాధ్యమం/సిలబస్, అర్హతా ప్రమాణాలు, తాత్కాలిక సీట్ల సంఖ్య, సీట్ల రిజర్వేషన్, పరీక్షా నగరాలు, ముఖ్యమైన తేదీలు మొదలైన వివరాలు NTA వెబ్‌సైట్ https://exams.nta.nic.in/jipmat/లో ఉంచిన సమాచార బుల్లెటిన్‌లో పేర్కొనబడ్డాయి. పరీక్షకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు JIPMAT-2026 కొరకు ఉన్న వివరణాత్మక సమాచార బులెటిన్‌ను చదివి, https://exams.nta.nic.in/jipmat/లో మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు సంబంధిత IIMల అర్హతా ప్రమాణాలను తనిఖీ చేసుకోవాలి. అభ్యర్థులు NTA వెబ్‌సైట్ https://exams.nta.nic.in/jipmat/తో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించడమైనది. అభ్యర్థులు jipmat (@nta.ac.in వద్ద NTA కు వ్రాయవచ్చు లేదా 011-40759000 వద్ద NTAకు కాల్ చేయవచ్చు.

CBC 21354/11/0001/2627 సం/- డైరెక్టర్


## ఎపి ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్యకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు

ఎంపిసిలో స్టేట్ టాపర్‌గా బి. గగన




**హైదరాబాద్, ఎప్రిల్ 15, ప్రభాతవార్త:** ఎపి ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పలువురు విద్యార్థులు స్టేట్ టాపర్లుగా నిలిచారు. జూనియర్ ఇంటర్ సిలబస్‌తోపాటు పరీక్షా ప్యాటర్న్ మారినప్పటికీ ఎంపిసి విభాగంలో 470 మార్కులకుగాను 469 మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థి బి. గగన స్టేట్ టాపర్‌గా నిలిచారు. ఇక బైపిసిలో 455 మార్కులకుగాను 452 మార్కులతో స్టేట్ టాపర్లుగా ఇద్దరు విద్యార్థులు నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్స రంలో 1000 మార్కులకుగాను 992 మార్కులను ఆరుగురు విద్యార్థులు సాధించగా 991 మార్కులను 37 మంది విద్యార్థులు సాధించారు. ఇక జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 469 మార్కులతో స్టేట్ ర్యాంకు తోపాటు 466 మార్కులపైన 129మంది విద్యార్థులు, 464 ఆపైన మార్కులను 1092 మంది విద్యార్థులు, 460పైన మార్కులను 3620 మంది విద్యార్థులు సాధించి టాపర్లుగా నిలిచారు. ఇక బైపిసి మొదటి సంవత్స రంలో 455 మార్కులకుగాను 452 మార్కులుతో ఇద్దరు విద్యార్థులు స్టేట్ టాపర్లుగా నిలవగా 450కి పైగా మార్కులను 132మంది సాధించారు. 440కి పైగా మార్కులను 1702 సాధించగా 435పైగా మార్కులను 2536 మంది, 430పైగా మార్కులను 2940 మంది సాధించారు. అదేవిధంగా ఇప్పటికే విడుదలైన జెఇఇ మెయిన్-2026 సెషన్ 1,2లో 300కి 300 మార్కులు సాధించిన ఇద్దరు తెలుగు విద్యార్థులు శ్రీ చైతన్య విద్యార్థులే కావడం విశేషం. ఈ సందర్భంగా శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ... పటిష్టమైన విద్యా ప్రణాళిక కారణంగానే ఇంటర్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారని, జాతీయస్థాయి పోటీపరీక్షల్లో టాపర్‌గా నిలుస్తున్నారని అన్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

## టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్‌గా బి.వి. వెంకటరాముడు నియామకం

పార్టీ పట్ల విశ్వాసనీయత, అప్పగించిన పనిని చిత్తశుద్ధితో చేయడం బీవీ రాముడి మార్క్. దీంతో మరోమారు మీడియా బాధ్యతలను అప్పగించింది టీడీపీ అధిష్టానం. తెలుగుదేశం పార్టీకి దాదాపు మూడు దశాబ్దాలుగా అంకిత భావంతో పనిచేస్తున్నారు వెంకటరాముడు. తన రాజకీయ ప్రస్థానాన్ని 1996లో అనంతపురం పట్టణ కార్యదర్శిగా ప్రారం భించారు. అనం తరం పట్టణ ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రచార కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.


స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వం
క్రీడల విభాగం
(యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
(మానవ వనరుల విభాగం-II)
ప్రధాన కార్యాలయం, గేట్ నెం.10 (తూర్పు గేట్),
జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003

ఎఫ్.నెం. 01-04001(03)/1/2026-6601/233 తేదీ: 25-03-2026

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రిక్రూట్‌మెంట్ - డిప్యుటేషన్‌పై అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), తన ప్రధాన కార్యాలయం, న్యూఢిల్లీ మరియు వివిధ క్షేత్రస్థాయి యూనిట్లలో పే మ్యాట్రిక్స్ లెవెల్-10లో 30 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ పోస్టులు 01 సంవత్సరం కాలానికి డిప్యుటేషన్ పద్ధతిలో ఉంటాయి (అవసరాన్ని బట్టి మరియు సంబంధిత విభాగంలో ఖాళీల లభ్యతను బట్టి, దీనిని ఒక సంవత్సరం చొప్పున గరిష్ఠంగా మూడు సంవత్సరాల వరకు పొడిగించవచ్చు). అర్హులైన అధికారులు నిర్దేశిత ఫార్మాట్‌లో దరఖాస్తులను, అవసరమైన డాక్యుమెంట్లతో పాటు, డైరెక్టర్ (హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్-I), SAI, జె.ఎన్. స్టేడియం కాంప్లెక్స్, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003 చిరునామాకు సమర్పించవచ్చు. దరఖాస్తులను స్వీకరించే చివరి తేదీ 22-04-2026 (సాయంత్రం 5:00 గంటలు). వివరణాత్మక ప్రకటన, అర్హతా ప్రమాణాలు, ప్రొఫార్మా మరియు సూచనలు SAI వెబ్‌సైట్‌లో (www.sportsauthorityofindia.nic.in) అందుబాటులో ఉంటాయి.

CBC 47103/12/0001/2627

16-4Pg7exHMNWJQE.qxd:16-4Pg7exHMNWJQE.qxd 1/1/02 6:52 AM Page 1



# లోకేష్‌కు కీలక బాధ్యతలు..
## టిడిపిలో నూతన ఉత్సాహం: పల్లా శ్రీనివాసరావు

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**తెలుగుదేశం పార్టీలో కీలక పరిణామంగా యువనేత నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. లోకేష్ నియామకం పార్టీకి నూతన ఉత్సాహాన్ని తీసుకొస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని పల్లా కొనియాడారు. ఆయన నాయకత్వం టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా, తనను రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు పల్లా కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించడంలో టీడీపీ ముందుంటుందని, తనలాంటి బీసీ నేతకు ఈ స్థాయి అవకాశం రావడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. 'యువగళం' పాదయాత్రతో ప్రజలతో మమేకమైన లోకేష్ నాయకత్వంలో, చంద్రబాబు మార్గదర్శకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పల్లా స్పష్టం చేశారు. కార్యకర్తల సంక్షేమం, డిజిటల్ మెంబర్‌షిప్ ద్వారా భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలతో పార్టీకి ఆధునిక నిర్మాణాన్ని తీసుకువచ్చారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, సీనియర్ల అనుభవాన్ని వినియోగించుకుంటూ యువతకు అవకాశాలు కల్పిస్తామని పల్లా పేర్కొన్నారు.



# కాకినాడ యాంకరేజ్ పోర్టులో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు సంయుక్త తనిఖీ
## రూ.3.54 కోట్లు విలువ చేసే పిడిఎస్ రైస్ సీజ్

**కాకినాడ , ఏప్రిల్ 15 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** కాకినాడ యాంకరేజ్ పోర్టులో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు దగ్గర భార్జీలలో, రైల్వే వ్యాగన్‌లలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. తదుపరి చెక్‌పోస్ట్‌లోని రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి బాయిల్డ్ రైస్, రా రైస్, రా బ్రోకెన్స్ ఎగుమతి విధానాన్ని పరిశీలించారు. టెక్నికల్ సిబ్బంది రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి పలుసూచనలు ఇచ్చారు. తదుపరి మానస ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌లో స్టాకును పరిశీలించారు. ప్రాథమికంగా కొన్ని ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు గుర్తించారు. సత్య బాలాజీ, ఎస్ ఆర్ ట్రేడింగ్ వారు ఎగుమతి చేస్తున్నారని తేలింది. తదుపరి స్వార్టెక్స్ ప్లాంట్ ఎస్ డి ఆర్ గోడౌన్, చిత్ర ఆగ్రో ఎగ్జిట్స్, కొవ్వూరి ఆనంద్ రెడ్డి సార్టెక్స్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో 10 లారీలు బియ్యంతో కలిగి ఉన్నాయని గుర్తించారు. టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా శాంపిల్స్ తీసుకుని కెమికల్ అనాలసిస్ చేయగా, సదరు బియ్యంలో బాయిల్డ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని తేలింది. వెంటనే మిల్ ఆవరణలో తనిఖీ చేశారు. సార్టెక్స్ మిల్‌లోని బాయిల్డ్ రైస్‌లో కూడా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని గుర్తించారు. సదరు ప్రొప్రైటర్ శ్రీ కొవ్వూరి ఆనంద్ రెడ్డి మేనేజర్ శ్రీనివాసరావును విచారించగా, బాయిల్డ్ రైస్ బియ్యాన్ని ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా పంపిణీకి సంబంధించిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిగిన బాయిల్డ్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు బల్క్‌లో కొని, అక్రమంగా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తేలింది ప్రాథమికంగా ఇతర రాష్ట్రాల్లో కార్డు దారులకు సరఫరా చేసే బాయిల్డ్ పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమంగా పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నారని గుర్తించారు. 10 లారీలలో 260 టన్నులు, ప్లాంట్‌లో 650 టన్నులు మొత్తం 910 టన్నుల బాయిల్డ్ బియ్యం విలువ రూ.2.54 కోట్లు, 10 లారీల విలువ సుమారు రూ.1 కోటి, మొత్తం రూ.3.54 కోట్లకు సీజ్ చేశారని జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపారు. అనాలసిస్ రిపోర్టుల కోసం జిల్లా మేనేజర్ కి శాంపిల్స్ పంపారు. రేషన్ కార్డు దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉంటాయి. ఇవి బహిరంగ మార్కెట్‌లో ఉండవు. కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్‌లో కూడా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ జోడించి బలవర్ధకమైన ఆహారం ప్రజలకు సరఫరా చేస్తోంది. కొంతమంది తక్కువ ధరకు కొని ఇతర దేశాలకు ఎగుమతి చేయడం నేరమని తెలిపారు. సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

# సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్ హిమాన్షుశుక్లా
### - జిల్లాలో ప్రతి వారం 'పల్లె వీక్షణం'



**ఆత్మకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలం నబ్బీనగరం, బోయిల చిరువెళ్ళ గ్రామాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా జిల్లా యంత్రాంగంతో కలసి "పల్లె వీక్షణం" కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నబ్బీనగరం, బి.చిరువెళ్ళ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బి.చిరువెళ్ళలో రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రం, హౌసింగ్ కాలనీ, మినీ గోకులం లను సందర్శించారు. నబ్బీనగరంలో ఉపాధిహామీ పనుల వద్దకు నేరుగా వెళ్ళి కూలీలతో మాట్లాడారు. బోయిలచిరువెళ్ళ గ్రామంలోని వీధుల్లో నడుచుకుంటూ ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి , స్థానిక అధికారుల పనితీరుపై స్వయంగా ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ఒక గ్రామంలో అధికార యంత్రాంగం తో కలసి సమగ్రంగా పర్యటించి నేరుగా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమే పల్లె వీక్షణమని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని సమీక్షిస్తామని, ఏవైనా సమస్యలుంటే ప్రజలనడిగి తెలుసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయా, గ్రామస్థాయిలో అధికారుల పనితీరు ఎలా ఉంది లోటుపాట్లను లోతుగా తెలుసుకుంటామన్నారు. గ్రామంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా పల్లె వీక్షణ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. రైతు సేవా కేంద్రంలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి పంట ధాన్యాన్ని మద్ధతు ధరకంటే ఎక్కువగా విక్రయించడం సంతోషకరమన్నారు. రెండవ పంటకు కూడా పుష్కలంగా సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. త్వరలోనే సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి జిల్లాలో రెండోపంటకు సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

తొలుత బొయిల చిరువెళ్ళ గ్రామంలో రైతు సేవా కేంద్రంలో చాంపియన్ ఫార్మర్ ఈగ సుబ్బారెడ్డికి పశువుల దాణాను, పలువురు రైతులకు నవధాన్యాలను కలెక్టర్ పంపిణీ చేశారు. వేసవిలో పశువుల దాహం తీర్చేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నీటి తొట్టెలను ఆయన పరిశీలించారు. జలజీవన్ మిషన్ ద్వారా నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం బోయిలచిరువెళ్ళ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలను నేరుగా పరిశీలించారు. పిల్లలకి అందిస్తున్న ఆహారం, పిల్లల హాజరు,నమోదు, బరువు, ఎత్తు తదితర విషయాలను తెలుసుకున్నారు. చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకంఉటూ విద్యాబుద్ధులు నేర్పించాలని అంగన్‌వాడీ నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఇఒ శ్రీధర్‌రెడ్డి, డిపిఒ డి.వసుమతి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ సుజాత, ఐసిడిఎస్ పిడి బి.హేనాసుజన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయభాస్కర్, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్‌నాయక్, ఆత్మకూరుఆర్‌డిఒ బి.పావని, ఆత్మకూరు మండలాధ్యక్షులు కేతా వేణుగోపాల్‌రెడ్డి, తహసిల్దార్ పి.పద్మజాకుమారి, ఎంపిడిఒ పి.రఫీఖాన్, మండల వ్యవసాయాధికారికె.కిషోర్‌బాబు, ఉపాదిహామీ పథకం ఎపిఒ మధు, ఐసిడిఎస్ సిడిపిఓ పి.సునీలత, సూపర్‌వైజర్ జి.కస్తూరి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కొండయ్య, మాజీ సర్పంచ్‌లు కరేటి హాజరత్‌రెడ్డి, రావూరు రత్నాకర్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, చెవుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకుడు షేక్ హుసేన్ వివిధ శాఖల అధికారులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో గత 12 యేళ్లలో ఈ ఏడాదే అత్యధిక ఉత్తీర్ణతా శాతం
## మే 21 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

**ఏప్రిల్ 15, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో :** ఏపీలో ఇంటర్ ఫలితాలను 15వ తేదీ బుధవారం విద్య శాఖామంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. విద్యాశాఖా మంత్రిగా లోకేష్ పదవి చేపట్టాక విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలు, సమూలమైన మార్పుల ఫలితంగా గత 12 ఏళ్లలో ఎన్నడూ రాని ఉత్తీర్ణత శాతం ఈ సంవత్సరం నమోదయిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా విద్యా శాఖ మంత్రిగా లోకేష్ తన కృషితో పాసయ్యారని పలువురు అధికారులు, లోకేష్ అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలు 77 సాధించగా ద్వితీయ సంవత్సరం ఇంటర్లో 81 తో గత రికార్డులను అధిగమించారు. 2020లో మొదటి సంవత్సరం 59 ఇప్పుడు 77 శాతానికి వృద్ధి చెందింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ప్రథమ సంవత్సరం 54 ద్వితీయ సంవత్సరం 68 తో గత 12 ఏళ్లలో ఉన్న రికార్డును ప్రస్తుత ఫలితాలు తిరగరాసాయి. రాష్ట్రస్థాయిలో కృష్ణాజిల్లా 9 తో మొదటి స్థానంలో ఉండగా 88వ శాతంతో గుంటూరు రెండవ స్థానంలో ఉంది. విశాఖపట్నం ఎన్టీఆర్ జిల్లాలు ఆ తర్వాత స్థానాలు దక్కించుకున్నాయి. అయితే అన్నమయ్య జిల్లా వంటి కొన్ని జిల్లాలో తక్కువ ఉత్తీర్ణతతో చివరి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగటం గమనార్హం, దీనికి లోకేష్ తీసుకువచ్చిన సంస్కరణలు ప్రధాన కారణమని విద్యా వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రథమ సంవత్సరం 69 నుంచి 76 వరకూ ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 77 నుంచి 80 వరకు ఉత్తీర్ణత సాధించారు. అయితే రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతంతో పోలిస్తే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉత్తీర్ణత శాతం సగటు తగ్గిందని తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఏలూరు జిల్లా నుంచి సైన్స్ స్ట్రీమ్ లో రాష్ట్రస్థాయి టాప్ లిస్టులో విద్యార్థులు చోటు దక్కించుకోవడం కొంత ఊరటనిచ్చిందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకవా ఏలూరు జిల్లా నూజివీడు కు చెందిన పంబ లాలిత్య బి పి సి స్ట్రీమ్ లో 989 మార్కులతో రాష్ట్రస్థాయి మూడవ స్థానంలోనూ, సీఈసీ స్ట్రీమ్ లో 976 మార్కులతో శీతల జాహ్నవి రాష్ట్ర టాపర్స్ లిస్టులో చోటు దక్కించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర సగటుకు దగ్గరగా ఉండటం ఎదురు జిల్లా విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు రావడం ఊరటనిచ్చాయని చెప్పవచ్చు. గ్రామీణ మండలాల్లో సందేహాలు నివృత్తి చేసే అంశాలు, ప్రత్యేక ట్యూషన్, ల్యాబ్ సదుపాయాలు మెరుగుపరిచినట్లయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మిగతా జిల్లాలతో పోటీ పడుతుందని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

# మరో ఆర్నెల్లలో అందుబాటులోకి నేలటూరు ఫిషింగ్ జెట్టీ
### - డిపిఆర్ ప్రకారం ప్రతి పని పూర్తి చేస్తాం
### - మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**ముత్తుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** నేలటూరు ఫిషింగ్ జెట్టీని మరో ఆర్నెళ్లలో అందుబాటులోకి తీసుకుని వస్తామని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ నేలటూరు ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులు పూర్తి చేసి మళ్లీ ప్రారంభోత్సవానికి వస్తామన్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నేలటూరు జెట్టీని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, ఏపీ కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, పోర్టు ప్రతినిధులు బుధవారం సందర్శించారు. 17 కోట్ల రూపాయలతో అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో పనులు చేసిన విషయంతో పాటు పెండింగ్ పనులు అత్యంత త్వరగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మత్స్యకారులు రెండో జెట్టీని కోరుతున్న అంశాన్ని మంత్రి, మారిటైం బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళారు. నేలటూరు ఫిషింగ్ జెట్టీని పూర్తి చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. మత్స్యకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన చాలా పట్టుదలతో ప్రయత్నిస్తున్నారని తెలిపారు. డీపీఆర్ ప్రకారం ప్రతి పని పూర్తి చేస్తామని, ఆర్నెళ్లలో మత్స్యకారులకు జెట్టీని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల వినతి మేరకు రెండో జెట్టీ నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రెండో జెట్టీ నిర్మాణంపై సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించామన్నారు. మత్స్యకారుల సూచనలన్నీ పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, కృష్ణపట్నం దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** పేద ప్రజల ఆకలి తీర్చి, వారికి తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించాలనే ఆశయంతో వింజమూరులో చిల్డ్రన్ పార్కు ఎదురు వ్యవసాయ కార్యాలయం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ఘనంగా ప్రారంభమైంది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంబ, జడ్పీ మాజీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకులకు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు వనిపెంట హైమావతి సొసైటీచైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఇతర నేతలు పూలమాలలు శాలువాలతో జిల్లా నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌ను ప్రారంభించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అబ్దుల్ అజీజ్ కోరగా పార్టీసీనియర్లతో ప్రారంభిద్దామని అబ్దుల్ అజీజ్ ఎమ్మెల్యేకి సూచించగా వెంటనే ఎమ్మెల్యే స్థానిక తెలుగుదేశం పార్టీసీనియర్ నాయకులు సీఎం ఖాజావలి ప్రారంభించాలని చెప్పడంతో ఖాజావలి క్యాంటీన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పెద్దల పట్ల అపారమైన గౌరవం ఉందని అందుకే తనకు అవకాశం కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే సీనియర్ నాయకులకు, మైనార్టీలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనం టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సీఎం ఖాజావలి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించి క్యాంటీన్‌ను ప్రారంభించడమే అన్నారు. ఒక సామాన్య కార్యకర్తకు, సీనియర్ నేతకు దక్కిన ఈ గౌరవం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో నిలిపివేసిన అన్నా క్యాంటీన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుమమళ్ళీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. వింజమూరులో రోజువారీ కూలీలు, పేదలు, బాటసారులకు ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం లభిస్తుందని, ఇది నిరుపేదల పాలిట వరమని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి ప్రతి రోజు లక్షలాది మంది పేదల ఆకలి తీర్చడం జరుగుతుందన్నారు. అలాగే ఇప్పటి వరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇలాంటి సేవలను విస్తరించడం ద్వారా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. హరే కృష్ణ అక్షయ పాత్ర ఫౌండేషన్ సంస్థ అన్నా క్యాంటీన్లకు అల్పాహారం, భోజనం సరఫరా చేస్తూ సమాజానికి అమూల్యమైన సేవలను అందిస్తుందని ప్రశంసించారు. వారి సహకారం వలెనే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ సోదరులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అతిథులు స్వయంగా వడ్డించి, ప్రజలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎం అండ్ హెచ్ఓ మాశిలామణి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి, టెలికాం బోర్డు డైరెక్టర్ తాడికొండ అనూష, కలిగిరి మండల పార్టీ కన్వీనర్ పూసల వెంగప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శి కొప్పోలు కొండలరావు, కొండాపురం కన్వీనర్ మామిళ్ళపల్లి ఓంకార్, పోలినేని చంద్రబాబునాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు దామా మహేష్, కొండాపురం తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు చిమ్మిలి శ్రీదేవి, ఎస్టీ సెల్ నాయకురాలు నూతలపాటి జయలక్ష్మి, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, చల్లా శ్రీనివాసులు, బయన్న, కోడూరు నాగిరెడ్డి, దుద్దిగుంట శ్రీనివాసులురెడ్డి, పాములపాటి సుబ్బరాయుడు, మంచాల శ్రీనివాస నాయుడు, సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి, వరికుంటపాడు మాజీ ఏఎంసీ నాయకులు చంద్ర మధుసూదన్, గురవారెడ్డి, ఇతర మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి భద్రత కోసం జలధార కార్యాచరణ ప్రణాళిక

**- పర్యాటక కేంద్రంగా పోలవరం ప్రాజెక్టు.. - నేరడి బ్యారేజ్, చింతలపూడి మెయిన్ కెనాల్‌కు త్వరలో టెండర్లు.. - జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్ 1 పనులు పూర్తి కావాలి..-జల వనరుల శాఖ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు..**




జల వనరుల శాఖ పై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, సమావేశంలో మంత్రి డాక్టర్ నిమ్మల, అధికారులు

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాత వార్తప్రతినిధి:** నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకిత మిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఆ క్రమంలోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాలువల ద్వారా తరలించి వాటిని ఏయే అవసరాలకు, ఎంత మేర వినియోగించుకోవాలనే దానిపై ఓ నిర్దుష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపేలా ప్రణాళిక చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులతో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు...వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం నల్లమల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపూడిశిల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జల ధార, జల హారతి కార్యక్రమాలపైనా సమీక్షి ంచారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులైన తారక రామ, మహేంద్ర తనయ, తోటపల్లి బ్యారేజ్, మద్దువలస, జంఝావతి, హీరమండలం లిఫ్ట్ పనుల్లో వేగం పెంచాలని సీఎం సూచించారు. డిసెంబర్ నాటికి వంశధారనాగావళి అనుసంధానం, జూలై నాటికి నాగావళిచంపావతి అనుసంధానం పూర్తి చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లా వంశధార నదిపై నిర్మించ తలపెట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగడంతో త్వరితగతిన టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని... హోటల్స్, షాపింగ్ ఏరియా ఉండాలని సీఎం అన్నారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాల సుందరీకరణకు సంబంధించిన డిజైన్లను సీఎం పరిశీలించారు. పోలవరంపాపికొండలుభద్రాచలం వరకు బోటింగ్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటర్, రాక్, ఫారెస్ట్, స్పోర్ట్స్ థీమ్‌తో పర్యాటకుల్ని ఆకట్టుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దాం

**-రూ.10.10 కోట్ల నిధులతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్**

**తిరుపతి క్రీడ,ఏప్రిల్ 15ప్రభాతవార్త:** రాయలసీమలోనే తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతామనే యువగళం హామీ కార్యరూపం దాల్చిందని ,10.10కోట్ల రూపాయలతో అధునాతనంగా నిర్మించిన ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో రాష్ట్రమంత్రి నారాలోకేశ్ వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏడాదిలో 35 కోట్లకు పైగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు..తిరుపతి నగరంలో గొల్లవానిగుంటలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శాప్, తుడా సహకారంతో 10.10 కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్మించామన్నారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ క్రీడాకారులతో గ్రూప్ ఫోటో దిగారు. కొద్దిసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాల్ రాజ్, ఇతర క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెడ్ ఆడారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్సాహపరిచారు. క్రీడా ప్రాంగణంలో ప్రణీత్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్రికెట్ మైదానం, ఖోఖో, కబడ్డీ, ఖఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ కోర్టులతో పాటు పలు క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఈ సముదాయం క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు ఈ ప్రాంత భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించనుందని మంత్రి తెలిపారు. అంతకుముందు క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు ఇదే ప్రాంగణంలో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 5.35 కోట్ల వ్యయంతో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

# ఉదయనిధి స్టాలిన్ ఆస్తులపై ఐటి విచారణ

**చెన్నై, ఏప్రిల్ 15:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ డిఎంకె కీలక నేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లోని ఆస్తుల వివరాల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని ఆదాయపు పన్ను (ఐటి) శాఖను ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఈ నెల 23న పోలింగ్ జరగనున్నందున, ఓట ర్లకు అభ్యర్థుల ఆర్థిక విషయాలపై కచ్చితమైన సమాచారం తెలుసుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 20వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ఐటీ శాఖ డైరెక్టర్ జనరల్‌కు గడువు విధించింది.

ఉదయనిధి స్టాలిన్ పోటీ చేస్తున్న చేపాక్‌తిరువల్లికేణి నియోజకవర్గానికి చెందిన ఆర్. కుమార్వేల్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. వాదనలతో ఏకీభవించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ జి. అరుణ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం, ఐటీ శాఖ నివేదిక కోసం కేసు విచారణను ఏప్రిల్ 20కి వాయిదా వేసింది.

# రైతు ఆత్మహత్యల్లో 80 శాతం కౌలురైతులవే
## రైతు స్వరాజ్య వేదిక సర్వే

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణలో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో అధికం కౌలు రైతులేనని రైతు స్వరాజ్యవేదిక సర్వేలో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల్లో 80 శాతం కౌలు రైతులే నని తేల్చింది. తెలంగాణలో 22 లక్షలకు పైగా (మొత్తం రైతుల్లో 36శాతం) కౌలు రైతులు ఉన్నారు. వీరంతా భూములను కౌలుకు తీసు కొని సాగు చేస్తున్నారు. అయితే రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు భీమా, పంట రుణాలు, రుణమాఫీ తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఏవి వీరి దరి చేరడం లేదు. కనీసం సాగుచేసిన పంట ప్రకృతి వైపరిత్యాల కారణంగా నష్టపోయి నప్పుడు నష్టపరిహారం కూడా అందడం లేదు. చివరకు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు అమ్ముకునేందుకు కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతు స్వరాజ్య వేదిక చెబుతోంది. కౌలు రైతులను గుర్తించకపోవడంతో ప్రభుత్వం అందిం చిన బోనస్ డబ్బులు కౌలు రైతులకు దక్కడం లేదని రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో భూమిలేని కౌలు రైతులను సర్వే చేసి గ్రామసభల్లో గుర్తించి, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని రైతు స్వరాజ్యవేదికతోపాటు పలు రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పార్కింగ్ కారులో చిక్కుకుని బాలిక మృతి
## నార్కెట్‌పల్లిలో విషాదం

**నార్కెట్‌పల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** నార్కెట్‌పల్లి మండల కేంద్రంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆడుకుంటూ వెళ్లిన ఐదేళ్ల చిన్నారి అనుకోకుండా పార్కింగ్ చేసిన కారులో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయింది. ఘటన సంబంధించిన వివరాల ప్రకారం, చరణ్య అనే ఐదేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా సమీపంలో పార్క్ చేసిన కారులోకి ఎక్కింది. అయితే లోపలికి వెళ్లిన తర్వాత కారు డోర్లు లాక్ కావడంతో బయటకు రావడానికి వీలు లేకపోయింది. ఎండ తీవ్రత కారణంగా కారు లోపల ఉష్ణోగ్రత పెరగడం, గాలి అందకపోవడంతో చిన్నారి స్పృహ కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, చరణ్య ఎక్కువసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతకడం ప్రారంభించారు. అనంతరం అనుమానం వచ్చి పార్క్ చేసిన కారులో చూడగా, చిన్నారి అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి మృతి స్థానికులను కలచివేసింది. సెలవు లేకున్నా నా కూతురు బ్రతికేది చిన్నారి కన్నతండ్రి మంగళవారం రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని పాఠశాలలకు సెలవు ఇవ్వడం వల్ల పిల్లలు ఇంటి వద్దనే ఆడుకుంటున్నారు కాగా నేడు సెలవు రాకపోయినా నా కూతురు బ్రతికి ఉండేదేమో అని ఆ కన్నతండ్రి చేస్తున్న ఆర్తనాదాలు అందరి హృదయాలను కలచివేశాయి. బడిలో ఉన్నా బ్రతికేదేమో అంటూ విలపిస్తూ తన కూతురు మృతదేహం వద్ద తల్లిదండ్రుల రోదనలు ప్రతి ఒక్కరి హృదయంలో బాధ కలిగించాయి.

# ఇరాన్‌తో యుద్ధం ముగిసినట్లే..



## అయితే సైనిక చర్యలు ఇంకా పూర్తి కాలేదు: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్, అమెరికా యుద్ధం ముగింపు దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. బుధవారం 'ఫాక్స్ బిజినెస్' ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఇరాన్‌తో యుద్ధం చాలావరకు ముగిసినట్లేనని నేను భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. అయితే ఇదే సమయంలో తమ సైనిక చర్యలు ఇంకా పూర్తిగా పూర్తి కాలేదని ఇరాన్ ఒక ఒప్పందానికి రావాలని బలంగా కోరుకుంటోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన మొదటి విడత చర్చలు విఫలమైన తర్వాత అమెరికా నౌకాదళం హార్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ ఓడరేవులను లక్ష్యంగా చేసుకుని భారీ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. వేల సంఖ్యలో అమెరికా సైనికులు, యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో పహారా కాస్తున్నాయి. ఇప్పటికే ఇరాన్ వైపు వెళ్తున్న అనేక నౌకలను అమెరికా వెనక్కి పంపింది. 'నేను ఇప్పుడు వెనక్కు తగ్గితే ఆ దేశం కోలుకోవడానికి 20 యేళ్లు పడుతుంది. మేము ఇంకా పని పూర్తి చేయలేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు.

**అణుబాంబు అడ్డుకోవడం కోసమే దాడులు:** ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనే లక్ష్యంతోనే ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి తాము యుద్ధాన్ని ప్రారంభించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీతోపాటు పలువురు కీలక నేతలు తొలి రోజే మరణించగా.. ఆ దేశ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. 'నేను గనుక ఈ దాడులకు ఆదేశం చకపోయి ఉంటే ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని తయారుచేసి ఉండేది. అదే జరిగితే ప్రపంచం అంతా వారిని చూసి వణకాల్సి వచ్చేది' అని ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు.

**ఇస్లామాబాద్ వేదికగా మళ్లీ చర్చలు:** రెండో విడత శాంతి చర్చలు వచ్చే రెండు రోజుల్లోనే పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ అణు ఆశయాలను కట్టడి చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. అయితే వైస్‌ప్రెసిడెంట్ జెడి వాన్స్ మాత్రం ఇరు దేశాల మధ్య అపనమ్మకం ఎక్కువగా ఉందని. ఈ సమస్య రాత్రికి రాత్రే పరిష్కారం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ ఈ నెల 22తో ముగియనుంది. అయితే ఈలోపే చర్చలు నిర్వహించుకుని, సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. కానీ ఈ చర్చలు విఫలమైతే రెండు దేశాలు ఏం చేస్తాయన్న దానిపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.



# పదిహేనేళ్ల భయాలకు స్వస్తి పలుకుదాం

## పశ్చిమబెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగలేఖ

### మమత పాలన లక్ష్యంగా ప్రధాని విమర్శలు

**కోల్‌కతా, ఏప్రిల్ 15:** బెంగాలీ నూతన సంవత్సరం (పొయిలా బైశాఖ్) సందర్భంగా, బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. గత 15 ఏళ్లుగా తృణమూల్ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో సృష్టించబడిన భయానక వాతావ రణాన్ని, ఆందోళనను అంతం చేయాలని ఆయన ఓటర్లకు బహిరంగ పిలుపునిచ్చారు. అంతకు ముందు రోజు, బెంగాలీ నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. తన సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రధానమంత్రి రాజకీయంరమైన వ్యాఖ్యలకు దూరంగా ఉన్నప్పటికీ, ఈ బహిరంగ లేఖలో మాత్రం తృణమూల్ కాంగ్రెస్, మమత బెనర్జీ నేతృత్వం లోని ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన సోషల్ మీడియా పోస్ట్ ఇంగ్లీష్, బెంగాలీ భాషలలో ఉండగా, ఈ బహిరంగ లేఖ మాత్రం కేవలం బెంగాలీ భాషలో ఉంది. "గత 15 ఏళ్లుగా, పశ్చిమ బెంగాల్ ప్రజలు దుష్పరిపాలన, అరాచకత్వం, అవినీతికి బాధితులుగా మారారు. ఈ సమస్యలన్నీ సామాడన్యుడి ప్రాథమిక హక్కులు, గౌరవం, సంస్కృతిపై తీవ్ర ప్రభావం చూపాయి," అని ప్రధాని మోడీ ఆ లేఖలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రజల బాధలు, కష్టాలను చూసి తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ప్రధాని మోడీ తెలిపారు. "తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టించింది. ఒకవేళ బిజెపి ప్రభుత్వం ఏర్పడితే, యువతకు ఉపాధి, మహిళల భద్రతకు పూర్తి భరోసా కల్పిస్తాం. కాబట్టి, ఈసారి 'ప్రజాస్వామ్య పండుగ' అయిన ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయండి," అని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. "ఈ నెల చివరలో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కేవలం సాధారణ ఎన్నికలు మాత్రమే కావు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంపన్నత దిశగా నడిపించడానికి వేసే తొలి అడుగుగా, ఇదొక సువర్ణావకాశం. మన వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షించుకోవడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునే సమయం ఇప్పుడు ఆసన్నమైంది. ఈ ఎన్నికలు భయం, విశ్వాసం మధ్య జరిగే పోరాటం," అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా ఓటు వేయాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. "మీ అందరికీ నేను ఒక వినమ్రమైన, హృదయపూర్వక విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజాస్వామ్య పండుగ అయిన ఈ ఎన్నికల్లో స్వచ్ఛందంగా, నిర్భయంగా పాల్గొనండి. 'అభివృద్ధి చెందిన పశ్చిమ బెంగాల్' కలను సాకారం చేయడానికి మాతో చేతులు కలపండి. ఈసారి, పశ్చిమ బెంగాల్ ప్రజలు భారతీయ జనతా పార్టీపై మరియు నాపై తమ విశ్వాసాన్ని ఉంచి, మాకు ఒక చారిత్రాత్మక విజయాన్ని బహూకరిస్తారని తాను దృఢంగా విశ్వసిస్తున్నా, నమ్ముతున్నాను," అని ఆయన తన సందేశాన్ని ముగించారు.

# వికసిత్ భారత్‌కు 9సూత్రాలు



## కర్ణాటకలోని ఆదిచుంచనగరి మఠం సందర్శించిన ప్రధాని మోడీ

### దేశ నిర్మాణంలో సంస్కృతి, సేవల పాత్ర అద్వితీయం

### పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రధాని పిలుపు

**మండ్య, ఏప్రిల్ 15:** 'వికసిత్ కర్ణాటక'ను సాధించడం.. 'వికసిత్ భారత్' దార్శనికతకు దోహదపడటం లక్ష్యంగా తొమ్మిది సూత్రాల అభివృద్ధి అజెండాను ప్రధానమంత్రి నరేంద్రమోడీ వివ రించారు. కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లాలోని ప్రసిద్ధ శ్రీ ఆదిచుంచనగిరి మఠంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, సమ్మిళిత వృద్ధికి పౌర భాగస్వామ్యం, సుస్థిరత, సాంస్కృతిక విలువలే కీలక చోదకాలని పేర్కొన్నారు. జల సంరక్షణ, పర్యావరణంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కావేరీ పరీవాహక ప్రాంతంపై ఆధారపడిన ప్రాంతాలలో జల సంరక్షణ ఒక ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.

సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులను అవలంబించాలని ఆయన పౌరులను కోరారు. సహజ వనరులను పరి రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ అవగాహనలో భాగంగా, పర్యావరణ బాధ్యతను సాంస్కృతిక భావనతో ముడిపెడుతూ, తమ తల్లుల పేరు మీద చెట్లు నాటాలని ప్రధాని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వయం సమృద్ధి, స్థానిక ఆర్థిక వ్యవస్థను ప్రోత్స హించాల్సి ఉందంటూ, 'వోకల్ ఫర్ లోకల్' చొరవను బలపరుస్తూ, స్వదేశీ పరిశ్రమలకు మరియు స్థానికంగా తయారైన ఉత్పత్తులకు మరింత మద్దతు ఇవ్వాలని మోడీ పిలుపునిచ్చారు. ఆయన దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థలను ప్రోత్సహించడానికి భారతదేశంలోని వివిధ ప్రాంతాలను అన్వేషించాలని పౌరులను కోరారు. సుస్థిర వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలి అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా మాండ్యా వంటి వ్యవసాయ ప్రాంతాలలోని రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సహజ, రసాయన రహిత వ్యవసాయం వైపు క్రమంగా మారాలని ప్రధానమంత్రి సూచించారు. నేల ఆరోగ్యం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. జీవనశైలి సమస్యలపై, పెరుగుతున్న ఊబకాయంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాగి వంటి సాంప్రదాయ ఆహారాలను ప్రోత్సహించడంతో పాటు, నూనె వినియోగాన్ని తగ్గించడం. యోగా, క్రీడల ద్వారా శారీరక శ్రమను పెంచడం వంటివి సూచించారు.

**దేశ నిర్మాణంలో సంస్కృతి, సేవ పాత్ర :** సమాజాన్ని బలోపేతం చేయడంలో, పౌరులలో ఒక లక్ష్య స్ఫూర్తిని పెంపొందించడంలో సేవ ప్రాముఖ్యతను ప్రధానమంత్రి నరేంద్రమోడీ వివరించారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక ఉన్నతిలో ఆదిచుంచనగిరి మఠం వంటి ఆధ్యాత్మిక సంస్థల పాత్రను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావిం చారు. భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆధునికఅభివృద్ధిలో ఆధ్యాత్మిక విలువలను ఏకీ కృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉం దన్నారు.

# మంటల్లో పశ్చిమాసియా



## హార్ముజ్ దిగ్బంధనానికి 10 వేల మంది సిబ్బంది

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్ ఓడరేవులపై పూర్తి దిగ్బంధనాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధితో సహా కీలక ప్రాంతీయ జలమార్గాలలోనూ అమెరికా దళాలు మోహరించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. హార్ముజ్ జలసంధిపై దిగ్బంధనానికి ఇరాన్ పోర్టుల్లో దాదాపు 10వేల మంది సైనికులు, మెరైన్లు, వైమానిక దళ సిబ్బందిని మోహరించినట్లు సమాచారం. 'దిగ్బంధనాన్ని ప్రారంభించిన 36 గంటల్లోనే ఇరాన్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను అమెరికా దళాలు పూర్తిగా నిలిపివేశాయి. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యంపైనే ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఆధారపడి ఉంది' అని యుఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ పేర్కొన్నారు. 'యుఎస్ నావికాదళ పర్యవేక్షణలో క్షిపణులు సిద్ధంగా ఉన్నాయి. అవి ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే, లోపలకు వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుంటాయి' అని అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. అయితే హార్ముజ్ మొత్తానికి కాకుండా ఇరాన్ పోర్టులను మాత్రమే అమెరికా దిగ్బంధించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, గల్ఫ్ దేశాల నుంచి బయల్దేరి హార్ముజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన 'రిచ్ స్టార్రీ' అనే నౌక అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా వెనుతిరిగింది. ఈ నౌక 2.50 లక్షల బ్యారెళ్ల చమురును యుఎఇలో నింపుకొని బయల్దేరిందని షిప్పింగ్ డేటా వెల్లడించింది. దిగ్బంధనం మొదటిరోజు ఇరాన్ నుంచి బయల్దేరిన ఎనిమిది నౌకల్లో చైనాకు చెందిన ఒక ట్యాంకర్ కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఒమన్ గల్ఫ్‌లోని ఇరాన్ ఓడరేవు చబహార్ నుంచి బయల్దేరిన రెండు ఆయిల్ ట్యాంకర్లను ఇరాన్ ఓడరేవు చబహారాన్ నుంచి బయల్దేరిన రెండు ఆయిల్ ట్యాంకర్లను అమెరికా విధ్వంసక నౌక అడ్డుకుందని యుఎస్ అధికారులు పేర్కొన్నారు.

# డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి ద్రోహం



## కేంద్రం వైఖరి మారకపోతే తీవ్ర పరిణామాలు: స్టాలిన్

**చెన్నై, ఏప్రిల్ 15:** నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేస్తోందని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు గళాన్ని వినిపించుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. దేశం అభివృద్ధికి కృషి చేసిన నేరానికి కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తుందా? అని స్టాలిన్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. రేపు పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని చూస్తున్న డీలిమిటేషన్ సవరణ బిల్లుపై దక్షిణ భారత ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని స్టాలిన్ అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను తాము వ్యతిరేకిస్తూనే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం కుట్రపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రాతినిథ్యం తగ్గించేందుకు కేంద్ర సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.





## బాలికలపై లైంగిక వేధింపులు

# నిందితుడి ఇంటిపైకి బుల్డోజర్

**ముంబయి, ఏప్రిల్ 15:** దేశచరిత్రలో మునుపెన్నడూ చూడలేని మహా ఘోరం మహారాష్ట్రలో వెలుగుచూసింది. 19 ఏళ్ల మహ్మద్ అయాజ్ అలియాస్ తన్వీర్ అత్యంత దారుణాలకు ఒడిగట్టాడు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా 180 మంది బాలికలను ట్రాప్ చేసి వేర్వేరు రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా బాలికల అశ్లీల దృశ్యాలు కూడా చిత్రీకరించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన యావత్తు దేశాన్ని కలవరపాటుకు గురిచేసింది. అమరావతి జిల్లాలోని పరత్వాడా పట్టణానికి చెందిన తన్వీర్ లవ్‌ట్రాప్ పేరుతో బాలికలను ముగ్గులోకి దింపేవాడు. అనంతరం ముంబయి, పుణె నగరాలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడేవాడు. అంతేకాకుండా ఇప్పటి వరకు 350అసభ్య వీడియోలు కూడా చిత్రీకరించాడు. వీటిని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి వ్యభిచార కూపంలోకి దింపేవాడు. వాట్సాప్, స్నాప్‌చాట్ గ్రూపుల ద్వారా మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని ట్రాప్‌లో దింపేవాడు. అయితే ఈ విషయం రాజ్యసభ ఎంపి అనిల్ బోండే దృష్టిలో పడడంతో అతగాడి కీచక పర్వం బయటపడింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తన్వీర్ అకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్ 11న తన్వీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భయంకరమైన దారుణాలు బయటపడ్డాయి. ఇప్పటి వరకు 180 మంది బాలికలపై అత్యాచారం చేయగా 350 అసభ్య వీడియోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 14న నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 7 రోజులు పోలీస్ కస్టడీకి ఇచ్చింది. ఈ కేసులో మరో ముగ్గురిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు ఉజేర్‌ఖాన్ అనే నిందితుడు జరిగిన నేరాలను పూసగుచ్చినట్లు చెప్పాడు. ప్రస్తుతం తన్వీర్ మొబైల్‌ను పరిశీలిస్తున్నారు. బిజెపి ఎమ్మెల్యే ప్రవీణ్ తాయడే సమక్షంలో నిందితుడి ఇంటిని జెసిబితో కూల్చివేశారు. తన్వీర్‌కు గతంలో ఎంఐఎంతో సంబంధాలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు స్పం దించారు. తన్వీర్‌కు పార్టీతో ఎలాంటి సం బంధాలు లేవని అమరావతి ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ ముజీబ్ తెలిపారు. తన్వీర్‌ను ఇదివరకే పార్టీ నుంచి తొలగించినట్లు తెలిపారు.

# నాటో కూటమి గతంలో లేదు, భవిష్యత్తులోనూ ఉండదు: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్‌తో యుద్ధం చేసే విషయంలో, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించే విషయంలో నాటో కూటమి నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుపడిన ఆయన తాజాగా మరోసారి ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలువలేదని మండిపడ్డారు అమెరికాకు అవసమైనప్పుడు ఎప్పుడూ నాటో కూటమి అండగా లేదని, భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దృష్టిలో నాటో కూటమి గతంలో లేదు, భవిష్యతులో ఉండబోదని అసహనం వ్యక్తం చేశారు. కాగా గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా నాటో కూటమిని ఒక కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచనల ప్రకటన చేశారు. మరోవైపు అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో-14, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42 వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొన్నదని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవి చేశారు. పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. దాంతో ఇరువరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నాటో ఉంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో యూరప్ ప్లాన్ బిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించుకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తున్నదని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు కృషి చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

## భార్యాభర్త సహా మూడేళ్ల చిన్నారి మృతి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. బుద్ధ విహార్ పరిధిలో స్లమ్ ఏరియాలో మంటలు చెలరేగడంతో గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతి అవడం స్థానికంగా అందరినీ కలచివేసింది. పోలీసులు తెలిపిన ప్రకారం బుద్ధవిహార్ పరిధిలో నిలువ ఉంచిన ప్లాస్టిక్ స్క్రాప్‌లో బుధవారం తెల్లవారుఝామున 1 గంట ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన గుడిసెల్లోని కుటుంబాలు అప్రమత్తమయ్యేలోగా గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. గుడిసెలకు మంటలు అంటుకోవడంతో ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్తలు, మూడేళ్ల చిన్నారి మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదానికి కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.



## ఆప్ ఎంపి ఇళ్లు, కార్యాలయాల్లో ఇడి సోదాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు, అశోక్ కుమార్ మిట్టల్ ఇళ్లు, కార్యాలయాల్లో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేశారు. జలంధర్ కంటోన్మెంట్‌లోని 16, ది మాల్ రోడ్‌లో ఉన్న ఆయన నివాసంలో సోదాలు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. రాఘవ్ చద్దా స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఉపనాయకుడిగా మిట్టల్‌ను నియమించిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించి మిట్టల్ నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సోదాలపై త్వరలో ప్రకటన ఉంటుందని అన్నారు. అశోక్ కుమార్ మిట్టల్ వ్యాపారవేత్త, విద్యావేత్త. లవ్లీ గ్రూప్‌నకు అధిపతిగా ఉన్నారు.

# పాక్ మళ్లీ వక్రబుద్ధి

## 800మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు ప్రణాళిక

### గుర్తించిన నిఘా వర్గాలు.. సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** భారత్‌లో ప్రధానంగా జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం



నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం. నిఘావర్గాల హెచ్చరికతో సరిహద్దులో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు బిఎస్ఎఫ్ వర్గాలు తెలిపాయి.



## రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టు సమన్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** గుర్గావ్‌లోని షికోపూర్ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. మరో ఎనిమిది మందికి ప్రత్యేక కోర్టు బుధవారం తాఖీదులిచ్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును (ఛార్జ్‌షీట్) పరిగణనలోకి తీసుకున్న రౌస్ అవెన్యూ కోర్టు, మే 16న తమ ముందు హాజరుకావాలని నిందితులందరినీ ఆదేశించింది. 2008 నాటి ఈ భూ ఒప్పందం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద ఇడి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

# భారత్‌కు భారీగా ఇరాన్ చమురు

## దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రాక

**ముంబై, ఏప్రిల్ 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ఇరాన్ నుంచి భారత్‌కు దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు వచ్చింది. సుమారు ఏడేళ్ల తర్వాత ఇరాన్ నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తోంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను అమెరికా ఇటీవల తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నెల 19న గడువు ముగియనుండగా, దీనిని పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ చమురుపై విధించిన గడువు ఈ వారాంతంలో ముగియనున్నందున, భారత్ వ్యూహాత్మకంగా అంతకుముందే టెహ్రాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రపంచ ఇంధన కొరత, ధరల స్థిరీకరణ కోసం అమెరికా రష్యా, ఇరాన్ ముడి చమురు కొనుగోళ్లకు తాత్కాలికంగా అనుమతించింది. దీనితో ఇరాన్ నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకుం



టోంది. ఇరాన్ చమురుతో నిండిన అతిపెద్ద ముడి చమురు రవాణా నౌక 'జయ' ఇప్పటికే భారత తూర్పు తీరంలోని పారాదీప్ వద్ద సరుకును దింపుతోంది. మరో చమురు నౌక 'ఫెలిసిటీ' పశ్చిమ తీరంలోని సిక్కాలో చమురును అన్‌లోడ్ చేస్తోంది. ఈ రెండు నౌకల్లో 2 మిలియన్ బ్యారెళ్ల చమురు చొప్పున వచ్చింది. భారతదేశం అవసరాల కోసం ఇరాన్ నుంచి ముడి చమురును సేకరిస్తామని ఈ నెల ప్రారంభంలో భారత్ తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని ఖర్గ్‌లో ముడి చమురు నింపుకున్న 'డెర్యా' నౌక భారతదేశ పశ్చిమ తీరంలో నిలిచి ఉంది. అయితే ఏ రేవుకు వెళ్లాలన్నదానిపై ఈ నౌక తదుపరి ఆదేశాల కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

16-4Pg6exHMNWJQE.qxd:16-4Pg6exHMNWJQE.qxd 1/1/02 6:50 AM Page 1



# ఢిల్లీ సిఎం రేఖాగుప్తకు శ్రీవారి చిత్రపటం బహూకరణ



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఢిల్లీ సిఎం రేఖాగుప్త దంపతులను బుధవారం ఉదయం తిరుమలలోని అతిధిగృహాంలో బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.పృధ్వీరెడ్డి కలిశారు. మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై సార్థకమైన ఇరువురి మధ్య చర్చలు జరిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆమె నాయకత్వం మరింత బలంగా కొనసాగాలని ఆకాంక్షి ంచారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి,శ్రీవారి ఆలయంలో ఆమె గడిపిన క్షణాల చిత్రపటాన్ని అందజేశారు.

# దేశం మరింత అభివృద్ధి చెందాలి - శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశప్రజలందరికీ మంచి జరగాలని, అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బుధవారం ఉదయం శ్రీవారి తోమాల సేవలో, విఐపి బ్రేక్‌లో సినీనటుడు సోనాసూద్ కుటుంబంతో కలసి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, మహిళా మాజీ క్రికెటర్ మిథాలీరాజ్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.

శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు వైసిపి మద్దతు - పార్టీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా లోక్‌సభ.అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. పార్టీ తరపున కీలక నేత సజ్జల రామకృష్ణా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. డీలిమిటేషన్ అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగమని, జనాభా ప్రాతిపదికన ప్రతినిధుల సంఖ్య పెరగడం వల్ల ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడానికి ఇది సరైన నిర్ణయమని, దీనివల్ల ఓటరుకు మరియు ప్రజా ప్రతినిధికి మధ్య ఉన్న దూరం తగ్గుతుందని వైసీపీ భావిస్తోందని సజ్జల స్పష్టం చేసారు..డీలిమిటేషన్ వల్ల కేవలం సీట్ల సంఖ్య పెరగడమే కాకుండా, బడుగు బలహీన వర్గాలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని వైసీపీ ఆశిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కావాలన్నా ఈ పునర్విభజన ప్రక్రియ తప్పనిసరని అన్నారు. అందుకే దీనిని స్వాగతించాల్సిన అవసరం ఉందని సజ్జల పేర్కొన్నారు. కేంద్రం తీసుకునే ఈ నిర్ణయం ప్రజాస్వామ్య పరిరక్షణకు, భవిష్యత్తు రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉందని వైసీపీ స్పష్టం చేసింది. ఈ పరిణామం రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసే అవకాశం ఉందని సజ్జల వ్యాఖ్యానించారు.

## కృష్ణపట్నం పోర్ట్‌ను సందర్శించిన మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**ముత్తుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా అదాని కృష్ణపట్నం పోర్ట్‌ను బుధవారం పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలతో, సీఈఓ రాఘవరావు, పోర్టు ప్రతినిధులతో కలిసి షిప్‌లో ప్రయాణించారు.పోర్టు మొత్తం పర్యవేక్షించడంతో పాటు పోర్టుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.కృష్ణపట్నం పోర్టు కార్యకలాపాల విస్తరణ, కంటైన ర్ టెర్మినల్ పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై మంత్రి చర్చించారు. ఎగుమతి, దిగుమతి సామర్థ్యం పెంచే విధంగా పోర్టు విస్తరణ పనులు చేపట్టాలని మంత్రి సూచించారు.పోర్టు కార్యకలాపాలు పెరగడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ సీఈఓ జగదీష్ పటేల్, పలువురు కూటమి నేతలు, పోర్ట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌కు జైలు శిక్ష

**తిరుపతి, ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఏడిజె కోర్టు బుధవారం కీలక తీర్పును వెలువరించింది.తిరుపతి జిల్లా ఎర్ర వారి పాలెం మండలంకు చెందిన స్మగ్లర్ వాయలపాటి హరినాథ రెడ్డి (54) స్మగ్లర్‌కు 5 సంవత్సరం జైలుశిక్ష, 3 లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు.

ఎర్ర వారి పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన కేసు అవసరమైన సాక్ష్యాలను పోలీసులు న్యాయస్థానంకు అందజేసి శిక్షపడేలా చూశారు.

## ఎస్పీడిసిఎల్ డిప్యూటీ ఇఇ సస్పెన్షన్

**తిరుపతి, ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని సత్యసాయి సర్కిల్, మడకశిర సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. రఘును విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు, విద్యుత్ పరి కరాల దుర్వినియోగం, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల రవాణాకు డిపార్ట్‌మెంటల్ వ్యాన్‌ను ఉపయోగించకపోవడం, రైతులతో దురుసుగా ప్రవర్తించడం, ఎస్‌ఏపిలో 262 వ్యవసాయ సర్వీసు దరఖాస్తులను ఉద్దేశపూర్వ కంగా తొలగించడం, వివిధ ప్రదేశాల్లో విద్యుత్ లైన్లను అంచనాల అనుమతి లేకుండా మార్చడం, తదితర అంశాలపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

## జూన్ నాటికి డంప్ యార్డులు క్లీన్ చేయాలి

### - లెగసీ వేస్ట్ తొలగింపుపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశం

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని లెగసీ వేస్ట్‌ని వెంటనే తొలగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రైవేటు ఏజన్సీలను ఆదేశించారు. అమరావతిలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ మేనేజింగ్ బి.అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ప్రైవేటు ఏజన్సీల ప్రతినిధులతో వివిధ పనులు జరుగుతున్న తీరును పట్టాభిరామ్ సమీక్షించారు. లెగసీ వేస్ట్ తొలగింపు. రవాణా సౌకర్యాలు, ఆర్టీఎఫ్ , ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు, వాటి కోసం స్థలాల సేకరణ, ఆయా ప్రదేశాలలో మట్టిని ల్యాబ్ లకు పంపించడం..మొదలైన విషయాలను లోతుగా సమీక్షించారు. తిరుపతి, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం, ధర్మవరం, పుట్టపర్తి, రాజంపేట ,ఆదోని పార్వతీపురం, పాలకొల్లు, నిడదవోలు తదితర నగరాలు, పట్టణాలలో పరిస్థితులను ఏజన్సీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఏజన్సీలు మందకోడిగా పనులు చేయడం పట్ల చైర్మన్ పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్రంలో పారిశుద్ధ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిపెట్టారని, పనులలో వేగం పెంచాలని ఆదేశించారు. కొన్ని చోట్ల లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగించకుండా, దానిపైనే ఫ్రెష్ వేస్ట్ వేస్తున్నారని తెలుసుకుని, అది సరైన పద్ధతికాదని చెప్పారు. డంప్ యార్డుల నుంచి తొలగిస్తున్న లెగసీవేస్ట్ ని ఎక్కడికి తరలిస్తున్నారో ఆ వివరాలను కూడా రిపోర్ట్‌లో పొందుపరచాలన్నారు. ఎక్కడైతే ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు భూముల లభ్యత సమస్య ఉందో, ఆయా జిల్లాల కలెక్టర్లతో , ఎమ్మెల్యేలతో తాను మాట్లాడతానని చైర్మన్ పట్టాభిరామ్ చెప్పారు. పలు చోట్ల ఏజన్సీలు లెగసీ వేస్ట్ తొలగింపు పనులు ప్రారంభించకపోవడం పట్ల కార్పొరేషన్ ఎండీ, బి.అనిల్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ నెల 21వ తేదీ లోపల పనులు ప్రారంభించని ఏజన్సీల ఒప్పందం రద్దుకు సిఫారసు చేయడానికి తాము వెనుకాడబోమన్నారు. జూన్ నాటికి పనులు మొత్తం పూర్తి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే, వెంటనే తమకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ఒక పక్క లెగసీవేస్ట్ ని తొలగిస్తూ మరోపక్క వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అనిల్ కుమార్ రెడ్డి చెప్పారు.

# తెలుగుదేశం పార్టీలో రాయలసీమకు పెద్దపీట

### - జాతీయ, రాష్ట్ర కమిటీల్లో సీమలోనే 59 మందికి పదవులు - కడప, అనంతపురం జిల్లాలకు కీలక పదవులు

**రాజంపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీలలో రాయలసీమకు పెద్దపీట వేశారు. అత్యున్నత పదవులు ఇచ్చారు. గత ఎన్నికల్లో సీమ ప్రజలు తెలుగుదేశం పార్టీని ఎలా అక్కున చేసుకున్నారో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కూడా అదే రీతిలో పదవులను కట్టబెట్టి పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. మొత్తం 245 పదవుల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన మంత్రి నారా లోకేష్ కాకుండా 59 పదవులు రాయలసీమలోని పార్టీ నేతలకే ఇచ్చారంటే విశేషం. పార్టీ రాష్ట్ర కమిటీలలో లోకేష్ బ్రాండ్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ కూడా పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తూనే ఆది నుంచి పార్టీని నమ్ముకుని ప్రయాణం కొనసాగిస్తున్న వారికి అగ్ర తాంబూలం ఇచ్చారు. వలసనేతలకు దాదాపు పార్టీలో మొండి చేయి చూపారు.29 మందితో ఏర్పాటుచేసిన రాష్ట్ర ఉన్నత స్థాయి పొలిట్ బ్యూరోలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, బనగానపల్లె నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులకు స్థానం కల్పించారు .గతంలో ఉన్న కడప శ్రీనివాసులు రెడ్డికి ఈ దఫా జోనల్ ఇన్చార్జిగా అవకాశం ఇచ్చారు. మరోవైపు31 మందితో ఏర్పాటైనజాతీయ కమిటీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా నందికొట్కూరు నియోజకవర్గంనుంచి బైరెడ్డి శబరికి అవకాశం కల్పించారు. జాతీయ ఉపాధ్యక్షులుగా కడప జిల్లాకి చెందిన కడప అసెంబ్లీకి సంబంధించి పార్టీ సీనియర్ నేత బాలిశెట్టి హరిప్రసాద్ ప్రస్తుతం ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డికి అవకాశం ఇచ్చారు. జాతీయ అధికార ప్రతినిధులలో దీపక్ రెడ్డి( రాయదుర్గం), బీకే పార్థసారథి (పెనుకొండ), ఎన్.విజయకుమార్ (తిరుపతి) ఎంపికయ్యారు.రాష్ట్ర ప్రధానకార్యదర్శులుగా 7 మంది నియ మించగా అందులో వి .ఎస్ ముక్తియార్ (కడప జిల్లా ప్రొద్దుటూరు) ఎన్ అమర్నాథరెడ్డి (పలమనేరు)కు చోటు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 16 మందిని ఎంపిక చేయగా అందులో సంజీవ్ కుమార్ (కర్నూల్), ఆకుపోగు ప్రభాకర్ (కోడుమూరు ),జి.తిప్పే స్వామి (మడకశిర)బి. నరసింహయాదవ్ (తిరుపతి) ఎంపికయ్యారు., రాష్ట్ర అధికార ప్రతినిధులుగా14 మందిని ఏర్పాటు చేయగా అందులో దీవి జయ నాగేశ్వరెడ్డి (ఎమ్మిగనూరు) మద్దిపట్ల సూర్య ప్రకాష్ ( పీలేరు) లకు అవకాశం దక్కింది. రాష్ట్ర జోనల్ కో ఆర్డినేటర్లగా 10 మందిని ఏర్పాటు చేయగా అందులో నిన్నటి వరకు పొలిట్ బ్యూరో ఉన్న రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి ( వాసు కడప), బిటి నాయుడు ( ఆదోని) ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా59 మందిని నియమించగా అందులో యనమల సుధాకర్ (బద్వేల్) ఎస్. గోవర్ధన్ రెడ్డి (కడప) మాల్రా శివానందరెడ్డి (నందికొట్కూరు) తుగ్గలి నాగేంద్ర (పత్తికొండ), పి తిక్క రెడ్డి ( మంత్రాలయం), మాన్వి దేవేంద్రప్ప (ఆదోని), డాక్టర్ పత్తి హిమబిందు ( గుంతకల్ ),దావెళ్ల మురళి (అనంతపురం), కొండవీటి భావన (అనంతపురం) ,ముద్దాల రంగయ్య (రాప్తాడు) ,సామకోట ఆదినారాయణ (పుట్టపర్తి), పరిటాల శ్రీరామ్ (ధర్మవరం), పర్వీన్ భాను (కదిరి), గిరిజా శ్రీ అలియాస్ పర్వీన్ తాజ్ (తంబళ్లపల్లె), ఏ.రవి నాయుడు (తిరుపతి) భీమినేని చిట్టిబాబు (గంగాధర్ నెల్లూరు) ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా 77 మందిని నియమిస్తే రాయలసీమలో( మోహన్ రెడ్డి (రాజంపేట) దుద్యాల అనిత దీప్తి ( రైల్వే కోడూరు), పి మునిశేఖర్ రెడ్డి (మైదుకూరు ),ధరూరు జేమ్స్ (కర్నూల్) ,కె పద్మలత రెడ్డి (కర్నూల్) ,వలసల రామకృష్ణ (డోన్,) దేవేల వెంకట రాముడు (అనంతపురం), డిపోలన్న (అనంతపురం), తేజస్విని (అనంతపురం) తలారి ఆదినారాయణ (అనంతపురం), పాల్యం రామసుబ్బమ్మ ( రాప్తాడు) ,నిమ్మల అమరేష్ (పెనుగొండ ), జెరిపిటి నరసింహులు (పుట్టపర్తి), పి.తులసి( మదనపల్లె), అనిత యాదవ్ (తిరుపతి ) పురిమెట్ల కుమారి (తిరుపతి), డాక్టర్ గుమ్మడిపూడి దశరధాచారి ( శ్రీకాళహస్తి) మాసారపు సుబ్బయ్య (శ్రీకాళహస్తి )పి. చందన స్రవంతి( సత్యవేడు )లక్షీ ్మ ప్రసన్న (నగిరి )ఆర్ మీరా( నగిరి) కర్జాల అరుణ (గంగాధర్ నెల్లూరు) ఎంపికయ్యారు.

## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశంపై ఎపి సిఎం చంద్రబాబుకు టిజి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ



**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాత వార్తప్రతినిధి:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశంపై దక్షిణాది రాష్ట్రాల గళాన్ని వినిపిస్తూ టీజీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాసారు.నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు స్టాలిన్, సిద్ధరామయ్య, పినరయి విజయన్ వంటి నేతలకు లేఖలు పంపించారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల పెంపు చేపడితే, పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత గణనీయంగా తగ్గిపోతుందని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు మరియు సీట్ల పెంపును ముడిపెడుతూ గందరగోళం సృష్టిస్తోందని, దీనివల్ల భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాల మాటకు విలువ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాఖ్య స్ఫూర్తిని కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాలన్నీ ఒకే తాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన ఈ లేఖల ద్వారా స్పష్టం చేశారుజ ప్రస్తుత లెక్కల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరగడం, దక్షిణాదిలో జనాభా నియంత్రణ విజయవంతంగా అమలు కావడం రాజకీయంగా మనకు శాపంగా మారుతోందని విశ్లేషకులు చెబుతున్నారనే విషయం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. లోక్‌సభ స్థానాలను 543 నుండి 850కి పెంచితే, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల సీట్లు 80 నుంచి ఏకంగా 120కి పెరిగే అవకాశం ఉండగా, దక్షిణాది రాష్ట్రాల వాటా ఆ నిష్పత్తిలో పెరగదు. అంటే, దేశాభివృద్ధికి భారీగా పన్నులు చెల్లిస్తూ, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించినందుకు గాను దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యంలో శిక్ష విధిస్తున్నట్లుగా ఉందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం సీట్ల సంఖ్య సమస్య మాత్రమే కాదని, దేశ విధాన నిర్ణయాల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రభావం కనుమరుగయ్యే ప్రమాదమని ఆయన నొక్కి చెప్పారు ఈ సంక్లిష్ట సమస్యకు పరిష్కారంగా సీఎం రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన హైబ్రిడ్ మోడల్‌.ను ప్రతిపాదించారు. కేవలం జనాభానే ప్రాతిపదికగా తీసుకోకుండా, పెరిగే సీట్లలో సగభాగాన్ని మాత్రమే జనాభా ఆధారంగా కేటాయించాలని ఆయన సూచించారు. మిగిలిన సగం సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం (జీఎస్‌డీపీ) పన్నుల చెల్లింపు, అక్షరాస్యత మరియు ఇతర అభివృద్ధి సూచికల ఆధారంగా కేటాయించాలని స్పష్టం చేశారు.

అప్పుడే బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని, దేశాభివృద్ధిలో పోటీతత్వం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ హైబ్రిడ్ విధానంపై దక్షిణాది ముఖ్యమంత్రులంతా చర్చించి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన తన లేఖలో కోరారు.

# అవకాశం.. నా అదృష్టం.. పార్టీ బలోపేతానికి కృషి

### - చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేష్



**తిరుపతిరూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన నారా లోకేష్ తనకు లభించిన అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. బుధవారం రామానాయుడు సమావేశ మందిరములో చంద్రగిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తల త్యాగాలే కారణమని పేర్కొన్న లోకేష్...అన్యాయంగా కేసులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. భక్తులపై దాడులు చేసినవారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తనపై కూడా 23 కేసులు నమోదైనట్లు తెలిపారు. 40వేల మంది కార్యకర్తలపై తప్పుడు 2వేలు కేసులు తొలగించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో రూ.4వేల రుపాయాల పెన్సన్‌తో పాటు వికలాంగులకు రూ.6వేల రుపాయాల పెన్సన్ అందిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. డియస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, జిడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు : మంత్రి బిసి జనార్దన్ రెడ్డి



**ముత్తుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని, అప్పుడూ, ఇప్పుడూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ముత్తుకూరు మండలం నేలటూరుపాళెంలో 30.59 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో గ్రామగ్రామాన అభివృద్ధి పనులు జాతరలా జరిగాయన్నారు. అయితే 2019-24 మధ్య వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిందన్నారు.2024లో కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు మళ్లీ మొదలయ్యాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అండదండలతో సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధిని విస్మరించి దోపిడీపైనే దృష్టి పెట్టారని ధ్వజమెత్తారు.కాలుష్యంతో అల్లాడుతున్న నేలటూరు గ్రామాన్ని తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చర్యలు చేపట్టామన్నారు.ప్రధాన గ్రామం కోసం మాదరాజుగూడూరు వద్ద భూమి కేటాయించి ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభించామన్నారు. మత్స్యకారుల కోసం చేపట్టిన ఇళ్ల నిర్మాణం వావిలేటిపాడు వద్ద పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిందని గుర్తు చేశారు.ఎస్సీ కాలనీ వాసుల కోసం భూసేకరణ జరగాల్సివుందన్నారు. 2019కి ముందు కొన్ని ప్రాంతాలను పరిశీలించామని, ఎన్నికల కోడ్‌తో ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నేలటూరు వాసులపై కక్షకట్టినట్టుగా ఇళ్ల నిర్మాణాన్ని అర్థాంతరంగా ఆపేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదట మాదరాజుగూడూరు వద్ద పనులను పూర్తి చేయిస్తున్నామన్నారు. ఆర్‌అండ్ ఆర్ కాలనీల నిర్మాణం పూర్తి చేయడానికి ఏపీ జెన్ కో తో పాటు సెయిల్ కంపెనీ నిధులు ఇవ్వాల్సివుందన్నారు. ఒప్పందం ప్రకారం నిధులు కేటాయిస్తే ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని తెలియజేశారు. గ్రామం తరలింపు పేరుతో నేలటూరులో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, నేలటూరు తరలింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అలాగే ఫిషింగ్ జెట్టీ నిర్మాణంతో పాటు ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణ బాధ్యత తనదే అని స్పష్టం చేశారు. కాగా నేలటూరు వాసులు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, ఏపీ కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు తదితరులకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, కృష్ణపట్నం దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయంలో హుండీల ద్వారా రు.2కోట్ల 68 లక్షలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తులు శ్రీ అమ్మవారికి హుండీల ద్వారా రు.2కోట్ల 68 లక్షల 48వేల 521ల భారతీయ నగదుతో పాటు 249 యుఎస్ఎ డాలర్లు, 45 యూరోలు, 7 మలేషియన్ రింగేట్స్, 34 సింగపూర్ డాలర్స్, 130 యుఎఇ దిర్హమ్స్, 1.25 కువైట్ దినార్లు, 221 సౌదీ రియాల్స్, 20 న్యూజిలాండ్ డాలర్స్, 60 ఆస్ట్రేలియా డాలర్స్, 35 ఇంగ్లండ్ పౌండ్స్, 180 థాయ్‌లాండ్ (బిఎహెచ్‌టి) =, 200 ఒమన్ బైసాలు, 11 కతార్ రియాల్స్, 430 గ్రాముల బంగారం, 2కెజిల 755 గ్రాముల వెండి కానుకలుగా సమర్పించారని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బుధవారం జరిగిన హుండీలెక్కింపులను ఆయన చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పర్యవేక్షించారు.



హుండీ లెక్కింపులు పర్యవేక్షిస్తున్న ఇఓ

## ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ గురుకులాలు ప్రభంజనం: మంత్రి సవిత

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫస్ట్ ఇంటర్‌లో 97 శాతం, సెకండ్ ఇంటర్‌లో 94శాతంతో బీసీ గురుకులం విద్యార్థుల సత్తా. ఎంజేపీ ఫలితాలపై మంత్రి సవిత హర్షం. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంత్రి సవిత అభినందనలు. ఫలితాల సాధనలో ఎంజేపీ స్కూళ్ల సిబ్బంది పనితీరు అమోఘం. ఫలించిన సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ కృషి. బీసీ గురుకులాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చించిన కూటమి ప్రభుత్వం. బీసీ విద్యార్థులకు ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందిస్తున్నాం. బీసీ బిడ్డల అత్యుత్తమ ఫలితాలతో నెరవేరిన కూటమి ప్రభుత్వం లక్ష్యం.

## సిఎం చంద్రబాబుపై అనుచిత పోస్టులు

### - రాప్తాడుకు చెందిన గిరీష్ అరెస్ట్.. ఆపై సొంత పూచీకత్తుపై బెయిల్ !

**కుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడుపై సోషియల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం పంపనూరుకు చెందిన వైఎస్సార్సీ సోషియల్ మీడియా ఇన్‌చార్జ్ గిరీష్‌కుమార్‌రెడ్డి, మాజీ సిఎం వైఎస్ జగన్ మాజీ సిపిఆర్వో శ్రీహరిలపై తెదేపా నేతల ఫిర్యాదు మేరకు కుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈకేసుకు సంబంధించి గిరీష్‌కుమార్‌రెడ్డిని బుధవారం కుప్పం పోలీసులు అరెస్ట్ చేసి కుప్పం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 25వేల రూపాయల సొంత పూచీకత్తుతో గిరీష్‌కుమార్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేశారు. కాగా మాజీ సిపిఆర్వో శ్రీహరిని కుప్పం పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా బుధవారం కుప్పం కోర్టుకు మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వచ్చారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ భరత్ పలువురు స్థానిక నేతలతో కలసి కుప్పం కోర్టు వద్దకు చేరుకుని పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్థానిక న్యాయవాదులతో మాట్లాడారు.

## లక్ష్మి దుర్గ పిటిషన్ డిస్మిస్

### డ్రైవర్ హత్యకేసులో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య రెండో నిందితులుగా కొనసాగింపు

**రాజమహేంద్రవరం,ఏప్రిల్15, ప్రభాతవార్త** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.

దళిత వర్గానికి చెందిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్యచేశారన్న కేసులో రెండో నిందితురాలు గా వున్న అనంత లక్షీ ్మ దుర్గ ను ఆ కేసు నుంచి తొలగించాలని వేసిన పిటిషన్ ను స్పెషల్ కోర్టు డిస్మిస్ చేసింది. లక్ష్మీ దుర్గ పాత్ర ఆ కేసులో ప్రాథమికంగా నిర్ధారణ ఉన్నందున నిందితురాలుగా కొనసాగిస్తూ ప్రత్యేక న్యాయస్థానం విచారణలో ఆదేశించింది.డ్రైవర్ సుబ్రహ్మణ్యంని ఎంఎల్సీ అనంతబాబు హత్య చేశారన్న కేసులో రెండో నిందితురాలు గావున్న లక్షీ ్మ దుర్గ ను ప్రమేయం లేదంటూ నిందితులు తరుపున వేసిన పిటిషన్ వాద ప్రతి వాదనలు విన్న జడ్జి గంధం సునీత ఈ మేరకు తీర్పు చెప్పారు. ఈనెల 17న తదుపరి హత్య కేసు విచారణకు ఇరువురు హాజరు కావలసిందిగా ఆదేశించారు. ఈవిచారణ రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో జరిగింది. ఎంఎల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్న ఈ కేసులో ఆయన భార్య లక్షీ ్మ దుర్గ కూడా రెండో నిందితురాలుగా పోలీసులు నమోదు చేశారు. దీనిపై ఎమ్మెల్సీ భార్య లక్షీ్మ దుర్గ కు ఈ హత్యకు సంబంధం లేదని పెట్టుకున్న పిటిషన్ పై వాద ప్రతి వాదనలు జరిగాయి.హత్యలో సంబంధంలేని లక్ష్మీ దుర్గ ను కేసు నుంచి తొలగించాలంటూ ఆమె తరపు న్యాయవాదులు వాదించగా హత్యా సమయంలో సిసి ఫుటేజ్ ను,సెల్‌ఫోన్ రికార్డ్స్ తదితర ప్రాథమిక ఆధారాలు నేపథ్యంలో లక్షీ ్మ దుర్గపాత్ర ఉన్నదంటూ ప్రాసిక్యూషన్ వాదించింది.



## ఆంధ్ర మెడికల్ కాలేజ్ ఆర్థోపెడిక్స్ పీజీ విద్యార్థికి
# ఆల్-ఇండియా స్థాయి పరీక్షలో రజత పతకం

విశాఖపట్నం-ప్రభాతవార్త

ఆంధ్ర మెడికల్ కాలేజ్, విశాఖపట్నంలోని ఆర్థోపెడిక్స్ విభాగం జాతీయ స్థాయిలో విశిష్టమైన విద్యా విజయాన్ని సాధించి మరొక ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆర్థోపెడిక్స్ విభాగానికి చెందిన పీజీ విద్యార్థి డా.ప్రణయ్ చౌదరి, 2026లో నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన 9వ పార్వతి-ఎస్ఎస్‌కెఎం గోల్డ్ మెడల్ పరీక్షలో రజత పతకాన్ని సాధించారు. ఈ పరీక్ష దేశవ్యాప్తంగా తుది 8వ పేజీలో

## టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా
# మరోసారి చింతకాయల విజయ్

### నిబద్ధతకు దక్కిన గుర్తింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చింతకాయల విజయ్‌ను పార్టీ అధిష్టానం మరోసారి నియమించింది. 2019 ఎన్నికల అనంతరం పార్టీ తీవ్ర కష్టకాలంలో ఉన్న సమయంలో జెండాను భుజాన వేసుకుని నిలబడిన యువ నాయకులలో విజయ్ ఒకరు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐటీడీపీ, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేసిన తరుణంలో, చంద్రబాబు, లోకేష్‌ల మార్గదర్శకత్వంలో వారిని రక్షించే బాధ్యతను విజయ్ ధైర్యంగా స్వీకరించారు. చట్టపరంగా 8వ పేజీలో

# విశాఖి పోర్టులో కాలుష్య కల్లోలం..!

పోర్టు యాజమాన్యం జరిమానాలు విధిస్తున్నా వివిధ సంస్థలు నిర్లక్ష్యం
-ధూళి ఎగరకుండా తూతూ మంత్రంగా వాటరింగ్
-పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి



8లో

**20న జరగనున్న సింహాచలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవ వేడుకలో భాగంగా స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం మంత్రి వంగలపూడి అనిత పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.**

విశాఖపట్నం, ప్రభాతవార్త



## విలీనంపై సీఎందే తుదినిర్ణయం : భీమిలి ఎమ్మెల్యే గంటా



విశాఖపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదన సీఎం దృష్టిలో ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. 6వ వార్డులోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు మండలాలకు ఒక జిల్లా పరిషత్ ఏర్పాటు సాధ్యం కాదన్నారు. ఇప్పటికే భీమిలి మండలంలో సగం జీవీఎంసీలో కలిసిందని.. ఆనందపురం మండలాన్ని జీవీఎంసీలో 8వ పేజీలో

## జాతీయ వర్కింగ్ అధ్యక్షులుగా నారా లోకేష్ నియమితులు అవ్వడం కార్యకర్తలకు పండుగ రోజు

### విఎంఆర్‌డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



విశాఖపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

నారా లోకేష్ టీడీపీ జాతీయ వర్కింగ్ అధ్యక్షులుగా నియమితులు కావడం పార్టీకి శుభ సూచకమని కార్యకర్తలకు పండుగ రోజు అని విఎంఆర్‌డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటుచేసిన ఘనత నారా లోకేష్ దే అని పేర్కొన్నారు. పార్టీలో సామాన్య కార్యకర్తలను సైతం నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకునేలా తీర్చిదిద్దారు అని అన్నారు. జాతీయ వర్కింగ్ అధ్యక్షులుగా వారి మార్గదర్శకత్వంలో టీడీపీ మరింత బలోపేతం అవుతోంది అని తెలిపారు. నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించనున్నది అని పేర్కొన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ఎంవి ప్రణవ్ గోపాల్

విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా విఎంఆర్‌డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ నియమితులయ్యారు. ఆయన విద్యార్థి దశనుంచే టీడీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు. ఆ సమయంలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంవి ప్రణవ్ గోపాల్‌ని విఎంఆర్‌డిఏ చైర్మన్‌గా కోటమీ ప్రభుత్వం నియమించారు. ప్రస్తుతం రాష్ట్ర కమిటిలో చోటు కల్పించి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నియమించటం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణగోపాల్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకి, విశాఖ ఎంపి ఎం. శ్రీ భరత్‌కి, తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పట్టాభిరామ్‌కి, జిల్లా ప్రజా ప్రతినిధులకు, జిల్లా నాయకత్వానికి, టీడీపీ శ్రేణులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయటానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## సాఫీగా చందనోత్సవం టిక్కెట్ల విక్రయం : ఈఓ జె.వెంకటరావు



సింహాచలం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవానికి సంబంధించి టిక్కెట్ల విక్రయ ప్రక్రియ ఇప్పుడు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ (బ్యాంకులలో) వేదికల ద్వారా ఎటువంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరుగుతోందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ టిక్కెట్ల బుకింగ్‌లో తలెత్తిన సమస్యలను ఐటీ నిపుణుల సహాయంతో పూర్తిగా పరిష్కరించామని ఆయన పేర్కొన్నారు. నేటి నుండి భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. వెబ్‌సైట్ మరియు సర్వర్ సమస్యలను అధిగమించాం. భక్తులు ఆన్‌లైన్‌లో నిర్ణీత కోటా ప్రకారం టిక్కెట్లను సులభంగా పొందవచ్చు. యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ శాఖల ద్వారా ఆఫ్‌లైన్ టిక్కెట్ల పంపిణీ ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాం. భక్తుల రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని బ్యాంకు అధికారులకు 8వ పేజీలో

## విజయవంతంగా కిశోరి వికాసం ప్రాంతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహణ

విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



విశాఖపట్నం నగరంలోని పాపా హోమ్, విశాఖపట్నం వద్ద మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం' ప్రాంతీయ స్థాయి వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కిశోర బాల బాలికల సాధికారత, భద్రత, విద్యా కొనసాగింపు, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి ముందు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి వర్చువల్ విధానంలో పాల్గొని, కిశోర బాల బాలికల సమగ్ర అభివృద్ధి కోసం 8వ పేజీలో

## టీడీపీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గాల్లో..
# ఉమ్మడి విశాఖ నేతలకు పెద్దపీట

పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా వంగలపూడి అనిత, రాష్ట్ర అధ్యక్షులుగా పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చింతకాయల విజయ్ కొనసాగింపు -మరికొందర్ని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా, రాష్ట్ర కార్యదర్శులుగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకం



8లో

## చందనోత్సవ విజయవంతానికి
# అంకితభావంతో పనిచేయాలి

తుది విడత సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ -సెక్టార్ అధికారులు సమన్వయంతో.. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచన -ప్రయివేటు వాహనాలను అనుమతించం.. ఒక పాస్ పై ఒక వాహనాన్నే అనుమతిస్తాం : సీపీ



8లో

**సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రతిభ**
-100 శాతం ఉత్తీర్ణత, 493 మార్కులతో అగ్రస్థానం 8లో

## మీ కలలకు రెక్కలు తొడిగే
# అద్భుతమైన వేదిక ఈ జాబ్ మేళా

### అవంతి కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి



8లో

## సీట్రేడ్ క్రూస్ గ్లోబల్ 2026లో
# భారత్‌కు ప్రతిష్ఠాత్మక ప్రాతినిధ్యం



8లో

## గార్డులకు జీతాలు ఇవ్వని రావుస్ సంస్థ

అడ్డగోలుగా 6 నెలలుగా కాంట్రాక్టు కొనసాగింపు -కార్మిక చట్టానికి తూట్లు -అర కొర వేతనాలు -15వ తేదీ దాకా ఇవ్వకపోతే ఎలా బ్రతకాలి అంటున్న గార్డ్స్



8లో

## విధేయతకు పట్టాభిషేకం..
# టీడీపీ రాష్ట్ర సారథిగా మళ్లీ పల్లా శ్రీనివాస్

### గాజువాక' విజేతపైనే అధినేత మొగ్గు -మెజారిటీ రికార్డు.. సమన్వయంలో మేటి

గాజువాక,ఏప్రిల్ 15,ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కొనసాగిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. 2024 జూన్ 14న బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయడంలో ఆయన చూపిన చొరవ, కార్యకర్తలతో ఉన్న అనుబంధం పల్లాకు మరోసారి ఈ కీలక బాధ్యత దక్కేలా చేశాయి.

**తిరుగులేని మెజారిటీ.. తిరుగులేని గుర్తింపు...**

గత అసెంబ్లీ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు సృష్టించిన ప్రభంజనం పార్టీలో ఆయన 8వ పేజీలో

# లోకేష్‌కు కీలక బాధ్యతలు..

### టీడీపీకి నూతన ఊపు: పల్లా శ్రీనివాసరావు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

తెలుగుదేశం పార్టీలో కీలక పరిణామంగా యువనేత నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. లోకేష్ నియామకం పార్టీకి నూతన ఉత్సాహాన్ని తీసుకొస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని పల్లా కొనియాడారు. ఆయన నాయకత్వం టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా, తనను రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పల్లా కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించడంలో టీడీపీ ముందుంటుందని, తనలాంటి బీసీ నేతకు ఈ స్థాయి అవకాశం రావడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. 'యువగళం' పాదయాత్రతో ప్రజలతో మమేకమైన లోకేష్ నాయకత్వం లో, చంద్రబాబు మార్గదర్శకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పల్లా స్పష్టం చేశారు. కార్యకర్తల సంక్షేమం, డిజిటల్ మెంబర్‌షిప్ ద్వారా భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలతో పార్టీకి ఆధునిక నిర్మాణాన్ని తీసుకువచ్చారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, సీనియర్ల అనుభవాన్ని వినియోగించుకుంటూ యువతకు అవకాశాలు కల్పిస్తామని పల్లా పేర్కొన్నారు.

# గీతం విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు

### టెప్ ప్రదర్శనలో ప్రతిభ చాటిన యువ ఇంజనీర్లు



విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యంతో అద్భుతమైన ఆవిష్కరణలను రూపొందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నాలజీ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్' (టెప్) కోర్సులో భాగంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రోటోటైప్లను బుధవారం ప్రదర్శించారు. ఈ 8వ పేజీలో

# సృష్టి క్షేత్ర నిర్మాణ విఘ్నాలు తొలగాలి

### అయ్యప్ప స్వామి ఆలయంలో విశేష పూజలు



8లో

**విల్లాలో విలాసం**
మహిళ అనుమానాస్పద మృతి -ఆరుగురిపై కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు 9లో

## రేపు మల్కాపురం ప్రాంతంలో విద్యుత్ నిలిపివేత

**గాజువాక,ఏప్రిల్ 15,ప్రభాతవార్త**

మల్కాపురం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో అత్యవసర నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 కార్యనిర్వాహక ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ (శుక్రవారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. మల్కాపురం, త్రినాధపురం పరిసరాలు, గాంధీవీధి, పల్లివీధి, గొల్లవీధి, మరిడిమాంబ ఆలయ ప్రాంతం, హరిజనవీధి, జలారివీధి, శెట్టిబలిజవీధి, నాగరాజవీధి, రజకవీధి, మార్కెట్ రోడ్డు,సింధియా, యారాడ,ఏకేసీ కాలనీ, కేకేఎల్ జీవీఎంసీ పంప్ హౌస్, ఈఎస్ఐ ఆసుపత్రి, ఐఎంయూ, సీఈఎంఎస్, సింధియా జంక్షన్, పోస్ట్ ఆఫీస్, మసీదు, యారాడ కొండలు, యారాడ గ్రామం, రాడార్, లైట్ హౌస్,బీపీసీఎల్ గోడౌన్, వై-జంక్షన్, డాక్ యార్డ్ ఏరియా, నవయుగ, ఈఐపీఎల్, ఆయిల్ వార్ఫ్, శాతవాహన బస్టాప్, కాకతీయ గేట్, జయేంద్ర కాలనీ, చింతల లోవ, షిప్‌యార్డ్ క్వార్టర్స్, ఐఎన్ హెచ్ఎస్ కల్యాణి ఆసుపత్రి, చింతామణి ఆలయ ప్రాంతాలలో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకుని శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అప్పన్న అన్నదానంకు రూ.2 లక్షలు విరాళం అందించిన గంట్ల



**సింహాచలం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ప్రపంచంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామికి బుధవారం సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు రెండు లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని భక్తులకు అన్న ప్రసాద వితరణకు వినియోగించాలని ఆలయ అధికారులను గంట్ల శ్రీనుబాబు కోరారు. తొలుత సింహాద్రినాథుడు శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు తన కుటుంబ సభ్యులతో కలిసి గంట్ల శ్రీనుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులు స్వీకరించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసచార్యులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.తిరుమలేశ్వర్ రావ్ పర్యవేక్షకులు కె.వెంకటేశ్వరరావులకు ఈ విరాళం అందజేశారు. గతంలో కూడా స్వర్ణ పుష్పాలు, స్వర్ణ తులసీ దళాలు, అన్న ప్రసాద వితరణకు, 3 లక్షలు స్వర్ణ కవచ అలంకరణకు అవసరమైన 27 కేజీలు ఇత్తడి, ఇంకా వస్తు రూపంలో కొంత సామాగ్రి అందజేసినట్లు గంట్ల శ్రీనుబాబు ఈ సందర్భంగా తెలిపారు.

## సాఫీగా చందనోత్సవం టిక్కెట్ల విక్రయం :ఈఓ జె.వెంకటరావు

**సింహాచలం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవానికి సంబంధించి టిక్కెట్ల విక్రయ ప్రక్రియ ఇప్పుడు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ (బ్యాంకులలో) వేదికల ద్వారా ఎటువంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరుగుతోందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ టిక్కెట్ల బుకింగ్‌లో తలెత్తిన సమస్యలను ఐటీ నిపుణుల సహాయంతో పూర్తిగా పరిష్కరించామని ఆయన పేర్కొన్నారు. నేటి నుండి భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. వెబ్‌సైట్, సర్వర్ సమస్యలను అధిగమించాం. భక్తులు ఆన్‌లైన్‌లో నిర్ణీత కోటా ప్రకారం టిక్కెట్లను సులభంగా పొందవచ్చు. యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ శాఖల ద్వారా ఆఫ్‌లైన్ టిక్కెట్ల పంపిణీ ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాం. భక్తుల రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించడమైనది. టిక్కెట్ల కేటాయింపులో పారదర్శకత పాటిస్తున్నామని, భక్తులు ఈ మార్పును గమనించి సహకరించాలని ఈఓ కోరారు. చందనోత్సవ దర్శనాన్ని భక్తులు ప్రశాంతంగా చేసుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

## మాజీ ఎంపీపీ యేచూరికి పరామర్శ



**ఆనందపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఆనందపురం మండల మాజీ ఎంపీపీ యేచూరి లక్ష్మీనారాయణను టీడీపీ భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయబాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఆయన ఇంట్లో పడిపోవడంతో కాలుకు దెబ్బతగిలి శస్త్ర చికిత్స జరిగింది. దీంతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఆయనకు భరోసా ఇచ్చారు. అయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, నాయకులు బి ఆర్‌బి నాయుడు, లొడగల వెంకటరావు, సినగం రామారావు, కొట్యాడ లక్ష్మణ మూర్తి, రౌతు వెంకటరావు లొడగల రమణ, లెంక నరసింగరావు తదితరులు ఉన్నారు.

## ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థిని లక్ష్మి సహస్ర రాధిక

**గాజువాక,ఏప్రిల్ 15 ప్రభాతవార్త**



ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో గాజువాకకు చెందిన లక్ష్మి సహస్ర రాధిక అద్భుత ప్రతిభ కనబరిచింది. జీవీఎంసీ 65వ వార్డు సంజీవిగిరి కాలనీకి చెందిన రొంగలి గోపికృష్ణ, భవానీ దంపతుల కుమార్తె అయిన ఈమె గాజువాక ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ మొదటి సం చదువుతుంది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా దయాల్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. సహస్ర ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి తమవంతు సహకారం అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు నానాజీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఏడి పరిధిలో నేడు పవర్ కట్

**మాధవధార, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్‌లో ఎన్ఏడి, అంబేద్కర్ కాలనీ, మాధవధార, కరసా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్-2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బికె నాయుడు బుధవారం తెలిపారు. దీంతో ఎన్ఏడి, గౌరి నగర్, గణేష్ నగర్, శాంతి నగర్, అంబేద్కర్ కాలనీ, మాధవధార, ఓల్డ్ కరసా, న్యూ కరసా నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## జన గణన రెండవ విడత శిక్షణ ప్రారంభం



**మాధవధార, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

జనగణన-2027 కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు రెండో విడత శిక్షణ కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం ప్రారంభమైంది. నార్త్ జోన్ జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 16 (గురువారం) నుంచి స్వీయ గణన అధికా రిక వెబ్సైట్, యాప్ ద్వారా చేసుకోవచ్చని తెలిపారు. ఇంటింటి సర్వే మే 1 నుంచి 30 వరకు జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో నార్త్ జోన్ సూపరిండెంట్ శ్రీనివాస్, ఏపీడీ పుణ్యవతి, అధికారులు ఉన్నారు.

## ఏయుఎం మైలురాయిని చేరుకున్న పీరమల్ ఫైనాన్స్

**ఆరిలోవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

రిటైల్ రంగంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ పనిచేసే ప్రముఖ ఎన్ బి ఎఫ్ సి గా పీరమల్ ఫైనాన్స్ తన వృద్ధి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. కంపెనీ మొత్తం అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ విలువ 1 లక్ష కోట్ల మైలురాయిని అధిగమించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు భారతదేశంలోని ప్రాంతీయ, సెమీ-అర్బన్ మార్కెట్లలో కంపెనీ బలమైన ఎదుగుదలను ఈ విజయం స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. పీరమల్ ఫైనాన్స్‌కు ఆంధ్రప్రదేశ్ ఒక ప్రధాన మార్కెట్‌గా కొనసాగుతోంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు వంటి ప్రధాన నగరాల్లో ఉన్న 31 బ్రాంచిల మద్దతుతో కంపెనీకి బలమైన లోన్ బుక్ ఉంది. ఎఫ్ వై 21లో గల 20 బ్రాంచిల నుంచి ఇప్పుడు 26 రాష్ట్రాల్లోని 460 నగరాల్లో గల 650కి పైగా బ్రాంచిలకు విస్తరించింది. పీరమల్ ఫైనాన్స్ తన రిటైల్ రుణ వ్యాపారంలో స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తూ, ఎఫ్ వై 28 నాటికి 1.5 లక్షల కోట్ల ఏ యు ఎం ను చేరుకునే లక్ష్యం దిశగా ముందుకు సాగుతోంది. మెట్రో నగరాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ రుణాలకు గల మంచి డిమాండ్ కారణంగా ఆంధ్రప్రదేశ్ మాకు ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా మారింది. మా ఉనికిని మరింత విస్తరించడంలో భాగంగా మేము సాంకేతికత డేటా ఆధారిత మదింపు విధానాలు ద్వారా దేశవ్యాప్తంగా బాధ్యతాయుత రుణ సేవలను విస్తరించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

## మే 1న మేడే ఉత్సవాలు

### శ్రమ శక్తి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



**గాజువాక,ఏప్రిల్ 15,ప్రభాతవార్త**

మే 1న మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జేసీఎల్) ఎం. రామారావు తెలిపారు. బుధవారం అక్కయ్యపాలెంలోని లేబర్ కార్యాలయంలో ఆయనను టి.ఎన్టీయూసీ ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ కలిశారు. రామారావు మాట్లాడుతూ కార్మిక సేవలో విశిష్టత చాటిన వారికి 'శ్రమ శక్తి', ఉత్తమ ఫలితాలు సాధించిన పరిశ్రమలకు 'ఉత్తమ యాజమాన్య' అవార్డులు అందజేస్తామన్నారు. అర్హులు అక్కయ్యపాలెంలోని డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టి.ఎన్టీయూసీ సహాయ కార్యదర్శి శీరంశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

## అగ్నిబాధితులకు టీడీపీ సాయం

**ఆనందపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**



భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టీడీపీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు బుధవారం ఆనందపురం మండలం చందక పంచాయతీ లొడగల వారి కల్లాల్లో అగ్నిబాధితులను పరామర్శించి సాయం అందజేశారు. మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మూడు పూరిళ్ళను సందర్శించారు. బాధితుల్లో లొడగల రామలక్ష్మి ఆమె కుమార్తె వివాహానికి దాచుకున్న రూ. 7,20,000లు నగదు, నాలుగు తులాల బంగారం, ఇంటి సామాగ్రి మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. లొడగల అప్పియమ్మకు చెందిన రూ. 2,50,000 లు నగదుతో పాటు మొత్తం సామాన్లు కాలిపోయినవి. పట్టిగుల్లు అచ్చియ్యమ్మకు చెందిన రూ. 30,000లు నగదు ఇంటి సామాగ్రి మొత్తం కాలిపోయింది. ఈ సందర్భంగా విజయ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ద్వారా బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితులకు ఒక్కొక్కరికి రెండు బియ్యం బస్తాలు, రెండు 5కేజీల ఆయిల్ డబ్బాలు, పళ్ళు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పాండ్రంగి అప్పలరాజు, దొంతల అప్పలనాయుడు (బిటిఎల్), మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, సెక్రటరీ లొడగల వెంకట్రావు, బిఆర్ బి నాయుడు, మహంతి శివాజీ, రెడ్డి శంకర్రావు, పాలవలస వెంకట్రావు, లోడగల వెంకటరమణ, నిమ్మల అప్పలరాజు, పోతిన గోవిందు, లంక నర్సింగరావు, చందవరపు కుమార్ నాయకులు పాల్గొన్నారు.

## ఆళ్వార్డాస్ ఆధ్వర్యంలో 18న మెగా జాబ్ డ్రైవ్




**విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఆళ్వార్డాస్ డిగ్రీ కాలేజ్ డేటా ప్రో సహకారంతో ఈనెల 18న నిర్వహిస్తున్న మెగా జాబ్ డ్రైవ్‌ను వినియోగించు కోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ రాహుల్ కోరారు. ఈ మేరకు ఎంవీపీలో బ్రాంచ్ లో చైర్మన్ డాక్టర్ ఎస్.వి.హెచ్ రాజేంద్ర, ప్రిన్సిపల్ డాక్టర్ కే జగదీశ్వర్ రావు తో కలిసి బుధవారం జాబ్ డ్రైవ్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ డిగ్రీ డిప్లమా పూర్తిచేసిన అభ్యర్థులు నీ జాబ్ డ్రైవ్ లో పాల్గొనవచ్చునన్నారు. విద్యార్థులు ఆయా సర్టిఫికెట్లతో 18వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుండి రెండు గంటల వరకు జరగనున్న జాబ్ డ్రైవ్ కు హాజరు కావచ్చునని తెలిపారు. ఎంవిపి డబల్ రోడ్డు సెక్టర్ 3 డేటా ప్రో కార్యాలయంలో పై కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవిపి కాలనీ సెంటర్ హెడ్ ఎస్ కే ఇషాక్ పాల్గొన్నారు.

## బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 50 మందికి విజయవంతంగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు

**అచ్యుతాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



బ్రాండిక్స్ ఇండియా అచ్యుతాపురంలో నిర్వహించిన 149వ ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా ఎంపిక చేసిన 50 మంది రోగులకు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి. బ్రాండిక్స్ ఆవరణలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురిని గుర్తించి, వారిలో అత్యవసరంగా శస్త్రచికిత్సలు అవసరమైన 50 మందిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిపుణులైన వైద్య బృందం వీరికి అత్యాధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించి, రెండు రోజుల పాటు అవసరమైన మందులను, వైద్య పర్యవేక్షణను ఉచితంగా అందించారు. చికిత్స అనంతరం కోలుకున్న రోగులను సంస్థ ప్రత్యేక వాహనాల్లో సురక్షితంగా తిరిగి బ్రాండిక్స్ ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పులిహోర, పెరుగు అన్నం పంపిణీ చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమకు ఉచితంగా ఆపరేషన్ చేయించిన బ్రాండిక్స్ ఇండియా భారతీయ భాగస్వామి దొరస్వామికి, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి స్వీయ గణన ప్రారంభం



**విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన కార్యక్రమం ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఓ ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ వినూత్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 16 (గురువారం) నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు https://se.census.gov.in పోర్టల్ ద్వారా స్వీయ గణన చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కార్మికులు చురుకుగా పాల్గొని ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. అలాగే ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది రోజుకు కనీసం 10 నుంచి 20 మందికి స్వీయ గణనలో సహకారం అందించాలని ఆయన ఆదేశించారు. సమాజం లోని ప్రముఖులు ముందుండి తమ వివరాలను నమోదు చేసుకుని ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఈ స్వీయ గణన పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ అని, ఎవరిపైనా ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు ప్రణాళికలకు అవసరం అయ్యే కచ్చితమైన గణాంకాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రకటన ద్వారా సూచించారు.

## ఇంటర్ ఫలితాల్లో అచీవర్స్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



నేడు విడుదలైన ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాఖపట్నంలోని అచీవర్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి, తమ కళాశాల కీర్తిని చాటారు. అటు ఎంపీసీ, ఇటు బైపీసీ విభాగాల్లో విద్యార్థులు భారీ మార్కులతో ఉత్తీర్ణులై రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో బి. దీపక్, పూజ అక్షర 470కి గాను 467 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. అలాగే సి.హెచ్.సాయి కౌశిక్ 463 మార్కులు సాధించి సత్తా చాటారు. వీరితో పాటు బి. గగన, ఎన్. శ్రీప్రియ, బి. విహారికలు 462/470 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ విభాగంలో మొత్తం 77 మంది విద్యార్థులు 90% కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషం. సీనియర్ విభాగంలో ఎం. ప్రవీణ్య సాయి 1000కి గాను 990 మార్కులు సాధించి అత్యుత్తమ స్కోరుతో టాపర్‌గా నిలిచారు. ఈ స్ట్రీమ్ నుండి ఏకంగా 74 మంది విద్యార్థులు 900 కంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ విభాగంలో వై. చిద్విలాసిని 983/1000 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, మొత్తం 80 మంది విద్యార్థులు 90% అంతకంటే ఎక్కువ మార్కులు సొంతం చేసుకున్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో ఎం. చాతుర్య 455కి గాను 450 మార్కులు సాధించి మెరిశారు. ఈ విభాగంలో 72 మంది విద్యార్థులు 90% పైగా మార్కులు సాధించారు. విద్యార్థులు సాధించిన ఈ ఘన విజయం పట్ల కళాశాల యాజమాన్యం, అకడమిక్ డీన్ టి.కరుణాకర్, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కఠోర శ్రమ, అధ్యాపకుల సరైన మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వారు కొనియాడారు. విజేతలకు కళాశాల ప్రాంగణంలో ఘనంగా అభినందనలు తెలిపారు

## ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన 'ఆచార్య ఎస్వీ జోగారావు సాహితీ వరివస్య' గ్రంథ ఆవిష్కరణ

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**




ఆంధ్ర విశ్వకళాపరిషత్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఆచార్య వెలమల సిమన్న రాసిన "ఆచార్య ఎస్వీ జోగారావు సాహితీ వరివస్య"అనే గ్రంథాన్ని బుధవారం ఆంధ్రవిశ్వకళా పరిషత్తు తెలుగు శాఖ సమావేశ మందిరంలో పద్మశ్రీ, పద్మభూషణ్ విశ్వ హిందీ పరిషత్తు అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఆచార్య యార్లగడ్డ వారు మాట్లాడుతూ గురువు ఎస్వి జోగారావు పై పుస్తకం రాయడం సంతోష దాయకం అని అన్నారు. ఆచార్య ఎస్వి జోగారావు "మణిప్రవాళం" అనే గ్రంథానికి 1989లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందని, ఈ అవార్డు రావడం ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖ గొప్ప తనం అని అన్నారు.ఈ పుస్తకం రాసి తన గురువు రుణం సిమ్మన్న తీర్చుకున్నారని అన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ జోగారావు ప్రసన్న కుసుమాయుధం, అడిగొప్పల హోరుగాలి, యక్షగానం మొదలైన గ్రంథాలు రాసి పేరు ప్రఖ్యాతలు గడించారని అన్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానం గ్రంథం అచ్చుకాక ముందే దానిపై మొదటిగా స్వతంత్ర అనే పత్రికలో సమీక్ష రాసిన ఘనత జోగారావుకి దక్కుతుందని, శ్రీశ్రీ కవిత్వంమీద మొట్టమొదటి పిహెచ్‌డి చేయించిన ఖ్యాతి జోగారావుకి దక్కుతుందని అన్నారు. సిమ్మన్న ఇలాంటి పుస్తకాలు మరెన్నో రాస్తూ విద్యార్థులకు మేలుచేయాలని తెలియజేశారు. ఆంత్రోపాలజీ ఆచార్యులు పెద్దయ్య మాట్లాడుతూ లక్ష్మీ ప్రసాద్ సిమ్మన్న రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషదాయకమని ఇలాంటి పుస్తకాలు మరెన్నో రాయాలని ఆకాంక్షించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు తెలుగు శాఖ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య నల్లా సత్యనారాయణ మాట్లాడుతూ సిమన్న గారి పుస్తకాలు పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. విశ్రాంత ఆచార్యులు గజ్జా యోహానుబాబు మాట్లాడుతూ ఎస్వి జోగారావు పై సిమ్మన్న పుస్తకం రాయడం గురు శిష్యుల సంబంధాన్ని తెలియ చేస్తుందని అన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గ్రంథ ఆవిష్కరణ చేసిన ఆచార్య యార్లగడ్డ వారికి అలాగే ఈ సభను యేర్పాటు చేసిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం బి.స్నేహలత ఆహ్వానం పలికారు. ఈ గ్రంథ ఆవిష్కరణ సభకు పరిశోధకులు, విద్యార్థులు, విశాఖ పురప్రముఖులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

## అర్చుకునిపాలెం గ్రామంలో పాముకాటుకి యువరైతు మృతి

**పద్మనాభం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



మండలంలో అర్చుకునిపాలెం గ్రామంలో బుదవారం పాముకాటుకి యువరైతు మృతి చెందినట్లు పద్మనాభం సిఐసిహెచ్ శ్రీధర్ చెప్పారు. ఈ సంఘటనపై ఆయన అందించిన వివరాలు ప్రకారం ఇదే గ్రామానికి చెందిన తాలాడ శివ (30)గ్రామ సమీపంలో ఉన్న పొలంలో చోడి పంటకు ఉదయం నీరు పెట్టడానికి మోటారు వద్దకి వెళుతుండగా చేనులో ఉన్న నాగుపాము కాలుపై కాటువేసింది. దీంతో బంధువులు విజయనగరం మహారాజా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.అక్కడ చికిత్స పొందుతూ శివ మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. దీనిపై బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## నానోసెకండ్-లెవల్ ఆర్డర్ గుర్తింపును సాధించిన ఎన్ఎస్ఈ

**ఆరిలోవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ప్రపంచంలో వాల్యూమ్ ఆధారంగా అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజీగా గుర్తింపు పొందిన సంస్థ, 2026 ఏప్రిల్ 11 నుంచి కరెన్సీ డెరివేటివ్స్, కమోడిటీ డెరివేటివ్స్, క్యాష్ (క్యాపిటల్ మార్కెట్), ఈక్విటీ డెరివేటివ్స్ విభాగాల అంతటా తన 'తక్షణ నిర్ధారణ' ఫీచర్‌ను విజయవంతంగా అమలు చేసింది. ఈ ఆధునిక వ్యవస్థ ద్వారా ఆర్డర్ రసీదు ఇప్పుడు మధ్యస్థ, సగటు పరిశీలనలలో నానోసెకండ్ స్థాయిలో నమోదు అవుతోంది. ఈ మైలురాయి ఎన్ఎస్ఇ యొక్క వాణిజ్య మౌలిక సదుపాయాల ఆధునీకరణలో కీలక పరిణామాన్ని సూచిస్తుంది. సాంకేతిక పురోగతి మెరుగైన ప్రక్రియ కింద, ఎన్ఎస్ఈ ట్రేడింగ్ వ్యవస్థకు పంపబడే ప్రతి ఆర్డర్ ఇప్పుడు నానోసెకండ్ స్థాయిలో తక్షణ రసీదును పొందుతోంది. క్యాష్, ఈక్విటీ డెరివేటివ్స్ విభాగాలకు ఈ విస్తరణలో దశలవారీ సమాంతర అమలు దశ కూడా ఉండగా, ప్రస్తుత ఎన్‌క్రిప్షన్ విధానం నుంచి సభ్యులు సాఫీగా మార్పు చెందేందుకు అవకాశం కల్పించబడింది. ఈ వేగవంతమైన సాంకేతిక పురోగతి, ప్రపంచంలోని అత్యంత ఆధునిక ఎక్స్ఛేంజీలతో పోటీ పడుతూ నాయకత్వ స్థానాన్ని కొనసాగించాలన్న ఎన్ఎస్ఈ నిబద్ధతను స్పష్టం చేస్తుంది. దశలవారీ సమాంతర అమలు నమూనా ద్వారా, కొత్త ఫ్రేమ్‌వర్క్‌కు మారుతున్న సమయంలో కూడా వాణిజ్య కార్యకలాపాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయి.

## పూడి శ్రీహరి అరెస్టు కూటమి ప్రభుత్వం కుట్ర



**ఆరిలోవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ ప్రధాన కార్యదర్శి(మీడియా విభాగం) పూడి శ్రీహరిను కూటమి ప్రభు త్వం కుట్రపన్ని అక్రమంగా తాడేపల్లిలో అరెస్టు చేశారని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్సీ విభాగం, అనకాపల్లి జిల్లా ఎస్సీ విభాగం పరిశీలకులు అల్లంపల్లి రాజబాబు అన్నారు. జగన్మోహన్ రెడ్డి జువ్వలదిన్నె షిప్పింగ్ హార్బర్, మత్స్య కారులు ప్రాంత పర్యటనను డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా చంద్రబాబు ఎత్తుగడ రాజకీయమని, ఎంతకాలం రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతారో చూస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రకు చెందిన యువ బిసి నేత పూడి శ్రీ హరి అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం మేడచర్ల గ్రామానికి చెందినవారని, జర్నలిజంలో మంచి పట్టు సాధించిన వ్యక్తి అని, జగన్ ప్రభుత్వంలో పీఆరోవోగా పని చేసి ఉన్నందున కక్ష కట్టి శ్రీ హరికి కనీసం నోటీస్ ఇవ్వకుండా అరెస్టు చేశారని, అక్రమ అరెస్టు చేసి పోలీసులు శ్రీ హరిని ఎక్కడికి తీసుకెళ్ళారో సమాచారం ఇవ్వకుండా తిప్పడం దారుణమని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తుంది, రాబోయే ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని, తప్పు చేసిన ప్రతి పోలీస్ అధికారి పేరు గుర్తు పెట్టుకుంటామని అన్నారు. పూడి శ్రీ హరిని వెంటనే విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు.

## విల్లాలో విలాసం

### మహిళ అనుమానాస్పద మృతి -ఆరుగురు పై కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు

**ఆరిలోవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



జోడిగుళ్లపాలెంకు చెందిన ఆకుమర్తి శాంతి కుమారి (27) విశాలాక్షి నగర్ లో ఉన్న బి స్క్వేర్ విల్లా లాడ్జిలో అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆరిలోవ సీఐ హెచ్. మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం... మంగళవారం 14వ తేదీన మృతురాలు శాంతితో పాటు పుచ్చ సాయికిరణ్, లక్ష్మీ సంజన, ఎన్ సాయికిరణ్, యశ్వంత్, సాయి కుమార్, కొత్తవలస మణి కలిసి బి స్క్వేర్ విల్లాలో విలాసంగా గడిపేందుకు 118, 119 రెండు రూములు బుక్ చేసుకున్నారు. రెండు రూముల్లో రాత్రంతా మద్యం సేవించి ఇష్టానుసారంగా గడిపారు. లక్ష్మి సంజన, పుచ్చ సాయికిరణ్ మధ్య అక్రమ సంబంధం ఉందని తప్పుడు ప్రచారం చేస్తుందని మృతురాలు శాంతి కుమారిని నిలదీయడంతో పాటు ఆమెపై సంజన, సాయికిరణ్ కలిసి దాడికి పాల్పడ్డారు. వీరిద్దరితో పాటు యశ్వంత్ కూడా ఆమెను ఇష్టానుసారంగా కొట్టడంతో శాంతి మనస్థాపం చెంది 118 నెంబర్ గల రూమ్ కు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శాంతి రూమ్ లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకొని ఎంతసేపటికి రాకపోవడంతో కంగారుపడి తలుపులు బద్దలు కొట్టి చూసేసరికి ఆమె రూమ్ లో ఉరి వేసుకుని ఉంది. స్నేహితులందరూ కలిసి దగ్గరిలో ఉన్న మెడికవర్ హాస్పిటల్ కి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టి ఆరుగురును అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలు తల్లి ఆకుమర్తి రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరందరూ సోషల్ మీడియా ద్వారా పరిచయమైనట్లు సమాచారం.

## గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌లను నియంత్రించండి :జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



నగరంలో గల కాలనీలలో, వీధులలో, రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (వ్యర్థాలకు గురయ్యే ప్రదేశాలను) గుర్తించి వాటిని వెంటనే అరికట్టి నియంత్రించాలని, వ్యర్థాలు వీధులలో, కాలనీలలో, బహిరంగ ప్రదేశాలలో పడవేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా దక్షిణం జోన్ 29వ వార్డు పరిధిలోని ప్రకాశరావుపేట తదితర ప్రాంతాలలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడులతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను గుర్తించి ఆయా ప్రదేశాలలో వ్యర్థాలు పడవేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రకాశరావుపేటలో జివిపి పాయింట్ లో వ్యర్థాలు పడుతుండడం గమనించి శానిటరీ ఇన్స్పెక్టర్, శానిటరీ సూపర్వైజర్లు ఎందుకు వ్యర్థాలు లేకుండా నియంత్రించడంలేదని ఆరా తీశారు.ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన ఎప్పటికప్పుడు కల్పించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలు వేసే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు కూడా తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించకుండా నిర్ణీత సమయానికి పారిశుధ్య కార్మికులు, క్లాప్ వాహనాలు కాలనీలలో, వీధులలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజు ఇంటింటి నుండి పారిశుధ్య కార్మికులు వ్యర్థాలను సేకరిస్తున్నారా, క్లాప్ వాహనాలు వస్తున్నాయా అని స్థానిక ప్రజలను ఆరా తీశారు. ప్రతి క్లాప్ వాహనం మూడు ట్రిప్పులు తప్పనిసరిగా వేసేలా చూడాలని ఆదేశించారు. రాత్రి పారిశుధ్య పనులు ఏ విధంగా నిర్వహిస్తున్నారని అధికారులను ఆరా తీశారు. జీవీఎంసీ సహాయ వైద్యాధికారి డా.కృష్ణంరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్, శానిటరీ సూపర్వైజర్లు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 15-04-2026 22:26 Page 1






## క్రెబ్స్ కంపెనీ లే ఆఫ్ ఎత్తివేయాలి



కసింకోట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త; కసింకోట తేగాడ లోగల క్రెబ్స్ ఫార్మా కంపెనీ గత సంవత్సర కాలంగా మూత వేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని, 320 కార్మికులు ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి కి పదేపదే లే ఆఫ్ ఎత్తివేయాలని కోరినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని. సమస్య పరిష్కరించడం లేదని. కంపెనీ తెరిపిస్తానన్న యాజమాన్యం, ఇప్పుడు కంపెనీలో ఉన్న యంత్రాలు ముడిసరుకు తరలించ పోవడానికి చర్యలు చేపడుతుందని, కంపెనీ తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు క్రెబ్స్ ఫార్మా కంపెనీ వద్ద క్రెబ్స్ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తక్షణమే కంపెనీ తెరిపించాలని, సంవత్సర కాలంగా సగం జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబురావు, ఏ.అప్పారావు కన్నబాబు,శ్రీను, ఓ.అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది.

## శ్రీరాంపురంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 15, ప్రభాత వార్త : ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు శ్రీరాంపురంలో మంగళవారం ఘనంగా జరిగాయి. శ్రీరాంపురం మెట్టపై ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి భారీ గజమాలలు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారీ బర్త్ డే కేక్ కట్ చేసి తమ ఆరాధ్య దైవం బాబా సాహెబ్ అంబేద్కర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. సెంటర్లో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), పార్టీ సీనియర్ నాయకులు గొర్రెల రాజుబాబు ముఖ్య అతిథిలుగా విచ్చేసి అంబేద్కర్ కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారీ విందు ఏర్పాటు చేశారు. కొత్తూరు గ్రామానికి చెందిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వీరాభిమాని గారా సత్యనారాయణ యూత్ కమిటీకి పదిహేను కుర్చీలు విరాళంగా అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తిరుమలరాజు నరసింహ రాజు, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కురందాసు రమణ, కలిదిండి జానకి రామరాజు, మాజీ ఎంపిటీసీ పులగల వీరభద్ర రావు, టిడిపి సీనియర్ నాయకులు తలారి రాజా, మాజీ జెడ్పిటీసీ గుడబంటి శాంతమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తిన త్రిమూర్తులు, బొడ్డపాటి వీరాస్వామి, పందు నూకాలమ్మ, చింతాకుల ధారబాబు, మేడిశెట్టి పెంటయ్య, బాబ్జీ, గొర్ల అన్నవరం, ఏనుగుపల్లి నాగేశ్వరరావు, ఏనుగుపల్లి జ్యోతిబాబు, అంబేద్కర్ యూత్ కమిటీ ప్రెసిడెంట్ పందు సుందరరావు, సెక్రటరీ రాయి వెంకట రమణ, పందు గోవిందు, పులగల కన్నారావు, పులగల రాము, మేకా ప్రసాద్, త్రిపరాల అప్పలకొండ, రాయి సురేష్, పెద్ద సంఖ్యలో యూత్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణ : ఎస్పీ



అనకాపల్లి, ఏప్రిల్ 15 (ప్రభాత వార్త): అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమా దాల నివారణ, శాంతిభద్రతల పరిర క్షణ, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని ఎస్పీ ఆదేశించారు. హెల్మెట్ లేకపోవడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగ్ చలానాలు చెల్లించని వాహనాలను సీజ్ చేసి, రవాణా శాఖ ద్వారా లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేయాలని, మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, జీవీఎంసీ, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదకర ప్రాంతాల్లో సాండ్ డ్రమ్స్, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు , మహి ళలపై జరుగుతున్న నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన సదస్సులు నిర్వహించాలి. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, వివిధ విభాగాల డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, బి.మోహన రావు, ఇ.శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, గణేష్, సేనం రమేష్, పిల్లా రమేష్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం : కలెక్టర్



అనకాపల్లి, ఏప్రిల్ 15 (ప్రభాత వార్త) : విద్యార్థులు సురక్షితమైన , పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా అన్ని పాఠశాలల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు , మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ తో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాలలో చదువుతున్న పిల్లల భద్రతపై కీలక ఆదేశాలు చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న పొదలు పిచ్చి మొక్కలు పెరిగిన ప్రాంతాలను పూర్తిగా తొలగించాలన్నారు. పాఠశాల పరిసరాల్లో ఎలాంటి చెత్త లేకుండా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలన్నారు. పాములు, విషపురుగులు వంటి వాటి నివారణ కోసం స్నేక్ క్యాచర్ ద్వారా క్రమం తప్పకుండా పరిశీలనలు చేయించాలన్నారు. పాఠశాల కాంపౌండ్ గోడల చుట్టూ తరచుగా స్ప్రేయింగ్ చేయించి , విద్యార్థుల భద్రత దృష్ట్యా మొదటి అంతస్తులో నిద్రించేలా ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో సీజనల్ పండ్లు, కూరగాయలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, ఆరోగ్యం , ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు అజాగ్రత్తగా ఉంటే సహించేది లేదన్నారు. ప్రతి వారం కనీసం ఒకసారి మండల విద్యాశాఖ అధికారిలు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డిఈఓ అప్పారావు నాయుడు, కెజిబివి పాఠశాలల జిసిడిఓ జెమీమా పాల్గొన్నారు.

## నేడు నూకాంబికకు ఐదు వేల ఘటాలతో భారీ ఊరేగింపు



అనకాపల్లి, ఏప్రిల్ 15 :(ప్రభాతవార్త): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం అనకాపల్లి గవరపాలెం లో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారి నెల పండుగ సందర్భంగా 16వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఐదువేల ఘటాలతో భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు అలయ చైర్మన్ కార్య నిర్వహణ అధికారి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17ననెల పండగ సందర్భంగా ముందు రోజు 16న ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను తెలిపారు. విశాఖపట్నం కు చెందిన హరితేజ లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సారే , 5 వేల ఘట్టాలతో ఈ ఊరేగింపు జరుగు తుందని తెలిపారు. ఈ సందర్భంగా పండగ పురస్కరించుకొని తెల్లవారుజాము నుండి అమ్మవారి దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే 17న సాయంత్రం ఆలయాన్ని మూసి వేయడం జరుగు తుందన్నారు. 18 ఉదయం 6 గంటలకు ఆలయం తెరు సుకుంటుందని తిరిగి దర్శనాలు ప్రారంభ మవుతాయి అన్నారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## గునిపూడి మాజీ సర్పంచ్‌కు ఘన సన్మానం



(నక్కపల్లి, ప్రభాతవార్త) ఏప్రిల్ 15 : మండలంలోని గునిపూడి మాజీ సర్పంచ్ అయినంపూడి పేర్రాజు (బాబు) ను మంగళవారం ఆ గ్రామంలో దళిత సంక్షేమ సంఘం ప్రతినిధు లు ఘనంగా సత్కరించారు. నాలుగుపర్యాయాలు సర్పంచ్గా, మూడు సార్లు ఉప సర్పంచ్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఆయన సేవలు అమోఘమని సంఘ ప్రతినిధులు పిట్టా కృపానందం, గంటా నూకరాజు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దుశ్శాలువతో ఆయన్ని సత్కరించారు. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు తమ గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో అంకితభావంతో సేవ చేశారని, నేటి తరం నాయకులు ఈయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

## లోకేష్, పల్లాకు అభినందనలు తెలిపిన బుద్ధ



అనకాపల్లి, ఏప్రిల్ 15 (ప్రభాత వార్త) : తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీలో మొట్టమొదటిసారిగా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన నారా లోకేష్‌కు, రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా పల్లా శ్రీనివాసరావు, రెండోసారి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చే నియమితులైన యువత భవిష్యత్తుకు దిక్సూచిగా రాష్ట్ర కమిటీ ఉందని దానిలో నన్ను భాగస్వామంగా రాష్ట్ర కార్యవర్గాహక కార్యదర్శిగా నియమించినందుకు చంద్ర బాబు నాయుడు, నారా లోకేష్ కు, పల్లా శ్రీనివాసరావు కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రాష్ట్ర కమిటీ మొత్తంగా 270 మందితో అన్ని వర్గాలకు సమతుల్యం పాటించి యువతకు ఎక్కువ అవకాశాలు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారని అలాగే ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు కూడా సముచిత స్థానం కల్పించారని నాగ జగదీష్ అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ కు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కు అభినందనలు తెలియజేసిన వారు భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణ, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కుప్పిలి జగన్, బీసీ నాయకులు బోడి వెంకటరావు, గుడాల సత్యనారాయణ, బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పొలిమేర నాయుడు, మల్ల గణేష్, మల్ల శివన్నారాయణ, కాంద్రేగుల ముకుంద, విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, సభ్యులు కాంద్రేగుల శివ, కొమ్మోజు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## కూలీలకు అండగా ఉంటాం : గింజాల



(నక్కపల్లి,ప్రభాతవార్త): కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు అన్నారు. డిఎల్ పురంలో చిలకమ్మ లేబర్ సొసైటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులు ఏడిద దేవరాజు,కార్యదర్శి అప్పారావు ఆధ్వర్యంలో ఈ సొసైటీని లక్ష్మణరావుతో పాటు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు లొడగల చంద్రరావు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో చిలకమ్మా లేబర్ సొసైటీ కూలీలకు పని కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యులు లొడగల చంద్రరావు మాట్లాడుతూ చిలకమ్మ పేరు మీద లేబర్ సొసైటీ పెట్టడం సంతోషంగా ఉందని ,ఈ లేబర్ సొసైటీ అనేకమందికి పని కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రతి ఒక్క కూలికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించే విధంగా కృషి చేస్తామని మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ,గింజల శ్రీనివాస్ రావులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాసులు గ్రామ నాయకులు మార్కెట్ డైరెక్టర్ ఏడిద సత్యనారాయణ, ఏడిద చిన్న అప్పన్న ,వెంకటరమణతోపాటు పలువురు దళిత నాయకులు ఏడిద చందు,రమణ తదితరులు ఉన్నారు.

## హిస్టరీ లెక్చరర్ కాపారపు సేవలకు గుర్తింపు



(నక్కపల్లి, ప్రభాతవార్త)ఏప్రిల్ 15 : మన చరిత్ర, పురావస్తుశాఖపై ఎన్నో పరిశోధనలు చేస్తు న్న నక్కపల్లి మండలం చందనాడ గ్రామానికి చెందిన హిస్టరీ లెక్చరర్ కాపారపు నాగేశ్వరరావును ఏయు చరిత్ర, పురావస్తుశాఖ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఘనంగా సత్కరించారు. ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో చరిత్ర, పురావస్తుశాఖలో విద్యనభ్యసించి, అధ్యాపకులుగా పనిచేస్తూ ఎన్నో పరిశోధనలు చేసిన కాపారపు నాగేశ్వరరావును మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ లెక్చరర్గా పనిచేస్తున్న ఈయన భారతదేశ చరిత్ర కాంగ్రెస్ సమావేశాలు, దక్షిణ భారతదేశ చరిత్ర కాంగ్రెస్ సమావేశాల్లో నాగేశ్వరరావు తన పరిశోధనలను కూడా సమర్పించారు. తన సేవలను గుర్తించి ఏయు ప్రాంగణంలో ప్రొఫెసర్ కొల్లూరి సూర్యనారాయణ, కృష్ణకుమారి, ఆర్కియాలజిస్ట్ కమల్హాసన్, తదితరులు సత్కరించడం చాలా సంతోషంగా వుందని నాగేశ్వరరావు చెప్పారు.

## బుజ్జికి అభినందనలు తెలిపిన జనసైనికులు



(ఎస్. రాయవరం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త): యూత్ అధ్యక్షుడు లింగంపల్లి జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో ఎస్. రాయవరం మండలం జనసేన నాయకులు జనసైనికులు కలిసి ప్రముఖ పుణ్య క్షేత్రం అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియమితులైన అయ్యిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు పాయకరావుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి గెడ్డం బుజ్జి ని మంగళవారం ఎస్ రాయవరం మండలం యూత్ అధ్యక్షుడు లింగంపల్లి జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో మండలం జనసేన నాయకులు జనసైనికులు కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మాలేం రాజు, జంగులూరు జనసేన అధ్యక్షులు గొర్లి సతీష్, కొత్త పోలవరం జనసేన అధ్యక్షులు ధూళి కార్తీక్, చిన్నగుమ్ములూరు ఉప అధ్యక్షులు దాసరి ప్రసాద్ ,బల్లంకి రాజు అంతర్వేది రమణ(చిన్న),శానాపతి నాని ,కోలాంటి మురళి ,శానాపతి దిలీప్ పాల్గొన్నారు.

## ఎస్. రాయవరం మండలంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి



(ఎస్. రాయవరం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన ఎస్ రాయవరంలో తాసిల్దార్ కార్యాలయంలో కొరుప్రోలు గ్రామంలో తాజా మాజీ ఎంపీపీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సర్వసిద్ధి గ్రామంలో వైస్ ఎంపీపీ గోవిందరావు వెంకటాపురం గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఉప్పరపల్లిలో సర్పంచ్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎస్ రాయవరం గ్రామంలో జడ్పిటిసి కాకర దేవి గోకులపాడు వి.ఆర్.టి.యు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



(రాంబిల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త) : రాంబిల్లి మండలం కొత్తపేట, పంచదార్ల గ్రామాల్లో ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ భీమ్రావ్ రామ్ జీ అంబేద్కర్ 135వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి. దేవుడునాయుడు మాట్లాడుతూ బాబాసాహెబ్ లాంటి మహనీయులు భారతదేశంలో నిమ్న జాతుల అభివృద్ధి కోసం పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆనాడు భారత రాజ్యాంగ నిర్మాణం రచించే అవకాశం అంబేద్కర్ లాంటి మహనీయులకు వచ్చింది కాబట్టి పేద సామాన్య ప్రజలకు ఈమాత్రమైన సౌకర్యాలు పొందగలుగుతున్నారని అన్నారు, ఇప్పుడున్న మతతత్వ పాలకులు ఆరోజు ఉండి ఉంటే మన జీవితాలు ఏమయ్యావో అని ఊహించుకోవడానికి భయాందోళన చెందుతున్నారని వాపోయారు, ప్రపంచంలోనే అత్యంత మేధావిగా ప్రఖ్యాతిగాంచిన బాబా సాహెబ్ అనేక డిగ్రీ పట్టాలు పొంది, ఎన్నో అవమానాలు ఎదుర్కొని, పేద సామాన్య బడుగు బలహీన వర్గాల కోసం అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించి అందరి సౌలభ్యం కోసం భారత రాజ్యాంగాన్ని రచిస్తే కొద్ది మంది వ్యక్తుల ప్రయోజనాల కోసం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని ఈనాటి పాలకులు కుతంత్రాలు పన్నుతున్నారని ఆయన అన్నారు, అంబేద్కర్ బాటలో పేదల హక్కుల కోసం సమానత్వం, సౌభ్రాతృత్వం సాధన కోసం మన పోరాటాలు నిర్వహించాలని అన్నారు, ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, మత్స్యకార సంఘం నాయకులు సిహెచ్. గంగరాజు, వై.రాము అల్లూరి ప్రజాసంఘాల నాయకులు భూపతి అప్పారావు, అప్పలనాయుడు, దేవుడు, లక్ష్మణ్,ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

## లచ్చన్నపాలెంలో మెగా పశు వైద్య, లేగదూడల ప్రదర్శన



మాకవరపాలెం,ఏప్రిల్ 15, ప్రభాతవార్త : లచ్చన్నపాలెంలో మెగా వైద్య శిబిరం లేగ దూడల ప్రదర్శన జరుగుతుందని టిడిపి సీనియర్ నాయకులు పోతల రాంబాబు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పశుసంవర్ధక పశుగణాబి.వృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మెగా పశువైద్య శిబిరంతో పాటు లేక దూడల ప్రదర్శన జరుగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ చింతకాయని పాత్రుడు హాజరవుతున్నట్లు రాంబాబు తెలిపారు. పశువులలో వచ్చే వివిధ రోగాలకు చికిత్స చేయడమే కాకుండా ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా లేక దూడల ప్రదర్శనలో ఎంపిక చేసిన లేగదుడులకు స్పీకర్ అయ్యన్న చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం 9 గంటల పశు వైద్య శిబిరం, లేక దూడలు ప్రదర్శన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో నిర్వహించనున్నట్లు రాంబాబు తెలిపారు.

## జనవాణిలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే సుందరపు




ఎలమంచిలి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రతి బుధవారం నియోజకవర్గంలో ఉండే నాలుగు మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై జనావాని కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దృష్టికి తీసుకురావడం జరుగుతుంది. ఈ జనవాని కార్యక్రమంలో అర్జీలను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారమయ్యే వాటిని పరిష్కరించి పరిష్కారం కానీ సమస్యలను అధికారులు వారం రోజుల్లోగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఒకసారి జనవాని కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలను తెలియజేసిన వారు తిరిగి మరల జనవాని కార్యక్రమంలో వారి సమస్యలతో రాకూడదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వూటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు , కూటమి నాయకులు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో 100 శాతం ఫలితాలు సాధించిన జడ్పీజీహెచ్ఎస్





ఎలమంచిలి, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: పట్టణంలోని జెడ్. పి.జి.హెచ్.ఎస్.ప్లస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తుందని మరోసారి విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనిపించారు. పరీక్షలకు 51 మంది విద్యార్థులకు గాను 501 మంది నూరు శాతం విద్యార్థులు సాధించి పాఠశాల గర్వకారణంగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు మాట్లాడుతూ ఎంపీసీ విభాగంలో ఒక విద్యార్థికి 963 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారని. బైపీసీ విభాగంలో 948 మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ పర్యవేక్షణ వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి అని అన్నారు. ఎంతటి గొప్ప విజయాన్ని సాధించిన విద్యార్థులను వారికి సహకరించిన తల్లిదండ్రులను బోధనా సిబ్బందిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసుకొని విధంగా అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది.

## సత్తా చాటిన గీతాంజలి కళాశాల విద్యార్థులు



ఎలమంచిలి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కుల సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాలలో కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎల్లపు ప్రశాంతి ఎంపీసీలో 978 మార్కులు సాధించారని, పిల్లా కావ్య ఎంపీసీలో 966 మార్కులు, షేక్ గౌసియా ఎంపీసీలో 940 మార్కులు, సాధించారని అత్యధి మార్కులు సాధించిన విద్యార్థినులు అందరూ ఒక సాధారణ రైతు కుటుంబానికి చెందిన వారిని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్ కుసుమ ఎంపీసీ విభాగంలో 441 మార్కులు సాధించి కళాశాల టాపర్గా నిలిచిందని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గీతాంజలి కళాశాల చైర్మన్ పి సురేష్ బాల్, డైరెక్టర్లు వేదుల తేజశ్రీ, వేదుల రవి అభినందించారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించిన జీజేసీ విద్యార్థులు



మాకవరపాలెం ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులు అధికశాతం ఉత్తీర్ణతతో విజయం సాధించారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వం ఇంటర్మీడి యట్ ప్రథమ ద్వితీయ, సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. మాకవరపాలెం కస్తూర్బా జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేక అధికారి త్రివేణి తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 44, రెండవ సంవత్సర విద్యార్థులు 29మంది పరీక్షకు హాజరు కాగా నూరి శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 49 మంది పరీక్షలకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ భరత్ శ్రీ తెలియజేశారు. అదేవిధంగా మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 93 మంది పరీక్షకు హాజరవుగా 88మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మండలంలో కస్తూర్బా జూనియర్ కళాశాల ప్రథమ ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో నూరి శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం నూరుశాతం, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సా ధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రథమ ద్వితీయ సంవత్సర ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడం పట్ల అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తపరుస్తున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



(నక్కపల్లి,ప్రభాతవార్త ): మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ ప్రథమ ,ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎవరి సత్తా వారు చూపించి శభాష్ అనిపించుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని ,విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉషారాణి ,సలీమాతో పాటుఅధ్యాపకులు అభినందించారు. కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు 88 ఫలితాలు సాధించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్. పావని బైపీసీలో 967 /1000, ఏ. గీత 952/1000, బి. శివ వాణి ,917/1000 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 77.55 సాధించుగా 441 మార్కులు కే. దివ్య తోపాటు జి. అనూష 436, పి. జమీమా 422 మార్కులు సాధించారు. అంబేద్కర్ గురుకుల పాఠశాల ఏడాది ఊహించిన ఫలితాలను సాధించింది మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్. లావణ్య 443 మార్కులు ,ఎంపీసీలో సాధించుగా వై .రాజేశ్వరి మొదటి బైపీసీలో 440 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నువ్వా నేనా అనే విధంగా ఫలితాలు సాధించారు. సిహెచ్. సరస్వతి ఎంపీసీలో 962 మార్కులు సాధించగా కే .లిల్లీ గ్రేస్ బైపీసీలో 960 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాలు ఊహించిన విధంగా విద్యార్థులు సాధించారు. రెండో సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ కి చెందిన ఎం. నరసింహ చార్యులు 948 మార్కులు సాధించగా బైపిసి ఏ. హేమని 935 మార్కులు, హెచ్ఎసిలో ఏం .మమత 874 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో కే. నాగదుర్గ మహాలక్ష్మి హెచ్ ఈ సి లో 480 మార్కులు సాధించింది. ఆమెతోపాటు ఎంపీసీలో పి .జ్యోతి ప్రకాష్ 446 బైపీసీ లో వై. తేజస్విని 438 ,సీఈసీ లో జి .లలిత 424 మార్కులు సాధించారు.



## కృష్ణాపురంలో 8వ పోషణ్ పక్వాడా



ఎలమంచిలి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండలం పురుషోత్తపురం సెక్టార్‌లో గల కృష్ణాపురం గ్రామం లో అంగన్వాడీ సెంటర్ నందు బుధవారం ఐ సి డి సి సూపర్ వైజర్ జి అపరంజి ఆధ్వర్యంలో 8వ ఫోషణ్ పక్వడా కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా అపరంజి మాట్లాడుతు 2సంవత్సరాల లోపు పిల్లలో మెదడు అభివృద్ధి 80 శాతం పెరుగుతుందని ఆ వయసులో పిల్లలకు పోషకాలు ఎక్కువ అందించాలని తల్లితండ్రులు ఎక్కువసమయం పిల్లలతో ఆటపాఠాలతో ఎక్కువ సమయం గడపాలని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్యవతి, అంగన్వాడీ టీచర్స్ రమణమ్మ అన్నపూర్ణ కమల సూర్య కళ నాగమణి వైబోయిన లక్ష్మి పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మాక్‌డ్రిల్



ఎలమంచిలి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక సీఐ రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని పట్టణములోని పాత జాతీయ రహదారి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నిర్వహించారు. ఈ ఫైర్ మార్క్ డ్రిల్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి ప్రమాదాల బారి నుండి ఎలా కాపాడుకోవాలన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు పంచారు. అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్తీ మాత బచావో... నేలతల్లిని రక్షిద్దాం కార్యక్రమం



(రాంబిల్లి ఏప్రిల్ 15 ప్రభాతవార్త) : మండలం హరిపురం, దిమిలి గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో దర్తీ మాత బచావో నేలతల్లి రక్షించడం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిని పి. విజేత హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ధర్తి మాత బచావో నేలతల్లి రక్షిద్దాం అనే కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు, మనిషి అభివృద్ధి పేరిట ప్రకృతిని అధికంగా వినియోగించడం వలన భూమాతకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు, అలాగే ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది మే, జూన్, జూలై నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందువలన నేలని ఎప్పుడు మొక్కలతో కప్పి ఉంచడానికి రైతులు పీఎండీఎస్ కిట్లు ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఏపీ సీఎం ఎఫ్) వద్ద తీసుకొని సాగు చేయాలని ఆమె కోరారు, జనుము, జీలుగా పిల్లి పెసర, విత్తనాలు సబ్సిడీపై రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు, వీటి వలన భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూసారం మెరుగుపడుతుందని తెలిపారు, రసాయన ఎరువులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో పశువుల గెత్తం, వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని పెంచాలని ఆమె సూచించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ధూళి రంగనాయకులు, పంచాయితీ సెక్రటరీలు, సర్పంచ్ లు, విఏఏ లు, ఎంపీ ఈవో మరియు రైతులు పాల్గొన్నారు.




## అరకు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి..



డుంబ్రిగూడ: ఏప్రిల్ 15, పభాతవార్త): అరకు పంచాయతీ గ్రామంలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న ఆపంచాయతీ సెక్రటరీ చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు పాంగి. సురేష్ కుమార్, మండల కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ డిమాండ్. చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులకు పత్రిక ప్రక టన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డుంబ్రిగూడ మండలం అరకు గ్రామ పంచాయతీ అరకు సంత బయలు నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపుల దర్జాగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మాణం చేసుకుంటున్నారనీ వారు చెప్పారు. కాసులకు కక్కుర్తి పడి ఇష్టానుసారంగా పంచాయతీ అనుమతులు బినామీ పేర్లతో జారీ చేస్తున్నారని వారు మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలకి గ్రామ కంఠం, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవతుందనీ వారు ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమానికి, కబ్జాకు గురవుతున్న అరికట్టాల్సిన అధికారులు నిమ్మకునేట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. గిరిజన చట్టాలు, హక్కులు కాపాడావలసిన ప్రభుత్వ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వెనకాల అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. గిరిజనులకు రక్షణ కవచంగా నున్న 1/70,చట్టం, పీసా చట్టాన్ని ప్రతిష్టంగా కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఇక్కడి మండలంలో పరుగు పంచాయతీ గ్రామంలో జరుగుతున్న భూ ఆక్రమణలపై కలెక్టర్, ఐటిడిఏ ప్రోజెక్ట్ అధికారులు స్పందించి బినామీ భూ అక్రమదారులకు సహకరిస్తున్న పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రకటనలు పేర్కొన్నారు.

## అధ్వానంగా బిట్రగండ రహదారి.. పట్టించుకోని అధికారులు



డుంబ్రిగూడ: ఏప్రిల్ 15: (ప్రభాతవార్త): మండలంలోని మారుమూల గ్రామపంచాయతీ కొల్లాపూటు పరిధి గల గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గిరిజనులు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించిన ఎటు వంటి స్పందన కనిపించడం లేదని స్థానిక పూర్వ సర్పంచ్ పి. రామ్మూర్తి పూర్వ ఎంపీటీసీ ధర్మనాయుడు, పెసా కమిటీ అధ్యక్షుడు వి. కొండలరావు, వైసీపీ నాయకుడు ఎమ్. రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒరిస్సా జాతీయ రహదారి నుండి బొడ్డమామిడి వరకు రోడ్డు అద్వాన స్థితిలో ఉందన్నారు. అదేవిధంగా వై.కొల్లాపూటు, బిట్రగుండ గ్రామాల రహదారులు కూడ అదే స్థితిలో దర్శనమిస్తున్నాయి అన్నారు. అప్పటి వైసిపి ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు రోడ్డు సౌకర్యం కల్పనకు కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ నేటికీ గ్రామీణ రహదారులు పూర్తి కాకపోవడం చాలా విచారకరమన్నారు. రోడ్డు అద్వాన పరిస్థితి ఆమెతో గిరిజనులు ఆయ ప్రయాసలతో కూడిన ప్రయాణాలతో ఆయా గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారనీ వారు చెప్పారు. అయితేకొన్నాళ్ళు ఇటీవల కాలంలో బిట్రగుండ కల్వర్టు తూతు మంత్రంగా నిర్మాణం చేపట్టి విడిచి పెట్టారు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిసరాల గ్రామాల గిరిజనులకు అత్యవసరాల సేవలు పొందాలన్న సకాలంలో పొందలేక దీనస్థితిలో కొట్టుమిట్టు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాంతీయులు వాహనదారులు ఎన్నో ఆనందపడ్డారు. కానీ వారికి నిస్సాయేదు మిగులుతుందని వారు పేర్కొన్నారు. ఏమైందో ఏమో తెలియదు రహదారులు నిర్మాణం చేపట్టే గుత్తేదారులు అర్ధాంతంగా మధ్యలో నిర్మాణ పనులు విడిచిపెట్టారనీ, అధికారులు పట్టించుకోవడం లేదని, రహదారి సక్రమంగా లేకపోవడంతో,ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలనీ ఆయా ప్రాంత గిరిజనులకు రవాణా కష్టాలు తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

గూడెంకొత్త వీధి ,ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఫలితాలు బుధవారం విడుదల కావడంతో విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని విద్యా సంస్థలు మంచి ఉత్తీర్ణత శాతం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందాయి.మండలంలోని ఏ.పీ.ఆర్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్) విద్యార్థినులు ప్రథమ సంవత్సరంలో 96 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో శత శాతం (100 ) ఫలితాలు నమోదు చేయడం విశేషం.అలాగే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు కూడా అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో 94 శాతం, ద్వితీయ సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. అయితే ఫెయిల్ అయిన కొద్దిమంది విద్యార్థులు కేవలం ఇంగ్లీష్ సబ్జెక్టులోనే తప్పడం గమనార్హం. మొత్తంగా మండలంలోని విద్యాసంస్థల ఫలితాలు సంతృప్తికరంగా ఉండటంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పెదలబుడు పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించండి



అరకులోయ, ఏప్రిల్ 15, ప్రభాత వార్త : పెదలబుడు మేజర్ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికుల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పంచాయతీకి సాధారణ నిధులు పన్నుల ద్వారా లక్షల రూపా యలు వస్తున్నా కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ఎందుకు విఫలం అవుతున్నారని అధికారులను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. అంతేకాకుండా ధరలు పెరుగు దలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లే నెలకి 21 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కాగా కనీసం కార్మికులకు చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు, కొబ్బరి నూనె వంటి ఇతర భద్రత పరికరాలు గత రెండు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని అధికారులకు కార్మికులు తెలియజేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేకుంటే సమ్మెలోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని కార్మికులు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

## పాడేరు మోదకొండమ్మ జాతర తేదీల మార్పులో రాజకీయ కుట్ర




పాడేరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల ఆరాధ్య దైవం శ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు మే 10,11,12 తేదీలు ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వివిధ రాజకీయ పార్టీలు అందరు కలిసి నిర్ణయించడం జరిగిందనీ పాడేరు ఎమ్మెల్యే,, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పేర్కొన్నారు. అయితే బుదవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంతి, మంత్రి గుమ్మడి సంధ్యారాణి తేదీలు మార్పుపై ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు తీవ్రంగా ఖండించారు, గ్రామ దేవత పండుగ ఉత్స వాలు తేదీలు నిర్ణయించడానికి మీరు ఎవరని మంత్రిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు,అమ్మవారు ఉత్సవాలు సుమారు 40 ఏళ్లగా స్థానికంగా ఉన్న పెద్దలు అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయించుకుని సంప్రదాయ పద్ధతిలో జరుగుతుందని, కానీ ఈ ఏడాది మాత్రం మే 10,11,12 మూడు రోజులు తేదీలు నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం ఆలయ ఉత్సవ కమిటీ నిర్ణయం కాదని ఎన్నడు లేని విధంగా కొత్తగా, మంత్రి , ప్రభుత్వ అధికారులు తేదీలు మార్పు చేయడంపై ప్రజలంతా ఆశ్చర్యానికి గురవుతు న్నారని ఎమ్మెల్యే అన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి జరుగుతుంది. ఈ జాతర తిలకించడానికి పక్క రాష్ట్రాలు ఒడిశా , తమిళనాడు నుండి కూడా భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకొని ఆశీర్వాదం పొందుతారనీ ఎమ్మెల్యే అన్నారు. లక్షలాదిమంది ప్రజల నమ్మకం శ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి దర్శనం తీసుకుంటే కోరిన కోరికలు తీరుతుంది అనేది ప్రజల నమ్మకం ఎన్నో దశాబ్దాల నుంచి ఆచారంగా సాంప్రదాయబద్ధంగా జాతర నిర్వహిస్తూ వస్తుంటారన్నారు. అమ్మవారి పండగ రాట ప్రతిష్టించిన తర్వాత పండగను ఆపడం ఇప్పటివరకు జరగలేదు, ఈ కూటమి ప్రభుత్వం వింత సాంప్రదాయాన్ని తీసుకొచ్చి భక్తుల మనోభావాలను అవమానపరుస్తూ పండగను నిలిపివేయడం జరిగిందన్నారు, కోరిన కోరికలు తీర్చే మోదకొండమ్మ తల్లికి భక్తులకు కోరికలు తీర్చడమే కాదు అమ్మవారితో రాజకీయాలు చేసినా వారికి శిక్షా అనుభవిస్తారని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఆవేదన వ్యక్తం చేసారు. సమావేశంలో ఆలయ కమిటీ,ఉత్సవ కమిటీ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు

## పేదల ఆకలి తీర్చేందకు అన్నక్యాంటీన్లు : మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పాడేరు,ఏప్రిల్15, ప్రభాతవార్త: గిరిజన ప్రాంత ప్రజల, పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ సేవలు పాడేరు గిరి శిఖర ప్రాంతంలో అందుబాటులోకి వచ్చాయని, పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పాడేరు పాత బస్టాండ్ రైతు బజార్ ప్రాంగణంలో రూ. 61 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అన్న క్యాంటీన్ భవనాన్ని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు మరియు అల్లూరి జిల్లా ఇంచార్జ్ మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, జీసీసీ చైర్మన్‌తో కలిసి మంత్రి సంధ్యారాణి బుధవారం ఉదయం అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఈ క్యాంటీన్ ద్వారా పేద ప్రజలకు అత్యల్ప ధరకే భోజనం, కేవలం రూ.5/ లకే నాణ్యమైన, రుచికరమైన మరియు పరిశుభ్రమైన భోజనాన్ని ప్రభుత్వం ఈ క్యాంటీన్ ద్వారా అందిస్తోందని,అన్నపూర్ణ సేవలు కూలీలు, నిరుపేదలు, మరియు దూర ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులకు ఈ పథకం ఒక వరమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యంగా పేదవాడి ఆకలిని గుర్తించి, పౌష్టికాహారాన్ని తక్కువ ధరకే అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రముక్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నిరుపేద గిరిజనులకు,కూలీలకు,వలస దారులకు కడుపు నిండా అన్నం పెట్టాలనే ఆశయంతో రాష్ట్ర వ్యాప్తంగా గతంలో వంద అన్న క్యాంటీన్లుప్రారంభించగా ఈరోజు 40 అన్నక్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందన్నారు.గతంలో స్వర్గీయ ఎన్టీఆర్ రెండు పూటల పేదవారు భోజనం చేయాలనే లక్ష్యంతో కిలో రెండు రూపాయలకు బియ్యం ఇస్తే సి ఎం చంద్రబాబు పేదవారికి సంపూర్ణంగా ఆకలి తీర్చాలనే లక్ష్యంతో ఐదు రూపాయలకే నాణ్యమైన భోజన అన్నం,కూర,సాంబారు,పెరుగుతో అందజేయడం జరుగుతుందన్నారు.గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా అన్న క్యాంటీన్ ఉంటుందన్నారు.ఐటిడిఎ పాలక వర్గం సమావేశం ఏర్పాటుపై మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలపై ప్రతి నెలా అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామన్నాడు కూటమి ప్రభుత్వం సంక్షేమం..అభివృద్ధి దిశగా పనిచేస్తుందన్నారు.గత ప్రభుత్వంలో 16 సంక్షేమ పథకాలు రద్దు చేస్తే వాటిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. 20 కోట్లతో ట్రైకార్ ఇస్తున్నామన్నారం అన్ని హాస్టల్స్‌లో వాటర్ ప్లాంట్స్,టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించామన్నారు.ఐటిడిఎ ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.గ్యాస్ కొరత కొంత ఉందని భయంకరమైన కొరత లేదని అయితే ప్రత్యామ్నాయంగా కరెంట్ సౌవ్‌లు తదితర వాటిని ఉపయోగించాలన్నారు. సంక్షోభం వస్తె ప్రజలు సంఘటితంగా ఎదుర్కోవలసి ఉందన్నారు. గతంలో మాదిరిగానే మళ్ళీ పేద ప్రజల ముంగిటకు అన్నపూర్ణ సేవలను తీసుకువచ్చాం. ముఖ్యంగా పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఈ రూ.5 భోజనం ఎంతో ఊరటనిస్తుందని, పారదర్శకతతో, నాణ్యతతో ఈ సేవలు నిరంతరం కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ అనుమతులతో విశాఖపట్నం హరే కృష్ణ ఫౌండేషన్ వారు వి ఎస్ కె శర్మ జోనల్ కో ఆర్డినేటర్ పర్య వేక్షణలో ప్రజలకు అందుబాటులో ఈ భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతిరోజు 350 మంది పేదవారికి ఈ కార్యక్రమం ద్వారా భోజనం అందుతుందని మంత్రి తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి , జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా పేదవారికి భోజనం వడ్డించి అందజేశారు. కలెక్టర్ నిషాంతి. టి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, ఇంచార్జి ఆర్డరీ లోకేశ్వరరావు,జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ట్రైకార్ డైరెక్టర్ కె కృష్ణారావు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక శాఖ అధికారులు మరియు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్లాప్ మిత్రులకు వెంటనే జీతాలు చెల్లించాలి



గూడెం కొత్త వీధి,ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): గ్రామాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న క్లాప్ మిత్రులకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని వైసీపీ నాయకుడు అరికట్ల ఆంజనేయులు(అంజి) డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్లాప్ మిత్రాలపై అధికారులు చిన్నచూపు చూడడం బాధాకరమని, వారికి ఇవ్వాల్సిన వేతనాలను నిలిపివేసి ఇతర అవసరాలకు నిధులు మళ్లించడం సమంజసం కాదన్నారు. పంచాయతీలలో పరిశుభ్రత పనులతో పాటు కొంతమంది కార్యదర్శులు క్లాప్ మిత్రులతో సిమెంట్ పనులు కూడా చేయిస్తున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సరైన విధానం కాదని, క్లాప్ మిత్రులను కేవలం గ్రామాల పరిశుభ్రత పనులకే పరిమితం చేయాలని సూచించారు.జీతాలు చెల్లించకపోవడంతో క్లాప్ మిత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి, సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అరికట్ల ఆంజనేయులు కోరారు.

## మంత్రి దృష్టికి ప్రభుత్వ ఉద్యోగుల సమస్య



పాడేరు,ఏప్రిల్15, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో పర్యటించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షులు లకె రవీంద్రబాబు పాత్రుడు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుల్లేలి సింహాద్రి మర్యాద పూర్వకంగా కలిసి గిరిజన ప్రాంతంలో నెలకొన్న అల్లూరి జిల్లా జోనల్ ప్రాంత సమస్యపై వినతి పత్రం అందజేశారు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మరియు విద్యార్థులకు ఎదురాయే సమస్యలను వివరించారు. జోన్ 2లో చేర్చడం వల్ల ఏర్పడే పరిస్థితులను తెలుపుతూ పూర్వ విశాఖపట్నం జోన్ 1 లో కొనసాగించాలని మంత్రి నీ కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమస్యను తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కొరకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.సి.సి డి.యం డి సింహాచలం, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యం ఈశ్వరరావు ప్రధాన కార్యదర్శి శేషాద్రి,ఏపీ ఎన్జీజీవో ఉపాధ్యక్షులు మఠం సూర్యనారాయణ నాయుడు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌ను కలిసిన మాజీ సర్పంచులు



పాడేరు,ఏప్రిల్15, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో నూతన కలెక్టర్ నిశాంతిని మాజీ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాం ఇచ్చి దుస్సాలవతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు,మాజీ సర్పంచులు బాకూరు వెంకటరమణ రాజు,పాంగి పాబదురంగ స్వామి,తామర్ల సత్యనారాయణ, కూడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసి వినతిపత్రం అందజేత



పాడేరు,ఏప్రిల్15, ప్రభాతవార్త: పాడేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు ప్రధాన కార్యదర్శి శేషాద్రి కలిసి గిరిజన ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మంత్రిగారికి వినతి పత్రం అందజేశారు. జోనల్ వ్యవస్థ సమస్య: ప్రస్తుతం నెలకొన్న జోనల్ వ్యవస్థ సమస్యను పరిష్కరించి, గిరిజన ప్రాంత నిరుద్యోగులకు, ఉద్యోగులకు న్యాయం చేయాలనీ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం:గతంలో ఉన్న నియామక నిబంధనల స్థానంలో గిరిజన నిరుద్యోగులకు మేలు చేసేలా నూతనంగా "షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం" తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మసాడా ఈశ్వరరావు మాట్లాడుతూ.ఈ సమస్యలను తక్షణమే గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ చూపాలని మంత్రిగారిని కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారనీ ఈశ్వరరావు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): అల్లూరిజిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారి వరుస ప్రమాదాలతో ప్రయాణికులను వణికిస్తోంది. ముఖ్యంగా పెదవలస చింతపల్లి మధ్య జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో అధికశాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నా రోడ్డు ప్రమాదాలు ఆగడం లేదు. తాజాగా జికే వీధి మండలం నిమ్మలపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నేరల బంధ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చింతపల్లి వైపు నిమ్మలపాలెం వద్ద ఆగి ఉన్న ఇద్దరు గిరిజనులను ఢీకొట్టింది. ఈ ఘటనలో పెదవలస గ్రామానికి చెందిన దేశగిరి కిషోర్ కుమార్, వనభలింగం గ్రామానికి చెందిన చిలకల అబ్రహం అక్కడికక్కడే చనిపోయారు. ఈ ప్రమా దానికి కారణమైన నేరేల్లబంద యువకులు తీవ్ర గాయా లపాలయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీకే వీధి ఎస్ఐ సురేష్ తెలిపారు. విచారణ చేపట్టి బాదులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మృతదేహాలను చింతపల్లి ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

## ఇంటర్ ఫలితాల్లో రిషత ఉత్తమ ప్రతిభ



అరకులోయ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : రాష్ట్ర విద్యాశాఖ బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగూడ మండలం కితలంగి పంచాయతీ, పాడి గ్రామానికి చెందిన బలోర్ద రిషిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. బైపిసి గ్రూప్ చదివిన రిషిత ఇంటర్ ఫలితాలలో 1000 మార్కులకు గాను 962 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్స రములో కూడా అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువ చ్చింది. ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనపరిచిన రిషిత మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం తాను విద్యనభ్యసించిన కృష్ణాజిల్లా విస్సన్నపేట ప్రతిభ కళాశాల అధ్యాపక బృందం బోధనతో మంచి మార్కులు సాధించగలిగానని తెలిపారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించడంతో తనను మంచి కళాశాలలో జాయినింగ్ చేసి మంచి స్థాయికి తీసుకువెళ్లాలన్నా తన తల్లిదండ్రుల కోరిక నెరవేర్చేందుకు పట్టుదలతో చదివి మంచి మార్కులు పొందగలిగినన్నారు. ఈ మార్కులు తనకు ఎంతో సంతృప్తినిచ్చాయని ఇంకా మెరుగైన మార్కులు పొందాలని సంకల్పం ఉన్నప్పటికీ విద్యా సంవత్సరం ప్రారంభంలో అనారోగ్యం బారిన పడడం వలన మార్కులు పూర్తిస్థాయిలో సాధించలేకపోయాను అన్నారు. అయినప్పటికీ 962 మార్కులు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైద్య విద్య లక్ష్యంగా ముందుకు వెళతానని పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి వైద్య కళాశాలలో సీటు పొందగలనన్న నమ్మకాన్ని రిషిత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తాను వైద్య విద్యను అభ్యసిస్తానని పట్టుదలతో ఉండడంతో వైద్య విద్య అభ్యసించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని స్పష్టపరిచారు. కాగా రిషిత అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో బంధువులు స్నేహితులు అభినందనలు తెలియజేస్తున్నారు.

## మే 17,18,19 తేదీల్లో మోదకొండమ్మ జాతర : మంత్రి



పాడేరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఉత్తరాంధ్ర జిల్లా ఆరాధ్యదేవత, మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగ అంటే భక్తులకు ఒక ప్రతీక అని, జాతరలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు కలగకుండా, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారులకు ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంతి అధ్యక్షతన జిల్లా అధికారులతో, ఆలయ కమిటీ సభ్యులతో నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు కోఆపరేషన్ కమిటీ సమావేశాన్ని మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కీలక సూచనలు, సలహాలు చేశారు. మన జిల్లాలో రాష్ట్ర పండుగ కాబట్టి నలుమూలల నుండి విచ్చేసే భక్తులకు నిర్వహణ ఏర్పాట్లపై ప్రభుత్వము, ఆలయ కమిటీ సభ్యులు ,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు యంత్రాంగం మరియు ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో పరస్పర సహకారంతో పనిచేసి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకుగాను, అందరూ కృషి చేయాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు తాగునీరు, చలువ పందిళ్లు, క్యూ లైన్లు మరియు మరుగుదొడ్లు, పారిశుధ్యం విషయంలో ఎక్కడా లోటు రానీయక్కూడదుడాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. రవాణా మరియు భద్రత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఘాట్ రోడ్డులో ప్రయాణించే భక్తుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక్క భక్తునికి కూడా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ఆ విధంగా తగినంత సిబ్బందితో బందోబస్తుకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. భక్తుల దర్శనార్థం రవాణా పరంగా వచ్చి వెళ్లే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరానికి అనుగుణంగా వేరే డిపోల నుండి బస్సులను ఏర్పాటు చేసుకోవాలని, ఏపీఎస్ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులు మూడు రోజులు పాటు ఉండి అమ్మవారి దర్శనాన్ని, అమ్మవారి ఆశీర్వాదాన్ని స్వీకరించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్పించకుండా చూడాలన్నారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. అమ్మవారి ఊరేగింపు లో భక్తులు కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. "అమ్మవారి జాతర కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, ఇది మన గిరిజన సంస్కృతికి ప్రతీక. జిల్లా యంత్రాంగం అంతా ఒక టీమ్‌గా పనిచేసి, వచ్చే భక్తులకు చిరస్మరణీయమైన అనుభూతిని అందించాలన్నారు. జిల్లాను ప్రతిమభించేలాగా జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు శాఖల వారీగాఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నిషాంతి. టి మాట్లాడుతూ శాఖలవారీగా వారి వారి నిర్వహణ పనులకు కావలసిన ప్రణాళికలను తయారు చేసుకొని అందుకు కావలసిన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పారిశుద్ధం,తాగునీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలకు ఆటంకం లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేసుకుంటూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పారిశుధ్యము, మంచినీరు ప్రతి కూడలిలో ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు భక్తులకు ఇబ్బంది లేకుండ షిఫ్టులవారీగా 247 గా డ్యూటీలు వేసుకొని, విధులను నిర్వహించే విధంగా చూసుకోవాలన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి, ఆలయ కమిటీ సభ్యులు,అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్య ఆచార్యులు వారు సమక్షంలో జిల్లా కలెక్టర్ అమ్మవారి జాతర తేదీలను మే 17,18,19 తేదీల్లో జాతర నిర్వహణ ఏర్పాట్లకు సన్నవీద కావాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అమిత్ బర్దార్ మాట్లాడుతూ ఈ జాతరలో పోలీస్ బందోబస్తుకు స్పెషల్ ఫోర్స్ పోలీస్లు 750 మంది అవసరం ఉంటుందని, జిల్లాలో ఉన్న స్పెషల్ ఫోర్స్ పోలీసులు ప్రస్తుతం వేరే రాష్ట్రాల్లో ఎలక్షన్స్ ఉన్నందున వారందరినీ అక్కడ డిప్యూటీ చేసి ఉన్నందున స్పెషల్ ఫోర్స్ సిబ్బంది వచ్చేంతవరకు గడువు కల్పించాలని, అప్పుడు మాత్రమే ఈ జాతరకు కావలసిన పూర్తి బందోబస్తును చేయగలుగుతామని ఇన్చార్జి మంత్రి కి కమిటీ సభ్యులకు తెలియజేశారు. మూడు రోజులు జరిగే జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలసి ఉంటుందని తెలియజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాడేరు మోదకొండమ్మ తల్లి జాతర అంటే సమ్మక్క సారక్క జాతరాకు ఎంత వైభవం ఉందో, ఇక్కడ మోదకొండమ్మ జాతరకు అంత వైభవం ఉందని, భక్తుల మనోభావాలకు అసౌకర్యం కలగకుండా అమ్మవారి జాతర నిర్వహించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ గత సంవత్సరంలో జరిగిన ఉత్సవ ఏర్పాట్లపై కమిటీ సభ్యులకు అధికారులకు ముందుగా వివరించారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు,పాడేరు శాసనసభ్యులు మత్సరాస విశ్వేశ్వరరాజు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేగిడ్డి ఈశ్వరి, జిసిసి డైరెక్టర్ బొర్రానాగరాజు,ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి. నీలకంఠరావు,ఇంచార్జి ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు, పోలీస్, జిల్లా అధికారులు మరియు ఆలయ కమిటీ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై 25న చలో విజయవాడ



గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 15(ప్రభాతవార్త): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో, 25న విజయవాడలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించ నున్నట్లు జిల్లా అధ్యక్షుడు యు.వి.గిరి తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు,సీపీఎస్ రద్దు,పీఆర్సీ అమలు, గిరిజన సంక్షేమ,కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ నేపథ్యంలో గూడెం కొత్తవీధిలో ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దొండ కాలేశ్వరరావు,కె.వసంత్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 15 (ప్రభాత వార్త): అందరూ చదవాలి అందరూ ఎదగాల న్న రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేత్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారు గూడెం కొత్తవీధి ఉప తాహసిల్దార్ దుమంతి సత్యనారాయణ. నిరుపేద గిరిజన నిరుద్యోగులకు వేలాది రూపాయలు విలువ చేసే గ్రూప్స్‌కి అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేసి తన ఉదారతను చాటుకుంటున్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు గ్రామానికి చెందిన దుమ్మంతి సత్యనారాయణ పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ప్రభుత్వ కొలు సాధించారు. అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం జికే వీధి మండల రెవెన్యూ ఉప తాసిల్దార్ గా పనిచేస్తున్నారు. ఆయన విధి నిర్వహణ చేపడుతూనే సెలవు రోజున సేవా కార్యక్రమాలను చేపడుతుంటారు. ఇలా ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. పేద గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తూనే ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన ముగ్గురు పిల్లలను చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతేకాకుండా తాజాగా అంబేద్కర్ జయంతి రోజున మంగళవారం జీకేవీధి మండలం దుచ్చరపాలెం గ్రామానికి చెందిన పలాస బాలకృష్ణ, పెదపాడు గ్రామానికి చెందిన సిందేరి సురేష్, తోకరాయి గ్రామానికి చెందిన రెడ్డి సంజీవరావు అనే ముగ్గురు పేద గిరిజన విద్యార్థులకు గ్రూప్ 1, గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ ను అందజేశారు. వేల రూపాయల విలువైన ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేసేలా ఉప తాసిల్దార్ చర్యలు తీసుకున్నారు. నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పరితపిస్తున్న ఉప తాసిల్దార్ సత్యనారాయణను పలువురు అభినందిసస్తున్నారు.

# పైడా కౌశిక్ నాటకోత్సవం



విశాఖపట్నం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పైడా కౌశిక్ నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం కళాభారతిలో ధనం నిర్వహించారు. సహన, బ్రహ్మ స్వరూపం నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి శ్రీరామదాసు డాక్టర్ రాంబాబు మహారాజ పోషకులు పైడా కృష్ణ ప్రసాద్ నేటిముఖ్య అతిథి శ్రీ దాడి రత్నాకర్,గౌరవ అతిథి కొమ్మారెడ్డి రాంబాబు చైర్మన్ కనకమహాలక్ష్మీ లిమిటెడ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రకాశనం చేసి సుహారంభం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ కళాభారతి వ్యవస్థాపకులు శంకర శాస్త్రి అలాగే సిఎస్ఎన్ రాజు, డివి సుబ్బారావు తదితరు పెద్దలు ఎంతో ముందు చూపుతో కళా భారతి నిర్మాణం చేశారని, ఈ కళాభారతి వైజాగ్ లో ఉండడంవల్ల అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరగడం వల్ల విశాఖకు తలమానికంగా కళాభారతి నిలిచిందని ఇప్పటి కార్యవర్గ సభ్యులు సమర్ధవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ కళారంగానికి చేస్తున్న సేవ అద్వితీయమని కొనియాడారు.గౌరవ అతిథి రాంబాబు, చైర్మన్ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ మాట్లాడుతూ రాజు డాక్టర్.రాంబాబు కళాభారతికి చేస్తున్న సేవ ఎంత చెప్పినా తక్కువేని మన కలలని సంరక్షిస్తూ కాపాడుతున్న కార్యవర్గ సభ్యులు అందరికీ అభినందనలు తెలియజేశారు.రైటర్స్ అకాడమీ చైర్మన్ వి. వి. రమణమూర్తి మాట్లాడుతూ నాటకాలకు ప్రేక్షకులు తక్కువ వస్తారు అనే ఆపవాదుని ఈ నాటకోత్సవాలలో అధికంగా ప్రేక్షసకులు వచ్చి అ అపవాదు నిజం కాదని నిరూపించారు.ప్రస్తుత కాలంలో ఒక రూపాయి విరాళం ఇవ్వాలంటే లక్షసార్లు ఆలోచించే రోజుల్లో చిలస్ ప్రసాద్ 92 ఏళ్ల వయస్సులో నాటకోత్సవాల విజయానికి ఒక లక్ష రూపాయలు విరాళం అందజేసేరు.అధ్యక్ష, కార్యదర్సులు, కోశాధికారి నేటి అతిధులుప్రసాద్ ని ఘనంగా సత్కరించేరు. మొదటి నాటిక..అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'సహాన'రచన.. స్నిగ్ధ..దర్శకత్వం.. యన్.రవీంద్రరెడ్డి ఈ ప్రపంచం లో బ్రతకాలంటే యుద్ధం చేయ్యాలి. సమస్యలతో, సంఘటనలతో జతకట్టి, వాటిని ప్రతిఘటిస్తూ... ముందుకు సాగాలి. న్యాయం కోసం, నిజాయితీగా అన్యాయంపై తిరుగుబాటు చేస్తూ అలసటలేని పోరాటంలో తమకు ఎదురైన సమస్యకు ఆ తండ్రీకూతుళ్ళు నిరంతరం ప్రశ్నించబడుతూ, ఆ ప్రశ్నలకు ఒక్కొక్కటిగా సమాధానలు పేర్చుకుంటూ, సహనంతో అధిగమిస్తూ న్యాయంకోసం అడుగులు వేస్తూ విజయం సాధించిన సమాజానికి "కృషితోనాస్తీ దుర్భిక్షం".. గుండె నిబ్బరం ఉండాలని చక్కటి సందేశాన్ని అందించారు కళా కారులు ఈ "సహాన" నాటిక ద్వారా రెండవ నాటిక.. మైత్రీ కళానిలయం, విజయవాడ వారి "బ్రహ్మ స్వరూపం.. మంచితనం వికసిస్తున్నప్పుడు అందరూ మంచివాళ్ళే కనిపిస్తారు. చాలా గొప్పగా వుంటుంది. ఈ ప్రపంచంలో మనకు ఆత్మీయతలు, అభిమానాలు, మమకార మాధుర్యాలు పరిభ్రమిస్తూ వుంటాయి. స్వచ్ఛమైన ఫీలింగ్స్ చూడగలిగితే మనకు నచ్చిన జీవితం మన కళ్ళ ముందు సాక్షాత్కారిస్తుంది. అలాంటి ప్రభావం-లో గుండెను తడిచేసే సంఘటనలు జ్ఞాపకాలుగా మిగిలిపోయే సందర్భాలు మనల్ని స్పర్శిస్తూ వుంటాయి. కానీ ఒక్కొక్కసారి అలాంటి ఆహ్లాదకరమైన జీవితాల్లోకి ఊహించని కష్టం వచ్చి ప్రతి నాయకత్వం వహిస్తుంది. ఈ కథ చివరి యుద్ధంలా సాగిన జడ్జిమెంటులో తలరాత వ్రాసిన బ్రహ్మత్వం ముఖ్యపాత్ర వహిస్తుంది. కఠినమైన సందర్భాలలో విధి విరోధిగా మారిన వేళల్లో మనం నిస్సహాయులుగా మిగిలిపోతున్నప్పుడు సాక్షాత్తు బ్రహ్మస్వరూపమే ఆవహించి ధర్మాన్ని చెబుతుంది. ఈ నాటిక ముగింపు కూడా అలాగె ఉంది.. రెండు సమాజాల వారికి అతిథులు చేతుల మీదుగా ప్రదర్శన పారితోషకం ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యదర్శి రామదాస డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ రేపటి కార్యక్రమంలో ఆఖరి రోజు ఒకనాటికే ఉంటుందని యధావిధిగా ప్రారంభమై ఏడు గంటల 30 నిమిషాలకు బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని అందరూ విచ్చేసి సిఎంఆర్ షాపింగ్ మాల్ వారు స్పాన్సర్ చేసిన బహుమతులను లాటరీలో గెలిచిన వారు తీసుకొని, అంతేకాకుండా ఐదు రోజులు కలిపి బంపర్ లాటరీ కూడా ఉంటుందని ఆ బహుమతులుకూడా తీసుకొని ప్రసాదాలు తీసుకొని సంతృప్తిగా వెళ్లవలసిందిగా కోరారు.

# అన్నా క్యాంటీన్ పరిశీలించిన స్టేట్ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్



మాధవధార, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

అన్నా క్యాంటీన్ ను నాణ్యతను ఏపీ స్టేట్ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సనపల వరప్రసాద్ తో కలిసి బుధవారం పరిశీలించారు. అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. అలాగే బూత్ ప్రెసిడెంట్ నంబల నాగరాజు, బూత్ కన్వీనర్ గడ్డవలస లోకేశ్వరరావు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము , తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో విశాఖ జిల్లా విద్యార్థుఫల ప్రతిభ

## -అత్యధికంగా 87 శాతం ఉత్తీర్ణత

విశాఖపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

విశాఖ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఫలితాల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు గౌరవం తీసుకువచ్చారు. విశాఖ జిల్లా 87శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచిన జిల్లాల సరసన (కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, తూర్పు గోదావరిలతో పాటు) నిలిచింది. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 77 శాతం, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది, ఇందులో బాలికలు మెరుగైన ప్రతిభను సాధించారు. ముఖ్యంగా పలువురు విద్యార్థులు ఉన్నత శాతం మార్కులు సాధించి ప్రతిభను చాటుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు కాలేజీల్లో విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థుల కృషి ఈ విజయానికి కారణమని విద్యా వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజయవంతమైన విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ధర్తీ మాత బచావో -- నేల తల్లి రక్షిద్దాం

(రాంబిల్లి ఏప్రిల్ 15 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం హరిపురం, దిమిలి గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో దర్తీ మాత బచావో నేలతల్లి రక్షించడం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిని పి. విజేత హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ధర్తి మాత బచావో నేలతల్లి రక్షిద్దాం అనే కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు, మనిషి అభివృద్ధి పేరిట ప్రకృతిని అధికంగా వినియోగించడం వలన భూమాతకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు, అలాగే ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది మే, జూన్, జూలై నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందువలన నేలని ఎప్పుడు మొక్కలతో కప్పి ఉంచడానికి రైతులు పీఎండీఎస్ కిట్లు ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఏపీ సీఎం ఎఫ్) వద్ద తీసుకొని సాగు చేయాలని ఆమె కోరారు, జనుము, జీలుగా పిల్లి పెసర, విత్తనాలు సబ్సిడీపై రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు, వీటి వలన భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూసారం మెరుగుపడుతుందని తెలిపారు, రసాయన ఎరువులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో పశువుల గెత్తం, వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని పెంచాలని ఆమె సూచించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ధూళి రంగనాయకులు, పంచాయితీ సెక్రటరీలు, సర్పంచ్ లు, విఏఏ లు, ఎంపీ ఈవో మరియు రైతులు పాల్గొన్నారు.



# కోస్టల్ భద్రత కట్టుదిట్టం

## కుడిమడకలో మెరైన్ పోలీసుల కవచ్ తనిఖీలు

( అచ్చుతాపురం ఏప్రిల్ 15 ప్రభాతవార్త )

తీర ప్రాంత భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా అచ్చుతాపురం మండలం కుడిమడకలో మెరైన్ పోలీసులు 'కోస్టల్ కవచ్--సాగర్ కోచ్' పేరుతో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టి పత్రాలు, గుర్తింపు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు అప్రమత్తతపై అవగాహన కల్పించారు. "తీర ప్రాంతం దేశ భద్రతకు కీలకం. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి" అని సూచించారు. మత్స్యకారులు, స్థానికులు తమ వద్ద అవసరమైన గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. అంతేకాకుండా, అక్రమ రవాణా, అనధికారిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సముద్ర తీర ప్రాంతాల్లో భద్రతా నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెరైన్ పోలీస్ ఎస్ ఐ పైడి రాజు సిబ్బంది, పాల్గొన్నారు.

# జి.కోడూరులో కాఫీ హోటల్ దగ్ధం-4లక్షల ఆస్తి నష్టం

మాకవరపాలెం ఏప్రిల్ 15 ప్రభాతవార్త



మాకవరపాలెం మండలం జి.కోడూరులో జరిగిన అగ్నిప్రమాదంలో కాఫీ హోటల్ పూర్తిగా ఖాళీ బూడిద ఐంది. ఈమేరకు బుధవారం స్థానికులు అందించిన వివరాల ప్రకారం మామిడి నాగరత్నం చెందిన కాఫీలో గ్యాస్ బండ లీకై అగ్ని ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. అగ్నికి హోటల్ పూర్తిగా దగ్ధమయి, నాగరత్నం కి చెందిన డ్వాక్రాలో రుణంగా తీసుకున్న 2లక్షల నగదు కాలి బూడిద అయిందని నాగలక్ష్మి కన్నీరు మున్నీరవుతుంది. హోటల్ పాకతోపాటు నగదు, 20తులాల వెండి పట్టీలు కాలి బూడిద అయినట్లు ఆమె వాపోతుంది. అగ్ని ప్రమాదానికి సుమారు నాలుగు లక్షల నష్టం జరిగిందని మామిడి నాగలక్ష్మి పూర్తి స్థాయిలో నిరాశ్రయురాలు అయిందని గ్రామ పెద్దలు మళ్ల జైబాబు తదితరులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే హోటల్ పాక పూర్తిస్థాయిలో దగ్ధమైందని స్థానిక చెప్తున్నారు. నూకరత్నం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన ఆదర్శ కళాశాల.!



( ఎస్. రాయవరం, ప్రభాతవార్త)

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రథమ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మండలం లోని ఆదర్శ కళాశాల సత్తా చాటింది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా మంచి ఫలితాలు సాధించి జిల్లాలో ప్రతిభ చాటారు. ఎం. రమణమ్మ ఇంటర్ ఎంపీసీలో 986/1000 మార్కులు సాధించగా ఎంపీసీలో దాట్ల ఉదయ్ శ్రీ 985/1000 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 462 /470మార్కులు మౌనిక, పిల్లి మహి ఎంపీసీలో 460/470 మార్కులు సాధించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గ్రామీణ ప్రాంతంలకు చెందిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో కరస్పాండెంట్ నల్లపురాజు సీతారామరాజు అభినందించారు. 984, 983, 982, 981 మార్కులు సాధించినవారు. ఎక్కువమంది సాధించగా అదేవిధంగా మొదటి సంవత్సరం ఫలితాల్లో 462 మార్కులతో పాటు 457, 445 వరకు ఫలితాలు సాధించారు .ఇటువంటి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

# ప్రిన్సిపాల్ ఎఫెక్ట్... ఫలితాల పేలుడు!

బుచ్చయ్యపేట ఏప్రిల్ 15 ప్రభాతవార్త

వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల 2026 విద్యా సంవత్సరంలో విద్యార్థి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఇటీవల నూతన ప్రిన్సిపాల్గా బాధ్యతలు స్వీకరించిన గెద్దమూరి చిన్నారావు సమర్థవంతమైన ప్రణాళికలు, క్రమశిక్షణతో కూడిన బోధన విధానం ద్వారా కళాశాలలో విద్యా ప్రమాణాలను గణనీయంగా పెంచారు.ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, రోజువారీ పర్యవేక్షణ, అదనపు తరగతులు, సందేహ నివృత్తి శిబిరాలు నిర్వహించడం వల్ల ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని ఉపాధ్యాయ వర్గం తెలిపింది. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా వారిని ఉత్తమ ఫలితాల దిశగా నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థులను ప్రిన్సిపాల్ గెద్దమూరి చిన్నారావు అభినందిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే మరింత గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు.ఈ విజయంతో వడ్డాదుల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలోనే ఒక ఆదర్శ విద్యాసంస్థగా నిలుస్తోందని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

# నారీ శక్తి వందన్ అధినియం..

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్...





ఎలమంచిలి ఏప్రిల్ 15, ప్రభాతవార్త

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నారీ శక్తి వందన్ అధినియం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంటే మహిళ శక్తి గౌరవం మహిళల స్వరానికి బలం దేశ నిర్ణయాలలో మహిళలకు సముచిత స్థానం మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ మహిళా సాధికారతకు మరొక గొప్ప మా ఇల్లు రాయిగా తీసుకొచ్చిన ఈ చారిత్రాత్మక నిర్ణయం నారిశక్తి అధినియం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం అనేది గొప్ప విషయమని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం అనేది కేవలం ఒక శాతం మాత్రమే కాదు, మహిళల రాజకీయాలు, పాలన, అభివృద్ధి, నిర్ణయాధికారంలో ముందుకు రావడం గొప్ప అవకాశం, ఇది ప్రతి మహిళకు గౌరవం, సమాన హక్కులు నాయకత్వం అవకాశాలు కల్పించే చారిత్రాత్మక అడుగు. గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు మహిళల పాత్ర మరింత బలపడేలా ఈ చట్టం మార్గం సుఖం చేస్తుందని, చారిత్రాత్మక విజయం అని అన్నారు. నారి శక్తి వందన్ అధినియం కార్యక్రమానికి మద్దతు తెలిపేందుకు ప్రతి మహిళ 9667173333 నెంబర్కు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, జనసేన నాయకురాలు కర్రీ ఝాన్సీ, జనసేన నాయకులు వూటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు , మున్సిపాలిటీలో గల మహిళలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వెలుగు సిబ్బందికి మొబైల్ ఫోన్లు అందించిన మండల అధ్యక్షుడు లాలం భరత్

(రాంబిల్లి ఏప్రిల్ 15 ప్రభాతవార్త)



రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న ఎంఎంఎస్ కార్యాలయంలో వెలుగు వివోఏలకు సాంసంగ్ గాలక్సీ ఫోన్లు రాంబిల్లి మండల అధ్యక్షుడు లాలం భరత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు సౌకర్యాలు సదుపాయాలను కల్పించి పారదర్శకమైన సేవలను ప్రజలకు అందివ్వాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు, అలాగే మహిళలు ఆర్థికంగా ఎదగాలని కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు 400 ప్యాకెట్ల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు, మహిళలు అని రంగాల్లో ముందుండాలని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఏపిఎం డి. పద్మ,జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నా దొర, టిడిపి మండల ఉపాధ్యక్షుడు సూరాడ అప్పలరాజు, మహిళలు పాల్గొన్నారు.

# శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ప్రభంజనం



ఎస్ రాయవరం ఏప్రిల్ 15 ప్రభాతవార్త

మండలంలో అడ్డు రోడ్డు మార్చి 2026లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎంపిసి విభాగం లో ఎస్ రాయవరం మండలం పెట్టు గొల్లపల్లి గ్రామానికి చెందిన తామాడ ఝాన్సీ లక్ష్మి 989/1000, బైపిసి విభాగంలో ఎస్ రాయవరం మండలం రామయ్య పట్నం గ్రామానికి చెందిన చొప్ప దివ్య 985/1000, ఫస్ట్ ఇయర్ బైపిసి లో ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన నగిరెడ్డి తేజ శ్రీను 448/455 మార్కుల సాధించి నక్కపల్లి,ఎస్ రాయవరం,కోటవురట్ల,ఎలమంచిలి మండలాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. అత్యుత్తమ మార్కుల సాధించిన విద్యార్థులు సెకండ్ ఇయర్లో పి. మనేస్విని లక్ష్మీ ప్రసన్న . కే.అక్షయ,బైపిసి ఎస్.ఈశ్వర్ ప్రసాద్ఆర్. నూక రత్నం జి.సుస్మిత జి.పావని యు.పల్లవి, బి యశోద. ఎస్.కె నూర్ జాన్ మొదటి సంవత్సరంలో ఎన్. తేజ శ్రీను . కె.జ్వలిత శ్రీ టి.మేరి డి.నందిని .వై.ఎల్.ఎస్.సత్య దేవి ఎం విష్ణువర్ధని జి రేణుక జి మణికంఠ శేఖర్ ఎస్.కె తాజు నిషా బేగం . బి. శివమణి కే తేజస్విని డి .నాగ శిరీష ఎస్ .ఉమా ఆర్ .శిరీష అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఆర్ .రాము అధ్యాపకులు నూకరాజు,రమేష్,ప్రకాష్,రాజు,జోగినాదం తదితరులు అభినందించారు.

# గునుపూడిలో చిన్న పేర్రాజుకు ఘనసత్కారం.!

(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త)



రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భముగా గునుపూడి గ్రామంలో దట్టె లోవక్రిష్ణ ఆధ్వర్యంలో గ్రామానికిచెందిన జై భీమ్ మెగా యువకులు గ్రామ మాజీ సర్పంచ్ అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు . వాతాడఅప్పారావు గంటా చిన్నారావు, మసాజోగారావు, మసా నాగేశ్వరరావు, నాని, పల్ల సతీష్, గంటనానాజీ తదితరులు ఉన్నారు . గునుపూడి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది యువకులు అంబేద్కర్ టీ షర్టు ధరించి ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా దట్టె లోవ కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో గ్రామ పెద్దలతో పాటు అనేకమంది 135 వ జయంతి కార్యక్రమానికి ముందుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# 23న ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

## రెన్యూ సోలార్ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 15 ప్రభాత వార్త



ఈ నెల 23న జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో రాంబిల్లి సెజ్లో నిర్వహించనున్న రెన్యూ ఫోటో వోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ భూమి పూజ కార్యక్రమానికి సంబంధించి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకుగాను పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా తో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సుమారు 10 నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తూ, అందుకు తగిన విధంగా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభావేదిక స్టేజీ ఏర్పాట్లు, వి ఐ పి, వి వి ఐ పి గ్యాలరీ, డెకరేషన్ తదితర ఏర్పాట్లు నిర్దేశిత సమయం లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెం సమీపంలో 10 ఎకరాల్లో సభా ప్రాంగణ ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. 15 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్కింగ్ ప్రదేశంలో ఎల్.ఈ.డి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్యాలరీలో 500 మంది కూర్చునే విధంగా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్యాలరీకి ఒక ఎంఆర్వోను ఇన్చార్జ్గా నియమించి, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, ఇతర అవసరాలను సమర్థంగా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలను తరలించేందుకు సుమారు 200 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి బస్సులో ఉదయం 7 గంటల లోపు తాగునీరు, ఆహారం అందుబాటులో ఉండేలా బస్ ఇన్చార్జ్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ట్రాఫిక్ను సమర్థంగా నియంత్రించాలని సూచించారు. అదేవిధంగా, వీఐపీ భద్రతకు ప్రత్యేక బందోబస్తు, క్యూలైన్ నిర్వహణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులలో స్పందించేం దుకు క్విక్ రెస్పాన్స్ టీమ్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సభా ప్రాంగణంలో తగినన్ని తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. తగినన్ని మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖను ఆదేశించారు. సభ జరుగనున్న ప్రాంగణం, రహదారులు పూర్తిగా శుభ్రపరచి, శానిటేషన్ పనులు సమగ్రంగా నిర్వహించాలని , తగినన్ని టాయిలెట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా చేరుకునేందుకు మార్గదర్శక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, ఆర్డీవో అయేషా, సంబంధిత శాఖల అధికారులు, రెన్యూ సోలార్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ నూకంబిక అమ్మవారి సారే ఊరేగింపు



( ఎస్ రాయవరం ఏప్రిల్ 15 ప్రభాత వార్త )

మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నూకాంబిక అమ్మవారి గంధ మవాస్య జాతర పురస్కరించుకొని బుధవారం నూకాంబిక అమ్మవారి సారీ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలో అమ్మవారి భక్తులు ఇంటి వద్ద నుండి ఆలయం నకు సారి తెచ్చి పురవీధిలో ఊరేగించి ఆలయనకు చేరుకొని అమ్మవారికి అర్పించి. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదములు స్వీకరించారు. గ్రామస్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని, ద్వితీయ సంవత్సరం ఆర్ఎన్ఎస్ భవ్య 989/1000 బైపిసి విభాగంలో కె.ఆర్.ఎస్.నగేష్ 986/1000 ఎం.పి.సి. విభాగంలో ప్రథమ సంవత్సరం ఎం.పి.సి విభాగంలో 465/470 సిహెచ్.చంద్రిక, వి. వర్షిణి, ఎస్. నాగ జ్యోతిక బై.పి.సి. విభాగంలో 449/455 వై.ఎస్. కల్యాణి మార్కులు సాధించి అగ్రగాములుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ వి.వి.ఎస్.ఎస్ భానుమూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# అధిక లోడుతో పయనిస్తున్న మూడు లారీ సీజ్.!



నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

అధికలోడుతో అక్రమ రహదారిలో మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా ను తప్పించుకుని మండలంలోని ఉపమాక రహదారి మీదుగా నడుస్తున్న మూడు లారీలను సీఐ జూరెడ్డి మురళి బుధవారం పట్టుకున్నారు. పట్టుకున్న మూడు లారీలు ఆర్టీవో కోర్టులో హాజరుపరచగా మూడు లారీలపై కేసు నమోదు చేసి లక్ష 96,000 అపరాధ రుసుము విధించారు. టోల్ ప్లాజా ను తప్పించుకునేటట్లు వాహనదారులు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. పక్కరహదారుల్లో వస్తున్న వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగింది సీఐ మురళి తెలిపారు.

# 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం

(నక్కపల్లి, ప్రభాతవార్త )

చిన్నచిన్న మరమ్మతులు కారణంగా నక్కపల్లి లెవెన్ కె.వి పరిధి లో ఉన్నకొన్ని గ్రామాలకు ఈ నెల 17న శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనున్నదని ఈ ఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సౌకర్యం ఉండదని తెలిపారు. సిహెచ్ఎల్ పురం తో పాటు జానకయ్యపేట, పెద్ద ,చిన్నతీనార్ల ,దొండవాక , ఎదుగుదల పేట, సీమయ్య పాలెం, అప్పలపాయకరావుపేట, చిన్నబోధి గల్లం ,ఆర్ అండ్ఆర్ కాలనీ ,రిజిస్టర్ కార్యాలయం వద్ద ఉండదని వినియోగదారుల సహకరించాలని కోరారు.

# ఉద్దండపురంలో అయ్యప్ప స్వామి విష్ యు మహోత్సవం

నక్కపల్లి/ అడ్డరోడ్డు , ప్రభాతవార్త



అయ్యప్ప స్వామి విష్ యు మహోత్సవం నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కేరళలో కొత్త సంవత్సర ప్రారంభాన్ని సూచించే ఈ ముఖ్య పండుగను అదే సాంప్రదాయ రీతిలో ఇక్కడ జరుపుకోవడం విశేషం.! హరిహరపుత్ర అయ్యప్ప స్వామి కమిటీ చైర్మన్ వీరంరెడ్డి రమేష్, ఉప చైర్మన్ వెలంశెట్టి శ్రీను, గురుస్వాములు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ విషు మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఉదయం అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి దర్శనంతో గ్రామస్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామివారికి భక్తులు, గ్రామ పెద్దలు, నాయకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విషు మహోత్సవానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామ కృష్ణ, పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి శీరం నరసింహమూర్తి, వైసీపీ మండల అధ్యక్షుడు గొర్ల గోవింద్ , ఉద్దండపురం గ్రామ ఎంపీటీసీ బచ్చల రాజు, మాజీ సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు తదితర నాయకులు హాజరై స్వామివారికి పాలాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల మండల నాయకులు, అయ్యప్ప భక్తులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విషు ఉత్సవాన్ని విజయవంతం చేశారు. కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ ఉత్సవం ఉద్దండపురం గ్రామంలో ఆధ్యాత్మిక శోభను నింపింది.

# భాష్యం ప్రైవేటు పాఠశాల ఆరో తరగతి ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

ఎలమంచిలి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



పట్టణంలో భాష్యం ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారంటూ పట్టణ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపిన వివరాలు ప్రకారం భాష్యం పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ప్రగడ నితిన్, కొలగాని బాలు బుధవారం మధ్యాహ్నం పాఠశాల విడిచిపెట్టిన తరువాత ఇద్దరు పిల్లలు కూడా ఇంటికి రాలేదని దీంతో వారి గురించి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పిల్లల ఆచూకీ తెలిపిన వారు పట్టణ ఎస్సై 9440796103 నెంబర్ కు వివరాలు తెలపగలరని కోరారు.



# గునుపూడిగ్రామంలో భారీ ర్యాలీ.!

(అనకాపల్లి/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త )

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా మండలంలోని గునుపూడి గ్రామంలో జై భీమ్ సభ్యులు దట్టే లోవ కృష్ణ ఆధ్వర్యంలో జై భీమ్ మెగా యూత్ గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువకులు పాల్గొని డా.బి.ఆర్ అంబేద్కర్ చరిత్రను తెలియజేశారు.

## నారా లోకేష్‌కు పదవిపై అచ్చెన్న హర్షం



కోటబొమ్మాళి, ఏప్రిల్ 15: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టు పెట్టడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలుగుదేశం మండలం పార్టీ అధ్యక్షుడు బోయిన సత్య శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక ఎన్టీఆర్ భవన్లో కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, మధ్య కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు జాతీయ ప్రధాన కార్యదర్శి గాను, తనకు పొలిట్ బ్యూరో సభ్యునిగ్గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, పి.ఎ.సి.ఎస్ అధ్యక్షురాలు వెలమల విజయ లక్ష్మి, వెలమల కామేశ్వరరావు, సాసు మహంతి ఆనందరావు, కర్రి అప్పారావు, బాడన రవణమ్మ, దేవాది సింహాద్రమ్మ , జెంది అన్నపూర్ణమ్మ, కోరాద గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో పీజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు : కోండ్రు



రాజాం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మండలం, శ్యాంపురం తెదేపా క్యాంప్ కార్యాలయంలో త్వరలో రాజాంలో పీజీ సెంటర్ ఏర్పాటు కోసం, పీజీ సెంటర్ కమిటీ సభ్యులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీజీ సెంటర్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తహసీల్దార్ రాజశేఖరంనకు పీజీ సెంటర్ కోసం సరైన మౌలిక సదుపాయాలకు అనువుగా ఉండే విధంగా స్థలాన్ని సమీకరించాలని ఆదేశాలు జారీ చేసారు. పీజీ సెంటర్ కమిటీ సభ్యులు శ్రీకాకుళం ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. సూర్యచంద్ర, శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.పోలినాయుడు, రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవితో పాటు కళాశాల అధ్యాపకులు డా. చౌదరి తారకేశ్వరరావు, డా. భాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం సంకిలి చక్కెరకర్మాగార ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.

## రాజాం మున్సిపల్ కమిషనర్‌కు అరుదైన గౌరవం



రాజాం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: రాజాం మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్లు చేయడంలో రాష్ట్రంలోనే రెండవ స్థానం సాధించినందుకు గాను, అలాగే పారిశుద్ధ్యం విషయంలో గాని, మంచి నీటి సరఫరాలో గాని మంచి స్థాయిలో పనిచేసి నందుకు గాను రాజాం మున్సిపల్ కమీషనర్ ఆకురాతి రామచంద్రరావుకు అమరావతిలోని సచివాలయంలో సి.డి ఎం.ఎ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజాం మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చెందే విధంగా ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ విధంగా కమిషనర్ రామచంద్రరావుకు ప్రశంసల జల్లు కురిపినందుకు మున్సిపల్ సిబ్బంది ఆయనపై హర్షం వ్యక్తం చేశారు.

## సీఐటీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



కొత్తూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : నంద్యాల వేదికగా ఈనెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న సిఐటియు 30వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం కొత్తూరు మండల కన్వీనర్ పనస రమేష్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. బుధవారం కొత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, గతంలో ఉన్న కార్మిక చట్టాలను కాలరాయడం దారుణమన్నారు. అలాగే, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించి, గతంలో ప్రభుత్వం దారిమళ్లించిన సంక్షేమ నిధులను తిరిగి కార్మికుల ప్రయోజనాల కోసమే వెచ్చించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు నిత్యావసర ధరలు పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తుంటే, మరోవైపు అవినీతి, అక్రమాలు మరియు నిర్బంధాలతో పేదలపై దాడులు జరుగుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర మహాసభల స్ఫూర్తితో ఎర్రజెండా నీడన అందరూ కలిసి రావాలని, మన హక్కులను కాపాడుకుందామని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సూర్యనారాయణ, రమేష్, జమ్మయ్య, రమణ, ఆనంద్, లక్ష్మినారాయణ, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## రత్తకన్న సంబరాల నిర్వహణకు శుభరాట



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామ దేవత పులకాసుని అమ్మవారి సంబరాల శుభరాట ఆవిష్కరించారు. మే 4 నుండి గ్రామ దేవత సంబరాలు నిర్వహిస్తారు. ప్రతి పదేళ్ళకు గ్రామ దేవత సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా శుభరాట ఆవిష్కరించారు.

## లాలాపేటలో వివాహ వేదిక సమస్య తీర్చండి



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు లాలాపేటలో వివాహ వేదిక సమస్య తీర్చాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. శ్రీశయన కుల పెద్దలతో ఎమ్మెల్యేని 17వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ జన్నెల సంతోష్ కుమార్ యాదవ్ కలిశారు. గత 35 సంవత్సరాలుగా కుటుంబ సభ్యుల వివాహ శుభకార్యములకు సరైన వేదిక లేదని ఆర్ అండ్ బి బంగ్లా ఆవరణలో అవకాశం కల్పించాలని కోరారు. ఆఫీసర్లతో మాట్లాడి తాత్కాలిక పరిష్కారం చూపించారు. దీనికి త్వరలో శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కస్టర్ మహమ్మద్ జిలాని, శ్రీశయన కుల ప్రెసిడెంట్ టెంక ఈశ్వరరావు, సెక్రటరీ విజయ్, వైస్ ప్రెసిడెంట్ కోటి, మాజీ ప్రెసిడెంట్ పైల గిరి, కోశాధికారి లావేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలదే హవా



కోటబొమ్మాళి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంపీసీకి చెందిన పొట్నూరు వైష్ణవి 454/470 మార్కులు, పిట్ట దీపిక మొదటి సంవత్సరం బైపీసీలో 449/455 మార్కులు, పైల వనిత ద్వితీయ సంవత్సరం బైపీసీలో 978/1000 మార్కులు, సెంకడ్ ఎంపీసీలో జోగి నరేష్ 976/1000 మార్కులు సాధించారు. సీఈసీలో మండల లక్ష్మినారాయణ 926/1000 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ అరంగి అప్పన్న, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే స్థానిక కస్తూరిభాగాంధీ కళాశాలకు చెందిన బైపీసీకి చెందిన గడ్డవలస దీపికా బైపీసీ 970/1000 మార్కులు సాధించింది. అలాగే మొదటి సంవత్సరం బైపిసీలో తమాడ పూర్ణ 442/455లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ కింతలి లక్ష్మిప్రసంతి, ఉపాధ్యాయురాలు అభినందించారు.

## పేదవాడి ఆకలి తీర్చడమే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : రాష్ట్రం లో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించ కూడ దనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోం దని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను ఆయన ఘనంగా ప్రారంభించారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అన్నాక్యాంటీన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించి భోజనాలను ప్రజలకు వడ్డించారు. అలాగే కూటమి నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి అన్నా క్యాంటీన్‌లో ఎమ్మెల్యే భోజనం చేశారు. జెడ్పీ సీఈఓ ఆర్ వెంకటరామన్, మండల అధికారులు, కూటమికి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో రాణించిన ప్రభుత్వ కళాశా విద్యార్థులు



కంచిలి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాణించారు. జాడుపూడి గ్రామంలో గల కేజీబీవీ ప్రథమ సంవత్సరంలో 32 మంది విద్యార్థులకు 30 మంది విద్యార్థులు పాస్ అయ్యారని అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 37 మంది గాను 37 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ తిరువాణి తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కాతల ఝాన్సీ 1000 మార్కులకు గాను 980 మార్కులు సాధించిందని, ప్రథమ సంవత్సరంలో దక్కత శిరీష 470గాను 457 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరికి పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

## టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సుజాత



ఆమదాలవలస, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఆమదా లవలసకు చెందిన తమ్మినేని సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాబితాను విడుదల చేశారు. ఇప్పటికే టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా సేవలను అందిస్తున్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి చేసిన కృషి, సేవలను గుర్తించి తమ్మినేని సుజాతకు సముచిత స్థానం కల్పించడంతో టీడీపీ కేడర్ అంతా ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. దీంతో ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ ఇచ్చిన ఈ గౌరవాన్ని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా తమ్మినేని సుజాత తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో తమకు అవకాశం కల్పించడం వలన పార్టీ బలోపేతానికి మరింత బాధ్యత పెరిగిందని వివరించారు.

## కార్యదర్శి నుంచి జాతీయ అధికార ప్రతినిధి వరకు..



రణస్థలం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : రాజకీయం అంటే కేవలం అధికారం మాత్రమే కాదు, అది నిరంతర ప్రజా సేవ అని నిరూపించిన నాయకుడు కలిశెట్టి అప్పల నాయుడు. ఒక కుగ్రామంలో సామాన్య కార్యకర్తగా అడుగులు వేసి, నేడు దేశ రాజధానిలో పార్టీ గళాన్ని వినిపించే జాతీయ అధికార ప్రతినిధి స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణం ఎందరో యువ నాయకులకు ఒక పాఠం. గ్రామ స్థాయి నుంచే పునాది ఏదైనా పెద్ద కట్టడానికైనా పునాది బలంగా ఉండాలి. అప్పలనాయుడు గారి రాజకీయ పునాది తన స్వగ్రామమైన వరాహ నర్సింహపురంలో పడింది. అక్కడ గ్రామ పార్టీ కార్యదర్శిగా ఆయన ప్రస్థానం మొదలైంది. గ్రామంలోని ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్ల డంలో ఆయన చూపిన చొరవ, నాయకత్వ లక్షణాలు తర్వాతి కాలంలో ఆయనను ఉన్నత శిఖరాలకు చేర్చాయి. ప్రజా క్షేత్రంలో అంచెలంచెలుగాకార్యకర్తగా ఆయన పడ్డ కష్టం వృథా పోలేదు. జిల్లా స్థాయి లో తెలుగు రైతు అధ్యక్షుడిగా రైతుల గొంతుకయ్యారు. ఆపై తెలుగు యువత అధ్యక్షుడిగా యువతను చైతన్య పరిచారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించిన అధిష్టానం ఆయనకు కీలక బాధ్యతల ను అప్పగించింది. ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్తగా క్షేత్రస్థాయిలో కేడర్‌ను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణ శిబిరం డైరెక్టర్‌గా ఎందరో కొత్త నాయకులను తీర్చిదిద్దారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సభ్యునిగా విద్యావ్యవస్థలో తనవంతు సూచనలు అందించారు.

## కార్యకర్తలే పార్టీకి బలం.. వారి సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం



కోటబొమ్మాళి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం ఎన్టీఆర్ భవన్‌లో ఇటీవల నియమితులైన నూతన మండల కమిటీ సభ్యులు మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సమిష్టిగా పని చేయాలని సూచించారు. తెలుగు దేశం పార్టీ సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతోందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బి.సత్య శ్రీనివాస్, జి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాస్ తదితర కమిటీ సభ్యులను మంత్రి అభినందించారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్లో టెక్కలి నియోజకవర్గ పరిధిలో 26 మంది లబ్ధిదారులకు రూ.23లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 22 నెలల్లో 304 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు 3 కోట్ల రెండు లక్షలు అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పోరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు పినకాన అజయ్‌కుమార్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పట్ట సింహాచలం, సాసుమంతు అనందరావు, దేవాది సింహాద్రమ్మ, అనపాన శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘన జీవామృతం తయారీ



కంచిలి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : పెద్ద కొజ్జిరియా గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ అధికారి పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు, బోర సరిత, ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్‌పి వి.రోజా ఆధ్వర్యంలో 200 కిలోల నాణ్యమైన ఘనజీవామృతం తయారు చేసి రైతులకు దాని ప్రాముఖ్యత, వినియోగం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం అందించే సుస్థిర సాగు విధానమని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న పదార్థాలతో తయారు చేసే ఘనజీవామృతం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రైతులకు ఘనజీవామృతం తయారీ విధానం, నిల్వ పద్ధతులు, ఎకరానికి అవసరమైన మోతాదు, వాడే సమయం వంటి అంశాలపై వివరించారు. గ్రామ రైతులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మీనా లీడ్ ఫార్మర్ బోర సరిత గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన ఇంటర్ విద్యార్థులు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మండలంలో నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో 81.42 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ గ్రూపులో ఎన్.కుసుమాంజలి 978/1000 మార్కులు సాధిం చారు. బైపిసి గ్రూపులో బి.దీపిక 959 మార్కులు సాధించారు. హెచ్‌ఈసి గ్రూపులో బి.విజయ లక్ష్మి 822 మార్కులు సాధించి ఆయా గ్రూపుల్లో కాలేజీ టాపర్లుగా నిలిచారు. ఈ కళాశాలలో 226 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 184 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు. అలాగే సంతబొమ్మాళి కస్తూరిబాగాంధీ విద్యాలయంలో రెండవ సంవత్సరం ఇంటర్మీ పరీక్ష ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్‌లో 89శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 35 మంది పరీక్షలు రాయగా నలుగురు పాస్ కాలేదు. మక్క స్రవంతి 978 మార్కులు, అర్జాల పూజ 976 మార్కులు, కొంచాడ పల్లవి 972 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 86శాతం ఉత్తీర్ణత సాధించారు.

## ఇచ్ఛాపురం విద్యార్థులు...



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ఇంటర్మీ డియెట్ పరీక్షా ఫలితాల్లో ఇచ్ఛాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గొల్లవీధినకు చెందిన దక్కత గోపినాథ్ రెడ్డి కుమారుడు దక్కత లక్ష్మినర్సింహారెడ్డి 987 మార్కులు సాధించాడు. విశాఖపట్నం శ్రీవిశ్వ కాలేజీలో చదువుతున్నాడు. 10వ తరగతిలో కూడా శాంతినికేతన్‌లో 499 మార్కులు సాధించాడు. బాలికల జూనియర్ కళాశాలలో అంజలి బెహరా 465, విష్ణు ప్రియారథో 879, బి.శరణ్య 946, గుర్ల మీన 466 సాధించారు. 192 మందికి గాను 107 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌లో గానాల ఈశ్వరి 966, బైరెడ్ల పూజ 949, ఆర్.రోహిత్ 934, ధనుంజయ్ 906, కె.స్వప్న 754, పి.అనూ 457, బి.మీన 434, బోర పావని 445, సాధించారు. ప్రిన్సిపాల్ వైకుంఠరావు విద్యార్థులను అభినందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్ర సాద్‌రెడ్డి కార్తికేయ 455 మార్కులు సాధించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో శత శాతం మార్కులు సాధించారు.

## ఇంటర్ ఫలితాల్లో మహేంద్ర విజయకేతనం.



పాతపట్నం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి తమ కళాశాల కీర్తిని చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలను ప్రిన్సిపాల్ మెట్ట ఆంజనేయులు తెలియజేశారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మువ్వల గుణశేఖర్ 988 మార్కులు, కిల్లి పవన్ కుమార్ 982 మార్కులు, బైపీసీ విభాగంలో పూజారి జోషిక 969 మార్కులు, మందరాడ చాందిని 964 మార్కులు సాధించారు. వీరితో పాటు 16 మంది విద్యార్థులు 900కు పైచిలుకు మార్కులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ ఆంజనేయులు పేర్కొన్నారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుబాబు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే



రణస్థలం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్‌ను బుధవారం రణస్థలం మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మరియు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ, ఆటో రిక్షా కార్మికులు, రోజూ వారీ కూలీలు, ఇతర వర్గాలకు చెందిన పేద ప్రజలకు ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం లభిస్తుందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఎన్ డీ ఎ ప్రభుత్వం నెరవేర్చడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేదలతో కలిసి భోజనం చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిన్నింటి వెంకట భానోజీనాయుడు, జీరు గురునాయుడు, మండపాక కనకారావు, నడుపూరు శ్రీను, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## ఇంటర్ ఫలితాల్లో 97.89 శాతం ... కరవంజి మోడల్ కళాశా ఫస్ట్



జలుమూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మండలంలోని కరవంజి మోడల్ స్కూల్ అండ్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 95 మందికి 93 మంది ఉత్తీర్ణులైనారు (97.89శాతం). అదే విధంగా ప్రథమ సంవత్సరంలో 97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరము విద్యార్థులు 82శాతం, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 71శాతం ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ సారిక తెలిపారు. అదే కళాశాల విద్యార్థిని ద్వితీయ సంవత్సరం బైపిసి గ్రూపులో 990/1000 పి.మౌనిక మార్కులు సాధించినట్లు తెలిపారు.

## సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ..

వీరఘట్టం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తన సత్తాను చాటుకుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో బి.దుర్గాభవాని 455 మార్కులకు గాను 450 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలను కనబరిచింది. అలాగే ఎంపీసీలో ఎస్.కె అఫ్రిన్ 470కు 449 మార్కులు సాధించాడు. అదేవిధంగా ద్వితీయ ఎంపీసీలో యు.పూర్ణచంద్రరావు 1000 మార్కులు గాను 966 మార్కులు సాధించాడు. ద్వితీయ బైపీసీలో ఎస్.మానస, ఎం.లక్ష్మీ ప్రసన్న 1000కు 905 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్ గ్రూప్‌కు సంబంధించి కె.ఉమ 1000కు 830 సాధించారు. అలాగే ఒకేషనల్ గ్రూపులో కూడా ఉత్తమ ఫలితాలను కనబరిచి కళాశాల పేరును ఇనుమడింపజేశారు. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 96శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ఒక ప్రత్యేకమైన స్థానంను సాధించినట్లు ప్రిన్సిపాల్ డి జి ఎస్ వి త్రినాథ్ ఆనందం వ్యక్తం చేశారు.

## ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులు



సంతకవిటి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు రిజల్ట్ బుధవారం విడుదలయ్యాయి. ఈ ఇంటర్మీడియట్ పరీక్షలో సంతకవిటి కాలేజీకి చెందిన సెకండ్ బైపీసీ విద్యార్థి లొట్ల పావని 962 మార్కులు, ఫస్ట్ ఎంపీసీ తుమ్మ కావ్య 450 మార్కులు, సెకండ్ ఎంపీసీ గడి ఉష 960 మార్కులు సాధించారు. అలాగే వాస్తవపట్నం కస్తూరిబాయి స్కూల్లో సెకండ్ ఇయర్ గున్నపూరు శ్రీవల్లి 730 మార్కులు, ఫస్ట్ ఇయర్ విద్యార్థిని కట్టమంచి లక్ష్మి 442 మార్కులు సాధించడం జరిగింది. ఫస్ట్ ఇయర్‌లో 135 మంది విద్యార్థులకు 55 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 131 మందికి 70 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందన తెలిపారు.

## అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి



సీతంపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం మండల స్థాయి అధికారులతో సమావేశం ఎం జి ఎన్ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థాయిలో పారదర్శకతతో పని చేసి ప్రజల్లో విశ్వాసం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీబీ మిశ్రా తహసిల్దార్ శ్రీకన్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వివిధ శాఖల చెందిన అధికారులు హాజరయ్యారు.

## జగన్‌తో మాజీ స్పీకర్ తమ్మినేటి భేటీ



ఆమదాలవలస, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తాడేపల్లిలో బుధవారం భేటీ అయ్యారు. ఇరువురి మధ్య కాసేపు జిల్లా రాజకీయ పరిస్థితులను చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ భవిష్యత్తు, ప్రభుత్వ వ్యతిరేక పవనాలు మరియు ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా సాగాల్సిన వ్యూహాలపై జగన్ లోతుగా విశ్లేషించారు. ముఖ్యంగా ఆమదాలవలస నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని తమ్మినేని సీతారాం అధినేతకు వివరించారు. ఈ తరుణంలో పార్టీ క్యాడర్ అంతా ఐక్యమత్యంతో ముందుకు సాగితే రానున్న ఎన్నికల్లో విజయం తథ్యమని తమ్మినేని వివరించారు. దానికి స్పందించిన జగన్ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను సమన్వయం చేస్తూ ఎంపీ సీటును పార్టీ ఖాతాలో వేయడమే ఏకైక లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాలో పార్టీని తిరుగులేని శక్తిగా మార్చాలంటే జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మరియు పార్లమెంటరీ ఇంచార్జ్ తమ్మినేని సీతారాం ఇరువురూ సమన్వయంతో,అత్యంత ఐక్యంగా పనిచేయాలని జగన్ ఆకాంక్షించారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకోవడంలో ఈ ఇద్దరు దిగ్గజ నేతల ఐక్యత జిల్లాలో పార్టీకి శ్రీరామరక్ష అని జగన్ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

## గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం : అచ్చెన్న



కోటబొమ్మాళి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయాశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం మండలంలోగల కురుడు రామయ్యపేట గ్రామాలకు రూ.1.20కోట్లు వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అలాగే రామయ్యపేటలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ, దాసరిపేట గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ జలజీవన్ మిషన్ రక్షిత మంచినీటి పథకం శంకుస్థాపన, దంత గ్రామంలో పలు సీసీరోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ప్రారంభించిన రహదారులు 2019లో శంకుస్థాపన చేసినవేనని అప్పుడు జరిగిన ఎన్నికల్లో మనం ఓడిపోతే వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోలేదని, మళ్ళీ మనం అధికారం వచ్చిన తరువాత పనులు పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. రామయ్యపేట గ్రామంలో ప్రతి వీధికి సీసీరోడ్డు, డ్రైనేజీలు, ఇంటింటికి త్రాగునీరు అందిస్తానని ఎన్నికల్లో మాట ఇచ్చానని ఇచ్చిన మాట ప్రకారం అవన్నీ పూర్తి చేశారని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగకోమటి అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, నంబాళ శ్రీనివాస్, ఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, దేశం సీనియర్ నేతలు బాడాన రమణమ్మ, నాళ్ళ ఆదినారాయణ (చిన్ని), దేవాది సింహాద్రమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

## మేజర్ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శన



పాతపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : పాతపట్నం మేజర్ పంచాయతీకి సంబంధించి 2026 ఏడాదికి గాను రూపొందించిన ఓటర్ల ముసాయిదా జాబితాను బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఈఓ వి.రామచంద్రరావు, పంచాయతీ సిబ్బంది బహిరంగపరిచారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియను పూర్తి చేసినట్లు వెల్లడించారు. పంచాయతీ పరిధిలోని ఓటర్ల వివరాలతో కూడిన జాబితాను ప్రజల పరిశీలనార్థం పంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించి పారదర్శకత పాటిస్తున్నట్లు ఈఓ రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, ఓటర్లు తమ పేర్లు మరియు వివరాలను ఈ జాబితాలో సరిచూసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

15-04pg10.qxd:15-04pg10.qxd 1/1/02 6:10 AM Page 1





బార్సిలోనా ఓపెన్‌లో

# విర్టానెన్‌పై అల్కరాజ్ విక్టరీ

ఆట

**న్యూఢిల్లీ:** బార్సిలోనా ఓపెన్-2026లో విర్టానెన్‌పై కార్లోస్ అల్కరాజ్ విజయం సాధించాడు. ప్రపంచ నంబర్ టూ కార్లోస్ అల్కరాజ్ ఫిన్నిష్ క్వాలిఫయర్ ఒట్టో విర్టానెన్‌పై 6-4, 6-2 తేడాతో సునాయాస విజయం సాధించి, తన మూడవ బార్సిలోనా ఓపెన్ టైటిల్ వేటను ప్రారంభించాడు. ప్రపంచ 130వ ర్యాంకర్ విర్టానెన్ బలంగా ప్రారంభించి అల్కరాజ్ సర్వ్‌ను గట్టిగా ఎదుర్కొంటూనే, తన స్థానాన్ని సాపేక్షంగా సునాయాసంగా నిలబెట్టుకున్నాడు. అయితే, మొదటి సెట్‌లోని 10వ మరియు చివరి గేమ్‌లో అల్కరాజ్ ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆధిక్యం సాధించాడు. రెండవ సెట్‌లో, ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు బ్రేక్‌లు సాధించగా, చివరకు అల్కరాజ్ లవ్‌తో బ్రేక్ చేసి 4-1 ఆధిక్యాన్ని పటిష్టం చేసుకున్నాడు. విర్టానెన్ సర్వ్‌పై అల్కరాజ్ ట్రిపుల్ మ్యాచ్ పాయింట్‌ను సంపాదించి, వాటిలో మొదటిదాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రాస్‌కోర్ట్ విన్నర్‌ను కొట్టాడు. అంతకుముందు, రెండో సీడ్ లొరెంజో ముసెట్టి, మార్టిన్ లండలూస్‌ను 7-5, 6-2 తేడాతో ఓడించి, ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత తన తొలి విజయాన్ని నమోదు చేశాడు. ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినార్, సెబాస్టియన్ ఓఫ్నర్‌ను 7-6 (9/7), 6-4 తేడాతో ఓడించగా, కరెన్ ఖచనోవ్ కామిలో ఉగో కారబెల్లి చేతిలో 6-3, 6-4 తేడాతో అనూహ్యంగా ఓటమి చవిచూశాడు. కాగా ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత రెండో రౌండ్‌లో చెక్ దేశస్థుడైన టోమాస్ మచాక్‌తో అల్కరాజ్ తలపడనున్నాడు.




# దీప్తికి విజ్డెన్ క్రికెటర్ అవార్డు

## తొమ్మిది విభాగాల్లో 7 టీమిండియాకే..

**న్యూఢిల్లీ:** విజ్డెన్ అల్మానాక్ 2026 అవార్డుల్లో భారత క్రికెటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. తొమ్మిది విభాగాల్లో ఏడింటిని కైవసం చేసుకున్నారు. స్వదేశం వేదికగా ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ 22 వికెట్లు పడగొట్టడంతో పాటు, 215 రన్స్ చేసింది. ఈ విధంగా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో రాణించిన దీప్తి టీమ్ఇండియా వరల్డ్‌కప్ గెలువడంలో కీలకంగా వ్యవహరించింది. వీటిని పరిగణనలోకి తీసుకున్న విజ్డెన్ దీప్తిని వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ఎంపిక చేసింది. టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా అభిషేక్‌శర్మ ఎంపిక కాగా, ఫైవ్ క్రికెటర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డు జాబితాలో టీమ్ఇండియా నుంచి గిల్, సిరాజ్, పంత్, జడేజా చోటు దక్కించుకున్నారు. గతేడాది ఇంగ్లండ్ టూర్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన హైదరాబాద్ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా విజ్డెన్ ఫైవ్ క్రికెటర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డులను సొంతం చేసుకున్నారు.

ఇంగ్లండ్ బ్యాటర్ హసీబ్ హమీద్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక విదేశీ ప్లేయర్‌గా ఉన్నాడు. మెన్స్ విభాగంలో అభిషేక్ శర్మకు టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు లభించింది. గత సీజన్లో అభిషేక్ 21 మ్యాచ్లో 193 స్ట్రయిక్ రేట్తో 859 రన్స్ సాధించాడు. ఇందులో ఓ సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆల్రౌండర్ దీప్తి శర్మ విమెన్స్ క్రికెటర్ ఆఫ్ దఇయర్‌గా ఎంపికైంది. ఇంగ్లండ్‌తో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో సిరాజ్ 23 వికెట్లతో ఇంగ్లిష్ జట్టును వణికిస్తే, గిల్ 754 రన్స్ చేశాడు. రిషబ్ పంత్ కాలివేలి గాయంతోనూ పోరాడి కీలకపరుగులు సాధించిజట్టుకు అండగానిలిచాడు. పంత్, జడేజాల పోరాటంతో టీమిండియా ఆ సిరీస్ను 2-2తో డ్రా చేసుకోగలిగింది. మిచెల్ స్టార్కుకు మెన్స్ క్రికెటర్ ఇన్ ద వరల్డ్ పురస్కారం లభించింది.



## మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్..

# స్పెయిన్ పై ఇంగ్లండ్ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్‌లో స్పెయిన్‌ను 1-0 తేడాతో ఓడించిన ఇంగ్లండ్ మరోసారి విజయం సాధించింది. లండన్‌లోని వెంబ్లీ స్టేడియంలో స్పెయిన్‌తో జరిగిన మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్‌లో లారెన్ హెంప్ మూడవ నిమిషంలో కొట్టిన గోల్ ఆట ఫలితాన్ని తేల్చి చెప్పింది. దీంతో యూరోపియన్ ఛాంపియన్ ఇంగ్లాండ్ 100 శాతం రికార్డుతో గ్రూప్ ఎ3లో అగ్రస్థానంలో నిలిచింది. ఇది గత ఏడాది జరిగిన యూరోస్ ఫైనల్, 2023 ప్రపంచ కప్ ఫైనల్‌కు పునరావృతం కాగా, మహిళల క్రీడలోని ఈ దిగ్గజాల మధ్య జరిగిన తాజా ముఖాముఖి పోరు కావడం విశేషం. యూరోస్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించి వరుసగా రెండు టైటిళ్లను గెలుచుకున్నప్పటికీ, 2023లో స్పెయిన్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచంలో 4వ ర్యాంకులో ఉన్న ఇంగ్లాండ్, ఆట ఆరంభంలోనే లభించిన కార్నర్ కిక్‌ను హెంప్ గోల్‌గా మలచడంతో, 1వ ర్యాంకులో ఉన్న స్పెయిన్‌పై విజయాన్ని ఖాయం చేసుకుంది. స్పెయిన్ క్రీడాకారిణి అలెక్సియా పుటెల్లాస్ ఆ బంతిని క్లియర్ చేశానని భావించినప్పటికీ, అది గోల్ లైన్ దాటకుండా ఆపలేకపోయింది. ఇక 2027 మహిళల ప్రపంచ కప్ బ్రెజిల్‌లో జరగనుంది.

## వన్డే వరల్డ్ కప్ నుండి..

# టీమిండియాలో 8 మంది ఔట్

## భవిష్యత్ సారథిగా శుభ్‌మన్ గిల్!.. బరిలో యువరక్తం, అనుభవం కలసిన కొత్త టీం



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2026 టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి కప్పు గెలిచిన జోరులో ఉన్న భారత్, వన్డే ఫార్మాట్‌లో మాత్రం సమూల మార్పులకు శ్రీకారం చుట్టనుంది. వన్డే క్రికెట్ అనేది సహనం, సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేవలం మెరుపు దాడి చేసే ఆటగాళ్లను కాకుండా, ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై క్రికెట్ బోర్డు మొగ్గు చూపుతోంది. టీ20 ప్రపంచకప్‌లో మెరిసిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లకు 2027 వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే టీమిండియా జట్టులో చోటు దక్కకపోవచ్చు. వీరంతా ప్రధానంగా టీ20 స్పెషలిస్టులుగా ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ లేకపోవడం వీరి ఎంపికపై ప్రభావం చూపుతోంది. అయితే, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీరు అద్భుతంగా రాణిస్తే తప్ప పునరాగమనం కష్టమే అన్న చర్చ జరుగుతోంది. భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను సిద్ధం చేయాలని సెలక్టర్లు ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలు రాకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం గిల్‌కు ఉందని యాజమాన్యం నమ్ముతోంది. ఓపెనర్‌గా గిల్ ఇచ్చే ఆరంభాలు జట్టుకు అత్యంత కీలకం కానున్నాయి. ఇక వయసుపైబడుతున్నా, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు కొండంత అండగా ఉంటుందనే దిశగా ఆలోచన చేస్తున్నారు. వన్డేల్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ భారత్‌కు అవసరమని భావిస్తున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే జట్టులో ఉండటం ఖాయం. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా జట్టుకు వెన్నెముకలా నిలవనున్నారు. ప్రపంచకప్ 2027 కోసం టీమిండియాలో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, యశస్వి జైస్వాల్ ఉండే అవకాశాలు ఉన్నాయి.



# జవోఖిర్‌కు ఫిడే కాండిడేట్స్ టైటిల్

## వైశాలి డ్రా, దివ్య ఓటమి

**న్యూఢిల్లీ:** ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోఖిర్ సిందరోవ్ ఒక రౌండ్ మిగిలి ఉండగానే 2026 ఫిడే కాండిడేట్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ ఏడాది చివర్లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం అర్హతను సంపాదించుకున్నాడు. టోర్నమెంట్‌లో ఆరంభంలోనే ఆధిక్యం సాధించిన సిందరోవ్, చివరికి ముందు రౌండ్‌లో తన సమీప ప్రత్యర్థి అనీష్ గిరితో నల్ల పావులతో డ్రా చేసుకుని, టైటిల్ విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. 20 ఏళ్ల సిందరోవ్ ప్రస్తుతం 13 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో ఉన్నాడు. ఇందులో నాలుగు మ్యాచ్‌ల విజయ పరంపరతో సహా ఆరు విజయాలు ఉన్నాయి. క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచిన ఈ టోర్నమెంట్‌లో అతను ఇప్పటికీ అజేయంగా కొనసాగుతున్నాడు. కాగా భారత్ గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు, చైనాకు చెందిన టాన్ జోంగ్యీతో జరిగిన సెమీఫైనల్ రౌండ్‌లో డ్రా చేసుకోవడంతో, 2026 మహిళా అభ్యర్థుల పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. నల్ల పావులతో ఆడుతున్న వైశాలి, టాన్ డ్రాతో బయటపడటానికి అవకాశం ఇచ్చే ముందు బలహీనమైన స్థితిలో ఉంది. 13 రౌండ్ల తర్వాత ఆమెకు ఇప్పుడు 7.5 పాయింట్లు ఉన్నాయి. ఇంతలో, అగ్రగాములు వైశాలి. జు జినెర్‌ల కంటే అర పాయింట్ వెనుకబడి చివరి రౌండ్‌కు ముందు రౌండ్‌ను ప్రారంభించిన బిబిసారా అసౌబాయేవా, తెల్ల పావులతో అన్నా ముజిచుక్‌ను ఓడించి, 13 రౌండ్ల తర్వాత 7.5 పాయింట్లకు ఎగబాకింది. మరోవైపు, నల్ల పావులతో ఆడిన కేటెరీనా లాగ్నో చేతిలో ఓడిపోవడంతో దివ్య దేశ్‌ముఖ్ పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ భారత యువ క్రీడాకారిణి ఇప్పటివరకు 5 పాయింట్లు సాధించింది.

# ఆగని లేఆఫ్‌లు

## 231 టెక్ కంపెనీలు.. 91 వేల మందికిపైగా తొలగింపు

## వణుకుతున్న ఉద్యోగులు.. ప్రతి ఐదుగురిలో ఒకరికి ఉద్వాసన

## స్నాప్ఇంక్‌లో 20%, డిస్నీలో 1000 మంది ఉద్యోగులపై వేటు

వాణిజ్యం




**ముంబై, ఏప్రిల్ 15:** ప్రస్తుత రోజుల్లో ఉద్యోగం ఎప్పటివరకు ఉంటుందో.. ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పెద్ద కంపెనీల్లో కూడా ఉద్యోగాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఆర్థిక మాంద్యం భయాలు పారిశ్రామిక రంగాన్ని కుదిపేస్తున్నాయి. మరోవైపు ఏఐ వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో ఐటి రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. వందలాది కంపెనీలు ఏఐ వినియోగంపై దృష్టి సారించి, ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కొవిడ్ సంక్షోభం నుంచి బయటపడిన సమయంలో అవసరానికి మించి చేసుకున్న నియామకాల్ని ఇప్పుడు సర్దుబాటు చేసుకుంటున్నాయి. ఇక 2026 సంవత్సరంలో దాదాపు 231 టెక్ కంపెనీలు సుమారు 91 వేల మందికిపైగా ఉద్యోగుల్ని తొలగించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఇప్పటికే ఒరాకిల్, అమెజాన్, మెటా, యుపిఎస్ ఇలా పెద్ద పెద్ద కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించగా.. వీటిల్లో ఒరాకిల్ ఒక్కటే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 30 వేల మంది వరకు ఉద్యోగులపై వేటు వేసింది. ఏఐ డేటా సెంటర్లకు నిధుల కోసం ఈ కోతలు విధించినట్లు తెలిసింది. ఇంకా అమెజాన్ కూడా గత అక్టోబర్ నుంచి వేల సంఖ్యలో ఉద్యో గుల్ని తొలగిస్తూ వస్తోంది. మెటా తన రియాల్టీ ల్యాబ్స్, ఇతర విభాగాల నుంచి దాదాపు 1500 మంది ఉద్యోగులపై వేటు వేసింది. డెల్, క్రిప్టో.కామ్, యుపిఎస్, ఇ బే, వైస్‌టెక్ ఇలా పలు టెక్ సంస్థలు ఇదే బాటలో 2026లో ఉద్యోగాల కోతల్ని ప్రకటించాయి. ప్రధానంగా ఏఐ ద్వారా కార్యకలాపాల్ని పెంచుకు నేందుకు సంస్థలు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి.

**స్నాప్ ఇంక్‌లో 20 శాతం సిబ్బందిపై వేటు!**

ఇప్పుడు టెక్ రంగానికే చెందిన మరో కంపెనీ అదే బాటలో పయనిస్తోంది. అదే స్నాప్‌చాట్ పేరెంట్ కంపెనీ, అమెరికన్ టెక్ సంస్థ స్నాప్ ఇంక్. ఇది ఏప్రిల్ 16నే ఉద్యోగుల్ని తొలగించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. స్నాప్ మొత్తం ఉద్యోగుల సంఖ్య సుమారు 5 వేలుగా ఉండగా.. ఇందులో 15-20 శాతానికి సమానమైన దాదాపు 750 నుంచి 1000 మంది వరకు ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు తెలుస్తోంది.

అంటే ఈ లెక్కన ప్రతి ఐదురుగు ఉద్యోగుల్లో ఒక ఉద్యోగిని తొలగించనున్నారని చెప్పొచ్చు. ఇంకొన్ని టీమ్‌ల్లో ఉద్యోగుల సంఖ్యను దాదాపు సగానికి తగ్గించనున్నారని రిపోర్ట్స్ ద్వారా తెలిసింది. అయితే కచ్చితంగా ఎంత మంది ఉద్యోగులపై ఈ లేఆఫ్స్ ప్రభావం చూపిస్తుందన్న దానిపై సరైన స్పష్టత లేదు. ఇక్కడ కంపెనీ ప్రధానంగా పాత స్నాప్‌చాట్ వ్యాపారం నుంచి నిధుల్ని తగ్గించి.. కొత్త సబ్సిడరీ స్పెక్స్ విభాగంపై (ఆగ్మెంటెడ్ రియాల్టీ) దృష్టి సారించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే దీని కింద ఉద్యోగుల్ని నియమించుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. స్పెక్స్ విభాగం కోసం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ యోచిస్తోంది. ఇదే సమయంలో ఇటీవల పర్‌ప్లెక్సిటీ ఏఐతో స్నాప్‌ను విలీనం చేయాలనుకున్న సుమారు 400 మిలియన్ డాలర్ల విలువైన డీల్ రద్దు కావడం కూడా లేఆఫ్స్‌కు కారణంగా తెలుస్తోంది.

**డిస్నీలో 1,000 మంది తొలగింపు**

ఐటి, ఈ-కామర్స్, వినోద రంగాల్లోనూ లేఆఫ్‌ల పరంపరం కొనసాగుతోంది. తాజాగా ప్రముఖ హాలీవుడ్ వినోద సంస్థ 'ద వాల్ట్ డిస్నీ కంపెనీ' భారీ స్థాయిలో ఉద్యోగాల కోతను ప్రకటించింది. సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సిఇఓ జోష్ డి అమారో తెలిపారు. ఈ మేరకు ఉద్యోగులకు ఒక మెమో పంపారు. మార్కెటింగ్ విభాగం, స్టూడియోలు, టీవీ వ్యాపారాలు, ఈఎస్‌పీఎన్, ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీతో పాటు కొన్ని కార్పొరేట్ విభాగాల్లో ఈ కోతలు ఉండబోతున్నాయి. మార్కెటింగ్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అసద్ అయ్యాజ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'యూనిఫైడ్ మార్కెటింగ్ స్ట్రక్చర్'లో భాగంగా ఈ మార్పులు చేస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. వినోద రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా, సాంకేతికతతో కూడిన శ్రామిక శక్తిని నిర్మించేందుకు, కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు ఈ నిర్ణయం అవసరమైందని డి అమారో తన మెమోలో పేర్కొన్నాడు.

# ట్రంప్ ప్రకటనతో మార్కెట్లు జోష్

## సెన్సెక్స్ 1,264 పాయింట్లు పెరుగుదల

## నిఫ్టీ 388.65 పాయింట్లు వృద్ధి

**ముంబై, ఏప్రిల్ 15:** ఇరాన్‌తో ఘర్షణ ముగింపు దశకు చేరుకుంటోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే ఆశావాదంతో భారత ఈక్విటీ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను, రిస్క్ తీసుకునే ధైర్యాన్ని పెంచింది. బెంచ్‌మార్క్ సూచీలు లాభాలతో సెషన్‌ను ముగించాయి. నిఫ్టీ 1.63 శాతం, అంటే 388.65 పాయింట్లు పెరిగి 24,231.30 వద్ద ముగిసింది. సెన్సెక్స్ కూడా 1.64 శాతం, అంటే 1,264 పాయింట్లు పెరిగి 78,111.24 వద్ద స్థిరపడింది. దీంతో బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల విలువ దాదాపు రూ.10 లక్షల కోట్ల మేరపెరిగింది. ఈర్యాలీకేవలం హెవీవెయిట్ షేర్లకే పరిమితం కాలేదు. మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలుకూడా ప్రధాన సూచీలను మించి రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 2.20 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 2.35 శాతం మేర లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే, నిర్మాణ రంగ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఐటీ, మీడియా రంగాల్లోనూ కొనుగోళ్ల ఆసక్తి



కనిపించింది. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ మాత్రం వెనుకబడింది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 24,300- 24,400 స్థాయిలు కీలక నిరోధక జోన్‌గా ఉన్నాయి. ఈ స్థాయిని నిఫ్టీ బలంగా దాటితే 24,800- 25,000 వైపు ర్యాలీ కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కిందకు వస్తే, 24,000 వద్ద తక్షణ మద్దతు ఉండగా, 23,900-23,800 మధ్య బలమైన మద్దతు లభించవచ్చని తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికా- ఇరాన్ రెండో విడత చర్చల తర్వాత మెరుగుపడిన సెంటిమెంట్ మద్దతుతో రూపాయి 93.36 వద్ద స్వల్పంగా బలపడింది. ఈ చర్చల ఫలితంగా రెండు సెషన్లుగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. "ప్రస్తుతం 94-95 డాలర్ల శ్రేణికి చేరువవుతున్న తక్కువ ముడి చమురు ధరలు, భారతదేశ దిగుమతుల బిల్లుపై ఒత్తిడిని తగ్గిస్తూ, కరెన్సీకి స్వల్పకాలిక ఉపశమనాన్ని అందిస్తున్నాయి" అని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు.



## పట్టాలెక్కనున్న నాన్ ఎసి

# క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

## -త్వరలో ముంబయిలో అందుబాటులోకి..

**ముంబై, ఏప్రిల్ 15:** రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. నాన్ ఎసి క్లోజ్డ్ డోర్ లోకల్ రైలును త్వరలోనే ముంబైలో ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొట్ట మొదటి సారిగా నాన్‌ఎసి, ఆటోమేటిక్ డోర్లు మూసుకునే సదుపాయం ఉన్న లోకల్ రైలును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. రద్దీగా ఉండే రైళ్ల నుంచి ప్రయాణికులు జారిపడి జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం కల్పించడం ఈ కొత్త రైలు రూపకల్పన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ముంబైలో కేవలం ఖరీదైన ఎసి లోకల్ రైళ్లకు మాత్రమే ఆటోమేటిక్ క్లోజ్డ్ డోర్ వ్యవస్థ ఉంది. అయితే, సాధారణ తరగతి ప్రయాణికులకు కూడా ఎసి రైళ్ల తరహా భద్రతను తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న రైలును రూపొందించారు. ఇందులో ఎసి లేనప్పటికీ, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా 'ఫోర్స్డ్ వెంటిలేషన్ సిస్టమ్' అనే అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ వ్యవస్థ రైలు డోర్లు మూసి ఉన్నా కూడా కోచ్‌లలోకి నిరంతరం స్వచ్ఛమైన గాలిని పంపింగ్ చేస్తుంది. తద్వారా సాధారణ రైళ్ల కంటే ఎక్కువ గాలి ప్రసరణ జరిగి, లోపల వాతావరణం చల్లగా ఉంటుంది.

ఈ సరికొత్త రైలు రేక్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్)లో తయారు చేశారు. త్వరలోనే ముంబై సబర్బన్ ట్రాక్‌లపై దీని ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందులో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గార్డు లేదా మోటార్‌మ్యాన్‌తో మాట్లాడేందుకు 'టాక్‌బ్యాక్' సిస్టమ్, మెరుగైన సీటింగ్ అమరిక, ఎల్ఇడి లైటింగ్, రాబోయే స్టేషన్ల వివరాలను ప్రదర్శించే జిపిఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి.

ఈ రైలు టికెట్ ధరలపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఎసి లోకల్ రైలు ఛార్జీల కంటే గణనీయంగా తక్కువగా, సాధారణ ఫస్ట్ క్లాస్ లేదా సెకండ్ క్లాస్ ధరలకు దగ్గరగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ట్రయల్స్ విజయవంతమైతే, ముంబై రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునీకరించే ప్రణాళికలో భాగంగా ఇలాంటి మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డు యోచిస్తోంది.

# భారత్- అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలు

## -వచ్చేవారం అగ్రరాజ్యానికి ఇండియన్ అధికారులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** భారత్- అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలు ప్రారంభం కానున్నా యి. అమెరికాతో కీలక వాణిజ్య చర్చల కోసం భారత అధికారుల బృందం ఏప్రిల్ 20 నుంచి వాషింగ్టన్‌ను సందర్శించనున్నట్లు అదనపు కార్యదర్శి దర్పణ్ జైన్ పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య ఇప్పటికే తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. తాజా చర్చల్లో ఈ ఒప్పందంపై



ఇరుదేశాలు ఫ్రేమ్ వర్క్‌ను ఖరారు చేయనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ఇప్పటికే ఖరారైన నేపథ్యంలో ఈ ద్వైపాక్షిక భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. వాస్తవానికి ఈ ఒప్పందంపై ఈ ఏడాది మార్చిలోనే సంతకాలు జరగాల్సి ఉంది. అయితే, అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పుతో అక్కడి టారిఫ్ విధానాల్లో అనూహ్య మార్పులు జరిగాయి. అమెరికా నూతన గ్లోబల్ టారిఫ్ విధానం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాతే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికారిక వర్గాలు గతంలోనే స్పష్టం చేశాయి. మరోవైపు, అమెరికా సెక్షన్ 301 కింద రెండు వేర్వేరు దర్యాప్తులు చేపడుతున్న తరుణంలో వచ్చే వారం వాషింగ్టన్‌లో జరగనున్న భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.